www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 4-3-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 319 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి ఉ. 8.50 తదుపరి నవమి; నక్షత్రం: జ్యేష్ఠ సా. 4.22 తదుపరి మూల; వర్జ్యం: రా. 12.15-1.49; దుర్ముహూర్తం: మ. 12.51-1.38, మ. 3.12-3.59; అమృతఘడియలు: ఉ.7.24-9.02; రాహుకాలం: ఉ.7.30-9.00; సూర్యోదయం: 6.35; సూర్యాస్తమయం: 6.20 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రెండో రౌండ్‌కు హుస్సాముద్దీన్

బస్టో ఆర్సిజియో (ఇటలీ): ప్రపంచ ఒలింపిక్ బాక్సింగ్ క్వాలిఫయర్స్‌లో తెలుగు బాక్సర్ మహ్మద్ హుస్సాముద్దీన్ రెండో రౌండ్‌లోకి ప్రవేశించాడు. 57 కిలోల విభాగం తొలి రౌండ్‌లో బై లభించడంతో హుస్సామ్ పోటీ పడకుండానే నేరుగా రెండో రౌండ్ చేరుకున్నాడు. శుక్రవారం రెండో రౌండ్ జరగనుంది. మిగతా భారత బాక్సర్లలో దీపక్ బోరియా (51 కి) 2-3తో హుసేనోవ్ నిజాత్ (అజర్‌బైజాన్) చేతిలో ఓడగా, నరీందర్ (92 కి +) 0-5తో నెల్వీ టిఫాక్ (జర్మనీ) చేతిలో పరాజయం పాలయ్యాడు.

ఇండో-పాక్ మ్యాచ్ టికెట్ రూ.1.8 కోట్లా?

రీసేల్ మార్కెట్‌లో అ'ధర'హో

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య మ్యాచ్ అంటే ప్రపంచ క్రికెట్‌లో ఎనలేని క్రేజ్. అమెరికాలో జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌లో జూన్ 9న న్యూయార్క్‌లో జరిగే ఈ ఇండో-పాక్ జట్ల మ్యాచ్ టిక్కెట్లకు కూడా ఊహించని డిమాండ్ ఏర్పడింది. అధికారిక వెబ్‌సైట్‌లో ఈ మ్యాచ్ కోసం ప్రత్యేకంగా మూడు కేటగిరీలుగా రూ. 14 వేల నుంచి 33 వేల వరకు (175, 300, 400 డాలర్లు) ధరలను నిర్ణయించారు. అయితే, అమ్మకాలు ఆరంభమైన కొద్ది సేపటికే అధికారిక సైట్‌లో టిక్కెట్లు మొత్తం అమ్ముడవగా.. రీసేల్ మార్కెట్‌లో కొన్ని టిక్కెట్లు ఎక్కువ ధరకు దర్శనమిస్తున్నాయి. వీఐపీ టిక్కెట్ల ధరలు రూ. 33 వేలు (400 డాలర్లు) ఉండగా.. రీసేల్‌లో రూ. 33 లక్షలు (40,000 డాలర్లు) పలుకుతున్నాయి. ఎన్‌బీఏ ఫైనల్‌కు ఎంతటి డిమాండ్ ఉంటుందో.. ఈ మ్యాచ్‌కు కూడా అదే తరహాలో క్రేజ్ ఉండడం విశేషం. రీసేల్ సైట్లలో అతి తక్కువ ధర టిక్కెట్ అంటే రూ. 96 వేలు (1166 డాలర్లు)గా ఉంది. సీట్ గీక్ అనే సేల్స్ వెబ్‌సైట్‌లో సెక్షన్ 500 టిక్కెట్ ధర ఏకంగా రూ. 1.86 కోట్లు (ఫీజులతో కలిపి) పలుకుతుండడం అందరినీ నోరెళ్లబెట్టేలా చేస్తోంది.

విదిత్‌పై ప్రజ్ఞానంద విజయం

ప్రేగ్ (చెక్ రిపబ్లిక్): సీనియర్ గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోష్ గుజరాతికి యువ జీఎం ప్రజ్ఞానంద షాకిచ్చాడు. ప్రేగ్ ఇంటర్నేషనల్ చెస్ ఫెస్టివల్ ఐదో రౌండ్ పోటీల్లో విదిత్‌పై ప్రజ్ఞానంద విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో చెక్ జీఎం డేవిడ్ చేతిలో గుకేష్ ఓటమి పాలయ్యాడు. ఐదో రౌండ్ ముగిసేసరికి ప్రజ్ఞానంద 2.5 పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచాడు.

ఢిల్లీ హ్యాట్రిక్


రాధా యాదవ్ (3/20)


జొనాసెన్ (3/22)

- లానింగ్ అర్ధసెంచరీ
- గుజరాత్‌కు నాలుగో ఓటమి

మహిళల ప్రీమియర్ లీగ్

నేటి మ్యాచ్
యూపీ X బెంగళూరు
రాత్రి 7.30 గం. నుంచి

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ అదరగొడుతోంది. తమ ఆరంభ మ్యాచ్‌లో మాత్రమే ఓడిన ఢిల్లీ ఆ తర్వాత జోరు కొనసాగిస్తూనే ఉంది. ఆదివారం గుజరాత్ జెయింట్స్‌ను 25 రన్స్ తేడాతో ఓడించి హ్యాట్రిక్ విజయాన్ని అందుకుంది. అలాగే ఆరు పాయింట్లతో, మెరుగైన రన్‌రేట్‌తో ముంబైని వెనక్కినెట్టి పట్టికలో టాప్‌నకు దూసుకెళ్లింది. ఇక విజయమే లేకుండా వరుసగా నాలుగో ఓటమితో జెయింట్స్ దాదాపుగా ప్లేఆఫ్స్ నుంచి వైదొలిగింది. ఈ మ్యాచ్‌లో చెత్త ఫీల్డింగ్‌తో మూడు కీలక క్యాచ్‌లను వదిలేసి మూల్యం చెల్లించుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ 20 ఓవర్లలో 8 వికెట్లకు 163 పరుగులు చేసింది. మెగ్ లానింగ్ (41 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్‌తో 55), క్యాప్సీ (17 బంతుల్లో 5 ఫోర్లతో 27) సత్తా చాటారు. మేఘనా సింగ్‌కు 4, గార్డ్‌నర్‌కు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 138/8 స్కోరుకే పరిమితమై ఓడింది. ఆష్లే గార్డ్‌నర్ (31 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 40) మాత్రమే రాణించింది. స్పిన్నర్లు రాధా యాదవ్, జొనాసెన్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా జొనాసెన్ నిలిచింది.

స్పిన్ ధాటికి టపటపా: ఛేదనలో గుజరాత్ బ్యాటర్లు ఏ దశలోనూ పోరాటం చూపలేదు. జొనాసెన్, రాధా యాదవ్‌ల ధాటికి జట్టు వేగంగా వికెట్లు కోల్పోయింది. గార్డ్‌నర్ మాత్రమే క్రీజులో నిలదొక్కుకునే ప్రయత్నం చేసింది. రెండో ఓవర్‌లోనే ఓపెనర్ వోల్వార్ట్ (0) అవుట్ కాగా, ఐదో ఓవర్‌లో మరో ఓపెనర్ బేత్ మూనీ (12), లిచ్‌ఫీల్డ్ (15)లను జొనాసెన్ దెబ్బతీసింది. అనంతరం రాధా యాదవ్ బంతులకు మిడిలార్డర్ దారుణంగా తడబడింది. గార్డ్‌నర్ దీటుగా ఆడినా ఆమెకు మరో ఎండ్‌లో సహకారం లభించలేదు. 15వ ఓవర్‌లో గార్డ్‌నర్ వికెట్‌ను జొనాసెన్ తీయడంతో జెయింట్స్ ఆట నామమాత్రమైంది.

లానింగ్ హాఫ్ సెంచరీ: టాస్ ఓడిన బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీ ఇన్నింగ్స్‌లో ఓపెనర్, కెప్టెన్ మెగ్ లానింగ్ హైలైట్‌గా నిలిచింది. మూడు కీలక భాగస్వామ్యాలతో జట్టు సవాల్ విసిరే స్కోరుకు కారణమైంది. ఓపెనర్ షఫాలీ (13) తొలి ఓవర్‌లోనే 4,6తో జోరు చూపినా, ఆమె దూకుడు తొమ్మిది బంతులకే పరిమితమైంది. క్యాప్సీ క్రీజులో ఉన్నది కాసేపైనా 4 ఫోర్లతో రన్‌రేట్ తగ్గకుండా చూసింది. రెండో వికెట్‌కు లానింగ్‌తో 38 పరుగులు జోడించాక ఏడో ఓవర్‌లో క్యాప్సీ వెనుదిరిగింది. అప్పటిదాకా ఓపిగ్గా ఆడిన లానింగ్ బ్యాట్ ఝుళిపించింది. 13వ ఓవర్‌లో రెండు వరుస ఫోర్లతో అర్ధసెంచరీ పూర్తి చేసుకుంది. జెమీమా (7)తో కలిసి మూడో వికెట్‌కు 47 పరుగులు జత చేసింది. అయితే ఈ జోడీ స్వల్ప వ్యవధిలో పెవిలియన్‌కు చేరడంతో జట్టు తడబడింది. చివర్లో సదర్లాండ్ (20), శిఖా పాండే (14 నాటౌట్) మెరుపు ఆటతీరుతో ఢిల్లీ స్కోరు 160 దాటింది.


మెగ్ లానింగ్ (55)

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 163/8 (లానింగ్ 55, క్యాప్సీ 27, సదర్లాండ్ 20; మేఘనా సింగ్ 4/37, గార్డ్‌నర్ 2/37).

గుజరాత్: 20 ఓవర్లలో 138/8 (గార్డ్‌నర్ 40, లిచ్‌ఫీల్డ్ 15; రాధా యాదవ్ 3/20, జొనాసెన్ 3/22).

మేం లేకపోతే.. అనే భ్రమల్లో ఉండొద్దు

సీనియర్లకు గవాస్కర్ చురక

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌పై టెస్టు సిరీస్ నెగ్గిన భారత జట్టుపై మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ ప్రశంసలు కురిపించాడు. ఈ గెలుపును 2020-21లో ఆస్ట్రేలియాలో భారత్ 2-1తో సిరీస్ నెగ్గిన చరిత్రతో పోల్చాడు. 'మేం ఉంటేనే టీమిండియా గెలుస్తుందనే భ్రమల్లో ఎవరైనా పెద్ద ఆటగాళ్లు ఉంటే.. వారికి ఈ విజయం కనువిప్పు' అని సీనియర్లకు సన్నీ పరోక్షంగా చురకలంటించాడు. 2020 ఆసీస్ టూర్ తొలి టెస్టులో భారత్ ఘోరంగా ఓడింది. పలువురు ఆటగాళ్లు గాయపడగా.. కెప్టెన్ కోహ్లీ పెటర్నిటీ లీవ్‌లో వెళ్లిపోయాడు. అలాంటి పరిస్థితుల్లో పంత్, సిరాజ్ సత్తా చాటడంతో.. భారత్ 2-1తో సిరీస్ గెలిచి చరిత్ర సృష్టించింది. ఇప్పుడు స్వదేశంలో ఇంగ్లండ్‌తో జరుగుతున్న ఐదు టెస్టుల సిరీస్‌కూ కోహ్లీ దూరమయ్యాడు. కానీ భారత్ 3-1తో సిరీస్ నెగ్గిందంటే యువ ఆటగాళ్ల ప్రతిభే. సీనియర్ల గైర్హాజరీలో ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్, ఆకాశ్ దీప్ మ్యాచ్ విన్నర్లుగా మారారు. 'ఈ క్రెడిట్ కెప్టెన్ రోహిత్, కోచ్ ద్రవిడ్‌కు దక్కుతుంది. కుర్రాళ్లకు అవకాశాలు ఇవ్వడంతోపాటు వారికి తగిన మార్గదర్శకం చేస్తూ అండగా నిలిచారు' అని సన్నీ అన్నాడు. ఇక, సెంట్రల్ కాంట్రాక్ట్ కోల్పోయిన శ్రేయాస్ అయ్యర్ పట్ల గవాస్కర్ సానుభూతి వ్యక్తం చేశాడు. ఈ విషయంలో బీసీసీఐ కొంత కఠినంగానే వ్యవహరించిందన్న సన్నీ.. అనుభవించే వాడికే ఆ బాధ తెలుస్తుందని.. శిక్షకులు దాన్ని అంచనా వేయలేరని గవాస్కర్ అన్నాడు.

శార్దూల్ సూపర్ శతకం

207 పరుగుల ఆధిక్యంలో ముంబై

తమిళనాడుతో రంజీ సెమీస్


శార్దూల్ ఠాకూర్ (109)

ముంబై: ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్ (109) అదిరే శతకానికి తనుష్ కోటియన్ (74 బ్యాటింగ్) ఇన్నింగ్స్ తోడవడంతో.. తమిళనాడుతో జరుగుతున్న రంజీ సెమీస్‌లో ముంబై పట్టు బిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 45/2తో రెండోరోజైన ఆదివారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ముంబై ఆట ముగిసేసరికి 353/9 స్కోరు చేసింది. తనుష్‌తో పాటు తుషార్ దేశ్‌పాండే (17) క్రీజులో ఉన్నారు. తమిళనాడు తొలి ఇన్నింగ్స్ స్కోరు 146తో పోల్చితే.. ముంబై 207 పరుగుల కీలక ఆధిక్యం సాధించింది. భారత జట్టులో చోటు కోల్పోయిన తర్వాత తొలి మ్యాచ్ ఆడిన శ్రేయాస్ అయ్యర్ (3)ను సందీప్ వెనక్కిపంపాడు. మోహిత్ (2), రహానె (19), ముషీర్ (55), ములాని (0)లను సాయి కిషోర్ (6/97) పెవిలియన్ చేర్చడంతో.. ముంబై 106/7తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో హార్దిక్ తమోర్ (35)తో కలసి 8వ వికెట్‌కు 105 రన్స్ జోడించిన శార్దూల్.. తనుష్‌తో 9వ వికెట్‌కు 79 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకున్నాడు. తమోర్‌ను సాయి.. సెంచరీ అనంతరం ధాటిగా ఆడే ప్రయత్నం చేసిన శార్దూల్‌ను సేన్ అవుట్ చేశారు.

ఎంపీని నిలబెట్టిన హిమాన్షు


హిమాన్షు (126)

హిమాన్షు మంత్రి (126) సెంచరీతో.. విదర్భతో జరుగుతున్న రెండో సెమీస్‌లో మధ్యప్రదేశ్ (ఎంపీ)కు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కింది. ఓవర్‌నైట్ స్కోరు 47/1తో ఆదివారం మొదటి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన మధ్యప్రదేశ్ 252 పరుగులకు ఆలౌటైంది. ఉమేష్, యశ్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. విదర్భ మొదటి ఇన్నింగ్స్ స్కోరు (170)తో పోల్చితే.. ఎంపీ 82 పరుగుల ఆధిక్యంలో ఉంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ బరిలోకి దిగిన విదర్భ ఆట ముగిసేసరికి 13/1 స్కోరు చేసింది. ధ్రువ్ (10), అక్షయ్ (1) క్రీజులో ఉన్నారు.


లియోన్ (6/65)

ఆసీస్‌దే తొలి టెస్టు

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో జరిగిన తొలి టెస్టులో ఆస్ట్రేలియా జట్టు 172 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. 369 పరుగుల భారీ ఛేదన కోసం కివీస్ నాలుగో రోజైన ఆదివారం ఓవర్‌నైట్ స్కోరు 111/3తో రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. ఈ స్థితిలో కివీస్ పటిష్టంగానే కనిపించినా.. స్పిన్నర్ నాథన్ లియోన్ (6/65) ధాటికి తొలి సెషన్‌లోనే మిగతా 7 వికెట్లను కోల్పోయింది. ఫలితంగా కివీస్ 196 పరుగులకే కుప్పకూలింది. రచిన్ రవీంద్ర (59) మరో మూడు పరుగులు జత చేసి అవుటయ్యాడు. విచెల్ (38), కుగ్గెలిన్ (26) ఫర్వాలేదనిపించారు. హాజెల్‌వుడ్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 383, రెండో ఇన్నింగ్స్‌లో 164 పరుగులు చేయగా.. కివీస్ తొలి ఇన్నింగ్స్‌లో 179 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా గ్రీన్ నిలిచాడు.

'డబ్ల్యూటీసీ'లో భారత్ టాప్

దుబాయ్: ఆస్ట్రేలియా చేతిలో న్యూజిలాండ్ పరాజయం భారత క్రికెట్ జట్టుకు కలిసివచ్చింది. ఆ ఓటమితో కివీస్ అగ్రస్థానం నుంచి రెండో స్థానానికి పడిపోగా.. టీమిండియా టాప్‌నకు చేరింది. భారత్ 64.58 విజయాల శాతంతో అందరికంటే ముందంజలో ఉండగా, కివీస్ (60 శాతం), ఆసీస్ (59.09) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. అయితే, ఈనెల 7 నుంచి ఇంగ్లండ్‌తో జరిగే ఆఖరి టెస్టులో గెలిస్తేనే భారత్ అగ్రస్థానం పదిలంగా ఉంటుంది. ఆ టెస్టులో భారత్ ఓడి.. 8 నుంచి ఆసీస్‌తో జరిగే రెండో టెస్టులో కివీస్ నెగ్గితే మళ్లీ జట్ల స్థానాలు మారతాయి.

కోల్‌కతాపై ఢిల్లీ గెలుపు

చెన్నై: ప్రైమ్ వాలీబాల్ లీగ్ సీజన్-3లో కోల్‌కతా థండర్‌బోల్ట్స్‌పై ఢిల్లీ తుఫాన్స్ జట్టు 3-0తో విజయం సాధించింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో ఢిల్లీ 15-9, 16-14, 17-15తో నెగ్గింది. ఢిల్లీ ఆటగాడు సంతోష్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. మరో మ్యాచ్‌లో అహ్మదాబాద్ డిఫెండర్స్ 3-1తో కొచ్చి బ్లూ స్పైకర్స్‌పై గెలిచింది.



చాహల్‌ను తిప్పేసిన సంగీత

న్యూఢిల్లీ: ఓ చానెల్‌లో ప్రసారమవుతున్న డ్యాన్స్ రియాల్టీ షోకు సంబంధించిన పార్టీలో టీమిండియా స్పిన్నర్ యజ్వేంద్ర చాహల్, రెజ్లర్ సంగీతా ఫొగట్ అందరి దృష్టినీ ఆకర్షించారు. చాహల్‌ను తన భుజాలపైకెత్తుకొని సంగీత సరదాగా గింగరాలు తిప్పుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. చాహల్ కిందకు దించమని విజ్ఞప్తి చేయడంతో.. సంగీత వదిలిపెట్టింది. కాగా, ఆ షోలో సంగీత ఎలిమినేట్ కాగా.. చాహల్ భార్య ధనశ్రీ ఫైనల్ చేరింది.

బిజినెస్

గరిష్ఠ స్థాయిల్లో పటిష్ఠం


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం బలమైన రియాక్షన్‌లో ప్రారంభమై మానసిక అవధి 22,000 కన్నా తగ్గినా శుక్రవారం వచ్చిన బలమైన జీడీపీ గణాంకాల మద్దతుతో శక్తివంతమైన రికవరీ సాధించి వారం గరిష్ఠ స్థాయి 22,380 వద్ద క్లోజయింది. వారం మొత్తం మీద 165 పాయింట్లు లాభపడింది. దిగువకు పుల్‌బ్యాక్ రియాక్షన్‌లో కూడా 22,000 వద్ద నిలదొక్కుకోవడం పాజిటివ్ సంకేతం. అలాగే గత రెండు వారాల్లోనూ 22,000 వద్ద కన్సాలిడేట్ అవుతూ గత వారంలో రెండోసారి ఆ స్థాయి కన్నా పైన నిలకడగా ముగియడం గత వారం బ్రేకౌట్ సరైనదేనన్న సంకేతంగా భావించవచ్చు. అయితే మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 125 పాయింట్ల నష్టంతో ముగియగా స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ ఫ్లాట్‌గా ముగిసింది. టెక్నికల్‌గా మార్కెట్ జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో ఉంది. కొత్త శిఖరాలపై మరో పరీక్షకు సిద్ధం అవుతోంది.

బుల్లిష్ స్థాయిలు: పాజిటివ్ ధోరణిలో ట్రేడయితే 22,550 వద్ద కీలక నిరోధం ఉంది. ఇది మానసిక అవధి కావడం వల్ల తదుపరి స్వల్పకాలిక కన్సాలిడేషన్ ఉండవచ్చు. మరింత అప్‌ట్రెండ్ కోసం ఆ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి.

బేరిష్ స్థాయిలు: ప్రధాన మద్దతు స్థాయి 22,250 వద్ద బలహీనత ప్రదర్శించి అంతకన్నా దిగజారితే బలహీనతను సూచిస్తుంది. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 22,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ కూడా గత వారం రియాక్షన్ అనంతరం 47,280 కన్నా పైన బలంగా కోలుకుని వారంలో 475 పాయింట్ల లాభంతో ముగిసింది. ఇప్పటికీ జనవరిలో ఏర్పడిన జీవితకాల గరిష్ఠ స్థాయికి దిగువనే ఉంది. పాజిటివ్ ధోరణిలో ట్రేడయినట్టయితే మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయిలు 47,800, 48,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. మద్దతు స్థాయి 47,000 కన్నా దిగజారితే అప్రమత్తతను సూచిస్తుంది.

పాటర్న్: నిఫ్టీ మరింత అప్‌ట్రెండ్ కోసం 22,550 వద్ద "ఏటవాలుగా ఎగువకు ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి. 22,250 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద మద్దతు ఉంది. కరెక్షన్‌లో ప్రవేశించినా ఇక్కడ నిలదొక్కుకోవడం తప్పనిసరి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	22,460, 22,510
మద్దతు	22,340, 22,250

www.sundartrends.in

ఐపీఓ మార్కెట్ బిజీ బిజీ

8 ఐపీఓలు, ఏడు లిస్టింగ్‌లు



లిస్టింగ్ కంపెనీలు ఇవే..

న్యూఢిల్లీ: ఈ వారం ప్రైమరీ మార్కెట్ మరింత బిజీగా మారనుంది. రూ.1,483.2 కోట్లు సమీకరించేందుకు ఎనిమిది కంపెనీలు పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు వస్తున్నాయి. ఇప్పటికే ఐపీఓలు జారీ చేసిన ఏడు కంపెనీల షేర్లు ఈ వారం బీఎస్ఈ, ఎన్ఎస్ఈల్లో లిస్ట్ కాబోతున్నాయి.

ఈ వారం వస్తున్న ఐపీఓలు ఇవే..

డేటా ఆధారిత సమగ్ర మార్కెటింగ్ సేవలు అందించే ఆర్‌కే స్వామి కంపెనీ ఐపీఓ సోమవారం నుంచి ప్రారంభమవుతోంది. ఈ నెల 6న ముగిసే ఈ ఐపీఓ ఇష్యూ ధరను రూ.270-288గా ఖరారు చేశారు. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.423.56 కోట్లు సమీకరించనుంది. జింక్ ఆక్సైడ్ తయారు చేసే జేజీ కెమికల్స్ ఐపీఓ మంగళవారం ప్రారంభమవుతోంది. రూ.250.2 కోట్ల సమీకరణ కోసం ఈ కంపెనీ రూ.210-221 ప్రైస్ బ్యాండ్‌లో షేర్లు జారీ చేస్తోంది. ఈ ఐపీఓ మార్చి 7న ముగుస్తుంది. రాజ్‌కోట్ కేంద్రంగా గోపాల్ స్నాక్స్ కూడా రూ.650 కోట్ల సమీకరణ కోసం ఈ నెల 6న ఐపీఓ జారీ చేస్తోంది. మార్చి 11న ముగిసే ఈ ఐపీఓ ఇష్యూ ధరను రూ.381-401గా నిర్ణయించారు.ఈ మూడు కంపెనీలు కాకుండా వీఆర్ ఇన్‌ఫ్రాస్పేస్, సోనా మెషినరీ, శ్రీ కర్ణి ఫ్యాబ్‌కామ్, కౌరాఫైన్ డైమండ్ జువెలరీ, పుణె ఈ-స్టాక్ బ్రోకింగ్ కంపెనీలూ ఈ వారం ఐపీఓ మార్కెట్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నాయి. గత వారం ప్రారంభమైన ముక్కా ప్రొటీన్స్ ఐపీఓ సోమవారం ముగుస్తుంది. ఎంవీకే ఆగ్రో ఫుడ్ ప్రొడక్ట్ కంపెనీ ఐపీఓ కూడా సోమవారం ముగియనుంది.

ప్లాటినం ఇండస్ట్రీస్, ఎగ్జికామ్ టెలిసిస్టమ్స్ కంపెనీల షేర్లు మంగళవారం లిస్టవుతున్నాయి. ఈ రెండు కంపెనీల షేర్లు గ్రే మార్కెట్లో ఇష్యూ ధర కంటే 54 నుంచి 100 శాతానికిపైగా ప్రీమియంతో ట్రేడవుతున్నాయి. భారత్ హైవేస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ షేర్లు బుధవారం, ముక్కా ప్రొటీన్స్ షేర్లు గురువారం లిస్టవుతాయి.ఇక ఎస్ఎంఈ సెగ్మెంట్‌లో ఒయాసిస్ మెటల్ అండ్ మినరల్ ప్రాసెసింగ్ కంపెనీ షేర్లు సోమవారం, పూర్వ ఫ్లెక్సీప్యాక్ కంపెనీ షేర్లు మంగళవారం, ఎంవీకే ఆగ్రో ఫుడ్ ప్రొడక్ట్స్ కంపెనీ షేర్లు గురువారం లిస్టవుతున్నాయి.

ఏఐతో బీపీఓ ఉద్యోగాలకు ముప్పే

ఐటీ ఉద్యోగులపై ప్రభావం అంతంతే

నాస్కామ్ చైర్మన్ రాజేశ్ నంబియార్



ముంబై: బిజినెస్ ప్రాసెస్ ఔట్‌సోర్సింగ్ (బీపీఓ) ఉద్యోగాలకు పెద్ద ముప్పు పొంచి ఉంది. ఉత్పాదక కృత్రిమ మేధ (ఏఐ)తో వీరి ఉద్యోగాలు ఎక్కువగా గల్లంతయ్యే ప్రమాదం ఉందని నాస్కామ్ చైర్మన్ రాజేశ్ నంబియార్ హెచ్చరించారు. ఐటీ సేవల ఉద్యోగులకు మాత్రం ఏఐ ముప్పు పెద్దగా ఉండకపోవచ్చన్నారు. అయితే ఐటీ సేవల ఉద్యోగులు కూడా తమ పనుల్లో ఏఐని భాగం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. లేకపోతే ఏఐపై పట్టు ఉన్న ఉద్యోగులు వారి స్థానాలను భర్తీ చేసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. పుణెలో జరిగిన ఒక సదస్సులో ఆయన ఈ హెచ్చరిక చేశారు. క్లయింట్ల డిమాండ్లకు అనుగుణంగా భారత ఐటీ కంపెనీలు ఉద్యోగులకు పెద్దఎత్తున ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇస్తున్న నేపథ్యంలో నంబియార్ ఈ హెచ్చరిక చేయడం విశేషం. ఒక సమస్య పరిష్కారానికి లేదా ఇప్పటికే ఉన్న వ్యవస్థలతో ఏఐని అనుసంధానం చేయగలిగినప్పుడే అసలు ప్రభావం కనిపిస్తుందన్నారు. ఏఐ.. టెక్నాలజీ ఆఫీసుల్లో పని చేసే ఈక్విటీ అనలిస్టులు, గణాంక నిపుణుల వంటి వైట్ కాలర్ ఉద్యోగుల కొలువులనే ఎక్కువగా ప్రభావితం చేస్తుందన్నారు. ఏసీలు, లైట్లను బాగు చేసే టెక్నీషియన్ కొలువులకు మాత్రం ఏఐతో పెద్దగా ఇబ్బంది ఉండదని నంబియార్ స్పష్టం చేశారు.

ఇక ఫ్లిప్‌కార్ట్ ద్వారా నగదు బదిలీ

న్యూఢిల్లీ: ఈ కామర్స్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్ నుంచి ఇక అందరూ యూపీఐ చెల్లింపులు కూడా చేయవచ్చు. ఫ్లిప్‌కార్ట్ యూపీఐ హ్యాండిల్ @fkaxis ద్వారా ఫ్లిప్‌కార్ట్ కస్టమర్లతో పాటు ఎవరైనా రిజిస్టర్ అయి తేలిగ్గా యూపీఐ లావాదేవీలు నిర్వహించుకోవచ్చు. ఇది దేశంలో డిజిటల్ చెల్లింపుల విధానం మరింత విస్తరించేందుకు దోహదపడుతుందని ఫ్లిప్‌కార్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. ఫ్లిప్‌కార్ట్ కస్టమర్లు 50 కోట్ల మందితో పాటు సాధారణ పౌరులు కూడా దీనిలో రిజిస్టర్ కావచ్చు. ఇది ఉపయోగించే వారికి లాయల్టీలు అందించడం కోసం సూపర్ కాయిన్లు, క్యాష్‌బాక్‌లు, మైల్‌స్టోన్ ప్రయోజనాలు, బ్రాండ్ ఓచర్లు ఫ్లిప్‌కార్ట్ ప్రవేశపెడుతోంది. 2023లో 11,700 కోట్ల లావాదేవీల ద్వారా రూ.182.84 లక్షల కోట్ల చెల్లింపులు చేయడానికి యూపీఐ ఉపయోగపడింది. ఈ నేపథ్యంలో యూపీఐ మరింతగా విస్తరించేందుకు ఫ్లిప్‌కార్ట్ హ్యాండిల్ ఉపయోగపడుతుందంటున్నారు.

22,650 పైన బుల్లిష్

(మార్చి 4-7 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 22,420-22,020 పాయింట్ల మధ్యన కదలాడి 165 పాయింట్ల లాభంతో 22,378 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 22,650 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 21,849, 21,767, 20,441, 20,068 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 22,780 బ్రేక్‌డౌన్ స్థాయి: 21,980

నిరోధ స్థాయిలు: 22,580, 22,680, 22,780 (22,480 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 22,180, 22,080, 21,980 (22,280 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



3వ తేదీ	
హైదరాబాద్	466
4వ తేదీ	
చిత్తూరు	523
గోదావరి	463
విజయవాడ	463
విశాఖపట్నం	500
వరంగల్	468
డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	126
వరంగల్	126
కరీంనగర్	126
మహబూబ్‌నగర్	126
కర్నూలు	126
విశాఖపట్నం	127
గోదావరి	134
విజయవాడ	134
గుంటూరు	134
ఒంగోలు	134
చిత్తూరు	120

పెరుగుతున్న టర్మ్ డిపాజిట్లు

న్యూఢిల్లీ: అధిక వడ్డీ రేట్లు డిపాజిటర్లను ఆకర్షిస్తున్నాయి. దీంతో 2023 మార్చిలో మొత్తం బ్యాంకు డిపాజిట్లలో 57.2 శాతంగా ఉన్న కాల పరిమితి (టర్మ్) డిపాజిట్లు 2023 డిసెంబరు నాటికి 60.3 శాతానికి చేరాయి. ఆర్‌బీఐ ఆదివారం ఇందుకు సంబంధించిన గణాంకాలు విడుదల చేసింది. ఇక గత ఏడాది ఏప్రిల్-డిసెంబరు వరకు చూస్తే మొత్తం బ్యాంకు డిపాజిట్లలో టర్మ్ డిపాజిట్ల వాటా 97.6 శాతం వరకు ఉంది. గత ఏడాది డిసెంబరు నాటికి బ్యాంకుల్లో ఉన్న డిపాజిట్లలో ఏడు శాతానికిపైగా వడ్డీ చెల్లించే టర్మ్ డిపాజిట్ల వాటా 61.4 శాతంగా ఉంది. 2022 మే నుంచి 2023 ఫిబ్రవరి వరకు ఆర్‌బీఐ రెపో రేటు నాలుగు శాతం నుంచి 6.5 శాతానికి పెంచడం ఇందుకు ప్రధాన కారణం.

- సమీకృత ట్రావెల్, ఎక్స్‌పెన్స్ మేనేజ్‌మెంట్ సేవలందించేందుకు గాను ఓటీఏ ప్లాట్‌ఫామ్ ఈజ్‌మైట్రిప్‌తో ఫిన్‌టెక్ సంస్థ జాగిల్ ప్రీపెయిడ్ ఓషన్ సర్వీసెస్ జట్టు కట్టింది. ఈ ఒప్పందంతో జాగిల్‌కు చెందిన 2,800 క్లయింట్స్‌కు విమాన టికెట్లు, హోటల్స్ బుకింగ్‌తో పాటు ఎండ్ టు ఎండ్ ట్రావెల్, ఇతర సేవలందించే వీలు కలుగుతుంది.
- ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్.. క్లెయిమ్స్ సెటిల్మెంట్స్‌లో తన అగ్రస్థానాన్ని కొనసాగిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ క్లెయిమ్స్ సెటిల్మెంట్ నిష్పత్తి 98.52 శాతంగా ఉందని వెల్లడించింది. కాగా 2023-24 ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల కాలానికి క్లెయిమ్స్ సెటిల్మెంట్ రేషియో 98.6 శాతంగా ఉంది.

బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లపై లుక్కేయండి..!

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈ వారం మెరుగ్గా కదలాడే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్థానిక, అంతర్జాతీయ పరిణామాలు ఇన్వెస్టర్లలో పాజిటివ్ సెంటిమెంట్‌ను నింపాయి. ఈ వారం కొనుగోళ్ల జోరు కొనసాగే అవకాశం ఉంది. అయితే ఫియర్ ఇండెక్స్ ఇండియా విక్స్ ఇంకా 15 స్థాయిలోనే ఉండటం అప్రమత్తతను సూచిస్తోంది. నిఫ్టీ మార్చి నెల మద్దతు స్థాయి 22,300, నిరోధ స్థాయిలు 22,500 వద్ద ఉన్నాయి. గత వారం మెటల్స్, ఆటో సూచీలు రాణించాయి. అయితే శుక్రవారం నాటి ఎఫ్ఐఐ గణాంకాలను చూస్తే ఈ వారం బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగాల్లో బుల్లిష్‌నెస్ ఉండొచ్చు.

స్టాక్ రికమండేషన్స్

డేటా ప్యాటర్న్స్: కేంద్ర ప్రభుత్వం రక్షణ రంగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నిబంధనలను సరళీకరించటం ఈ కౌంటర్‌కు కలిసి వచ్చింది. కొన్నాళ్లుగా ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ విపరీతంగా పెరుగుతోంది. చివరి మూడు రోజుల్లోనే ఈ షేరు 24 శాతం మేర పెరిగింది. సుదీర్ఘ కాలం కన్సాలిడేషన్ కావటం మరో పాజిటివ్ అంశం. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.2,650 స్థాయిలో ప్రవేశించి రూ.2,710/2,850 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,610 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

జిందాల్ స్టీల్: ఈ షేరు సరికొత్త జీవిత కాల గరిష్ఠాన్ని తాకటంతో ఇన్వెస్టర్ల చూపు ఈ కౌంటర్‌పై పడింది. నిఫ్టీతో పోల్చితే మెరుగైన ప్రదర్శన, నిరోధ స్థాయిలో సుదీర్ఘకాలం అక్యుములేషన్ జరగటం సానుకూల అంశాలు. పైగా షేరు విలువ అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను అధిగమించటం బుల్లిష్‌నెస్‌ను సూచిస్తోంది. మూమెంటమ్ ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.810 స్థాయిలో ఎంటర్ అయి రూ.880/940 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.790 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

డిక్సన్ టెక్నాలజీస్: కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీలో ఉన్న ఈ సంస్థకు భారీగా కొత్త ఆర్డర్లు వస్తున్నాయి. డెహ్రాడూన్‌లోనూ కొత్త ప్లాంట్‌ను ఆరంభించే యోచనలో ఉంది. గత ఏడాది ఆరంభం నుంచి ఈ కౌంటర్ అప్‌ట్రెండ్‌లో కొనసాగుతోంది. వాల్యూమ్‌ను బట్టి స్టాక్ డిమాండ్‌ను అర్థం చేసుకోవచ్చు. ట్రేడర్లు ఈ కౌంటర్‌లోకి రూ.6,950/6,980 శ్రేణిలో ప్రవేశించి రూ.7,120/7,355 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.6,900 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టైటాన్: ఈ కౌంటర్‌కు చాలా సానుకూలతలు కనిపిస్తున్నాయి. నిఫ్టీతో పోల్చితే మెరుగ్గా ట్రేడవుతోంది. అప్పర్ బొలింజర్ బ్యాండ్‌ను క్రాస్ చేసింది. చివరి ఐదు సెషన్లలో ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ ఒకటిన్నర రెట్లు పెరిగింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.3,700 స్థాయిల్లో ప్రవేశించి రూ.3,830/3,950 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,675 స్థాయిని కచ్చితమైన స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

గ్రాసిమ్: గత వారం ఈ కౌంటర్ సరికొత్త జీవిత కాల గరిష్ఠాన్ని అందుకుంది. పైగా రూ.2,000 స్థాయిలో మంచి అక్యుములేషన్ జరుగుతోంది. వాల్యూమ్స్ కూడా పెరుగుతున్నాయి. జెఫ్రీస్ సహా అనేక రేటింగ్ సంస్థలు.. కంపెనీ షేరు టార్గెట్ ధరను పెంచి 'బై' కాల్ ఇచ్చాయి. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.2,240 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.2,380/2,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,222 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.


\- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్

niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 4-3-2024 | Vijayawada | Hyderabad | Maboobnagar | Tirupathi | Vishakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

అయ్యో ఆంధ్రా..!

దక్షిణాదిన ఏపీ పరిస్థితి దారుణం



పట్టణ ప్రాంత తలసరి వినియోగ వ్యయంలో 15వ స్థానంలో ఏపీ, ఫస్ట్ ప్లేస్‌లో తెలంగాణ

గ్రామీణ తలసరి వినియోగ వ్యయంలోనూ వెనుకబాటే.. 11వ స్థానంలో రాష్ట్రం

గత 11 ఏళ్లలో ఆహారంపై తగ్గిన ఖర్చు.. సిగరెట్లు, మద్యం, అద్దె, వైద్యం, రవాణా తదితర ఆహారేతర వ్యయాల పెరుగుదల.. 2022-23 గృహ వినియోగ వ్యయ సర్వేలో వెల్లడి

10

జగనా.. మజాకా?



'అన్‌రాక్'కు అన్‌స్టాపబుల్ మేళ్లు

ప్రభుత్వ ప్రయోజనాలకు పాతర

అస్మదీయ కంపెనీకి 2013 నాటి ధరలకే అప్పనంగా 479 ఎకరాలు

150.23 కోట్ల భూమి 13.57 కోట్లకే.. పేరు మార్చుకుని వచ్చిన అన్‌రాక్

'పయనీర్ అల్యూమినియం'గా ఎంట్రీ.. రాయితీపై భూమి కోసం దరఖాస్తు

రూ.93.77 కోట్ల పాత బకాయిలపై వడ్డీ, ప్రాసెసింగ్ ఫీజులూ ఎత్తివేత

గొంతెమ్మ కోరికలు తీర్చేసిన జగన్.. ఇప్పటికే సంస్థ చేతిలో 2 వేల ఎకరాలు

వాటి సొమ్మే పూర్తిగా చెల్లించని వైనం.. అయినా దానికే కొత్త కేటాయింపు



జగన్ హయాంలో అయిన వారు ఏ రూపంలో వచ్చినా అందిన కాడికి మేళ్లు జరుగుతున్నాయి. గత బకాయిలు సైతం మాఫీ అయిపోతున్నాయి. రూ.కోట్లకు కోట్ల బకాయిలు ఉన్న కంపెనీ పేరుమార్చుకుని వచ్చినా.. దాని నుంచి బకాయి సొమ్మును రాబట్టాల్సిన ప్రభుత్వం వాటిని రాబట్టకపోగా మరిన్ని మాఫీలు చేస్తూ 'మేలు'రాయి నిర్ణయాలతో దూసుకుపోతోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల అధికారం చివరి దశకు చేరుకున్న సమయంలో సీఎం జగన్ విశ్వరూపం చూపిస్తున్నారు. ప్రభుత్వం సహా ప్రజా ప్రయోజనాలకు పాతరేసి తన సొంత మనుషులు, అస్మదీయుల గొంతెమ్మ కోరికలు తీరుస్తున్నారు. తన చేతికి మట్టి అంటకుండా వ్యవస్థలను రంగంలోకి దింపి ఖజానా ఏమైనా ఫర్వాలేదన్నట్టుగా సొంత మనుషుల జేబులు నింపుతున్నారు. భూములు, రాయితీలు, మినహాయింపులతో మేళ్లు చేస్తున్నారు. విశాఖ మన్యంలోని బాక్సయిట్‌ను తవ్వితీసేందుకు వైఎస్ రాజశేఖరరెడ్డి హయంలో తీసుకొచ్చిన కంపెనీ.. అన్‌రాక్ అల్యూమినియం లిమిటెడ్. ప్రజాసంఘాలు, ఆదివాసీల ఆందోళనలను ఉక్కుపాదంతో అణచివేసి వేలకోట్ల విలువైన బాక్సయిట్‌ను తవ్వితీసేందుకు రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ(ఏపీఎండీసీ)తో ఒప్పందం చేయించి మరీ ఆ సంస్థను నిలబెట్టారు. 2013, మార్చి వరకు ఆ సంస్థ వ్యాపారం అప్రతిహతంగా సాగింది. అప్పటికే 2వేల ఎకరాల భూమిని కారుచౌకగా ఆ సంస్థకు కట్టబెట్టారు. ఆదివాసీ గిరిజనుల పోరాట ఫలితంగా నాటి ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వం 2013, ఏప్రిల్‌లో ఒప్పందం రద్దుచేసింది. దీంతో ఆ కంపెనీ కార్యకలాపాలు నిలిచిపోయాయి. ఇటీవలే అంతర్జాతీయ మధ్యవర్తిత్వ కోర్టులో ఈ కేసు విచారణ జరిగింది. దాదాపు 10-11 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత అన్‌రాక్ కొత్త రూపంలోకి మారింది. 'అన్‌రాక్ అల్యూమినియం లిమిటెడ్' పేరును 'పయనీర్ అల్యూమినియం ఇండస్ట్రీస్'గా మార్చుకుని కొత్తగా తెరమీదకు రాబోతుంది. 2009-2013 కాలంలో సర్కారు నుంచి కారుచౌకగా తీసుకున్న భూములను కొత్త కంపెనీ పేరిట మార్చడంతోపాటు, అదనంగా మరో 479 ఎకరాలు కేటాయించాలని ఆ సంస్థ జగన్ సర్కారును కోరింది. అంతేకాదు, గతంలో తీసుకున్న భూములకు చెల్లించాల్సిన పరిహారం బకాయిలు, వాటిపై విధించిన వడ్డీ, ఇతర ఫీజులను మాఫీచేయాలని, ఇంకా వీలైతే మరిన్ని మేళ్లు చేయాలని కోరింది. అంతే, ప్రభుత్వ.. ప్రజాప్రయోజనాలను

మిగతా 9వ పేజీలో...



వలంటీర్లకు పంపిణీ చేసిన నగదు కవర్, దీనిపై ఎమ్మెల్యే స్టాంప్

4

వలంటీర్లపై సొమ్ము వల

నరసరావుపేటలో నగదు పంపిణీ

ఒక్కొక్కరికీ కవర్‌లో 5 వేలు.. ఉదయం కవర్లపై ఎమ్మెల్యే స్టాంప్

రాత్రికి ఇచ్చినవాటిపై మాత్రం మాయం

పెదకూరపాడు, వినుకొండల్లో యథేచ్ఛగా చీరలు, కుక్కర్ల పంపిణీ

పల్నాడులో వైసీపీ ఎమ్మెల్యేల ప్రలోభపర్వం



'యువత.. ముఖ్యంగా విద్యావంతులు ఉద్యోగాలు కోరుకుంటారు.. ఇతరత్రా ప్రయోజనాలు కాదు. ఉచితాలపైనే జగన్ పూర్తిగా ఆధారపడ్డారు. దీనివల్ల ఆయన గడ్డు పరిస్థితులను ఎదుర్కోబోతున్నారు. మామూలు ఓటమి కాదు.. భారీ పరాజయం తప్పదు'

-ప్రశాంత్ కిశోర్

జగన్‌కు భారీ ఓటమే!

ఆంధ్రలో టీడీపీ గెలుపు ఖాయం.. ప్రశాంత్ కిశోర్ జోస్యం

భవంతిలో కూర్చుని బటన్ నొక్కితే ఓట్లు రాలవు

ప్రజలు అభివృద్ధి కోరతారు.. యువత ఉద్యోగాలు అడుగుతారు

ఇతరత్రా ప్రయోజనాలు ఆశించరు

ధనమే కీలకమైతే ఏ ప్రభుత్వాన్నీ ఓడించలేరు

ప్రజాధనం ఖర్చుచేస్తూ వారి బాగోగులు చూస్తున్నామనుకోవడం తప్పు

జగన్‌కూ కేసీఆర్ గతే: ప్రశాంత్ కిశోర్

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి భారీ పరాజయం ఎదుర్కోనున్నారని రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ (పీకే) జోస్యం చెప్పారు. ఆయన రాజకీయ భవిష్యత్ క్షీణ దశలో ఉందని, తెలంగాణలో కేసీఆర్‌కు పట్టిన గతే ఆయనకూ పట్టబోతోందన్నారు. తెలుగుదేశం పార్టీ విజయం ఖాయమని తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఓట్లు వేసేటప్పుడు ప్రజలు అభివృద్ధికే ప్రాధాన్యమిస్తారని.. ఉచిత

మిగతా 9వ పేజీలో...



హైదరాబాద్‌లో పవన్‌ను కలిసిన వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

పవన్‌తో చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే భేటీ

ఈ వారంలోనే జనసేనలోకి శ్రీనివాసులు

పార్టీ నుంచి సస్పెండ్ చేసిన వైసీపీ

9

దోపిడీధీర!

- ఉమ్మడి కడప జిల్లాలోని ఆ నియోజకవర్గం.. ఒకప్పుడు బాంబుల గడ్డ. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక కలెక్షన్ గడ్డగా మారిందనే పేరు వచ్చింది. ఈ ఘనతంతా స్థానిక ఎమ్మెల్యేదే. చిల్లర వసూళ్ల నుంచి కోట్లు కుమ్ముడు వరకూ దేన్నీ వదలకుండా ఆయన సొమ్ము చేసుకుంటున్నారు. ఈ దోపిడీధీరుడి అక్రమాలు అన్నీ ఇన్నీ కావు.
- నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఆయన అనుచరుల అక్రమాలను అడ్డుకున్నా, ఫిర్యాదు చేసినా అంతే సంగతులు! హత్యలు లేదంటే ఎదురు కేసులు! ఎమ్మెల్యే వర్గీయుల అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకున్నందుకు టీడీపీ నేతలపై కేసులు బనాయించారు. ముంపు పరిహారం కాజేస్తున్నారని సొంత పార్టీకే చెందిన మరో కీలక నాయకుడి అనుచరుడు ఫిర్యాదు చేసినందుకు ఎమ్మెల్యే వర్గీయులు ఆయన్ను హత్య చేశారనే ఆరోపణలు ఉన్నాయి.

భారతికి ఫిర్యాదు చేసినా..

- నియోజకవర్గంలోని సిమెంట్ ఫ్యాక్టరీల యజమానులను కొందరిని బెదిరించి ఎమ్మెల్యే కోట్లు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. సిమెంటు పరిశ్రమల ప్రతినిధులు ఈ విషయాన్ని సీఎం జగన్ సతీమణి భారతికి ఫిర్యాదు చేశారనే ప్రచారం ఉంది. అయినా సదరు నేతపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదని తెలుస్తోంది.



ఖనిజాలమడుగులో ఎమ్మెల్యే కలెక్షన్ల దందా

చిల్లర నుంచి కోట్ల వరకూ వసూళ్లు

ఉద్యోగాలు, బిల్లుల పేరిట ముడుపులు

ఇసుక నుంచి అన్నింటిలో వాటాలే

సిమెంట్ పరిశ్రమల నుంచి కోట్లు కుమ్ముడు

జగన్ భార్యకు ఫిర్యాదు చేసినా చర్యల్లేవు

మైనింగ్ నిర్వాహకుడికి 5 కోట్లు డిమాండ్

అక్రమాలను ప్రశ్నిస్తే కేసులు, హత్యలు



(కడప-ఆంధ్రజ్యోతి)

కడప జిల్లాలో పరిశ్రమలకు అవసరమైన నిక్షేపాలు ఉన్న నియోజకవర్గమది. ఐరన్‌వోర్ మొదలుకుని ఇసుక, నాపరాయి.. ఇలా ఒకటేంటి సహజ వనరులు ఇక్కడ పుష్కలంగా ఉన్నాయి. ఓ విధంగా చెప్పాలంటే ఇది బంగారు నిధిలాంటిది. స్టీలు ప్లాంటు నిర్మాణం కోసం నాలుగు సార్లు శంకుస్థాపన చేశారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటై ఉంటే ఈ ప్రాంతమంతా పారిశ్రామిక వాడగా మారేది. కడప జిల్లాకే చెందిన జగన్ ముఖ్యమంత్రి అయినా పట్టించుకోలేదు. ఇక స్థానిక ఎమ్మెల్యేకు కూడా అభివృద్ధి అసలు పట్టదు. స్టీల్ ప్లాంటు విషయం అటుంచితే పరిశ్రమ ఏర్పాటుకు భూములిచ్చిన రైతులకు (డీకేటీ) పరిహారం కూడా ఇప్పించలేదు. నియోజకవర్గంలో కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదు. దీంతో నియోజకవర్గం వెనుకబడిన ప్రాంతంగానే

మిగతా 3వ పేజీలో...



తల్లిని కాలితో తంతూ.. విరుచుకుపడుతున్న కొడుకు శ్రీనివాసులురెడ్డి

బిడ్డా.. కొట్టొద్దురా!

తల్లి జుట్టుపట్టి ఈడ్చి.. ఎగిరి గుండెలపై తన్ని.. తండ్రినీ చెంపలపై కొట్టి దాష్టీకం

ఓ ఉన్మాది పుత్రుడి కాఠిన్యం.. ఆస్తి వెంటనే ఇవ్వలేదని విచక్షణారహితంగా దాడి

అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఘటన.. వీడియో వైరల్

మూణ్నెల్లుగా కొడుతున్నాడని ఫిర్యాదిచ్చినా పట్టించుకోని పోలీసులు?

3

నటి సౌమ్యశెట్టి దొంగావతారం!



స్నేహితురాలి ఇంట్లో విడతలవారీగా బంగారం చోరీ

ఆ నగలు విక్రయించి గోవాలో ఎంజాయ్

కొత్త నగలు కొనుగోలు.. క్రెడిట్ కార్డు అప్పులు చెల్లింపు

బ్యాంకు ఖాతా లావాదేవీల్లో గుర్తించిన పోలీసులు

దొంగతనం కేసులో అరెస్టు.. 57 తులాలు రికవరీ

3

మలికా గర్గ్ మాకొద్దు!



మహిళా ఐపీఎస్‌పై వైసీపీ ఎమ్మెల్యేల ఫిర్యాదు.. ఓకే చేసిన సీఎం

తిరుపతి ఎస్పీగా నియమించిన 20 రోజుల్లోనే సీఐడీకి బదిలీ

ఎన్నికల్లో నేతల అక్రమాలు సాగబోవనే కారణంతో వేటు!

గర్గ్ బదిలీపై ఐపీఎస్‌లలో విస్మయం.. తిరుపతి ఎస్పీగా కృష్ణకాంత్

9

బీజేపీలో టికెట్ల చిచ్చు

టికెట్ ఇవ్వకపోవడంతో కేంద్ర మాజీ మంత్రి అలక

రాజకీయాలకు హర్షవర్ధన్ గుడ్‌బై

10

నేటి నుంచి టెన్త్ హాల్ టికెట్లు

4

'పాఠశాల విద్య'కు పైసల్లేవు!

అప్పులతో నెట్టుకొస్తున్న జగన్ ప్రభుత్వం

బడ్జెట్ కేటాయింపులు పుస్తకాలకే పరిమితం

నిధుల్లేక విద్యాకానుక చెల్లింపులకు బ్రేక్

2023-24లో రూ.600 కోట్ల బకాయిలు

కనీసం 50% చెల్లించాలన్న కాంట్రాక్టర్లు

డబ్బులిస్తేనే వచ్చే విద్యాసంవత్సరానికి కానుక సామగ్రి సరఫరా అంటూ మెలిక


పాఠ్యపుస్తకాల కాగితం 200 కోట్ల అప్పు

టీఎన్‌పీఎల్‌కు రూపాయి ఇవ్వని సర్కారు

సమగ్రశిక్షలో టీచర్ల జీతాలకూ కటకట

నిధుల ఆదా పేరిట వాట్సప్‌లో ప్రశ్నపత్రాలు

టీచర్లు గగ్గోలు పెడుతున్నా పట్టని అధికారులు



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పాఠశాల విద్యాశాఖ నిధుల లేమితో కటకటలాడుతోంది. ప్రతినెలా అప్పులతో నెట్టుకొస్తున్న జగన్ ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే విద్యారంగాన్ని కూడా అప్పుల కుప్పగా మార్చేసింది. వార్షిక బడ్జెట్‌లో చేసిన కేటాయింపులను పుస్తకాలకే పరిమితం చేసి, వీలైనంత మేర అప్పులతో ఆ శాఖను నడిపిస్తోంది. చివరికి పాఠ్యపుస్తకాలకు కాగితం సరఫరా చేసిన తమిళనాడు న్యూస్‌ప్రింట్‌కు బకాయిలు పెట్టి, ఆ రాష్ట్రం లేఖలు రాసే స్థాయికి తీసుకొచ్చింది. ఇప్పుడు విద్యా కానుక

మిగతా 3వ పేజీలో...



పట్నా సభలో లాలూతో మాట్లాడుతున్న రాహుల్, ఖర్గే

'ఇండియా' ఎన్నికల భేరి!

పట్నాలో భారీ స్థాయిలో 'జనవిశ్వాస్ మహా ర్యాలీ'

రాహుల్, ఖర్గే, అఖిలేశ్, తేజస్వి, లాలూ హాజరు

వామపక్షాల నేతలూ.. నితీశ్‌పై నేతల విసుర్లు

ఆయన్ను మళ్లీ కూటమిలోకి తీసుకోవద్దు: ఖర్గే

ఈసారి వస్తే బయటకు నెట్టేస్తా: లాలూ

లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్, బిహార్‌లో ఓడిస్తే బీజేపీ అధికారంలోకి రాదు: అఖిలేశ్‌యాదవ్

10

బరితెగించిన గంజాయి ముఠా



ఎస్ఈబీ పోలీసులపైకి దూసుకెళ్లిన కంటైనర్

పలాసలో ఎస్ఐ సహా ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలు

విశాఖలో కంటైనర్ పట్టివేత.. 380 కిలోలు స్వాధీనం

3

వచ్చే ఐదేళ్లలో ఏం చేద్దాం?



సర్కారు ఏర్పడగానే తొలి 100 రోజుల్లో కార్యాచరణేంటి?

మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి మేధోమథనం

'వికసిత్ భారత్-2047'పై చర్చ

ఎన్నికల సమయంలో వివాదాలకు దూరంగా ఉండండి

విజేతలై రండి, మళ్లీ కలుద్దామని మోదీ వీడ్కోలు సందేశం

10



'స్వచ్ఛ భారత్'లో 'చెత్త' మనుషులు

ఇంకా ఏప్రిల్ నెల ఎండలే
గాలీ లేదు గాలికి దారీ లేదు
నిద్రలేని రాత్రి నిద్రరాని రాత్రి నిరంతర మెలకువ
కరోనా కాలంలో ఖాళీ చేసిన ఇల్లట
ఇంట్లో అంతా ముక్క వాసన ముక్కుకు పట్టింది
ఇపుడెక్కడి నుంచీ పీల్చనక్కర్లేదు
నువు దానితో సహజీవనం చేయాల్సిందే
బయటి నుంచి చుట్టూ మురుగు వాసన
ధ్యాసంతా ప్లాస్టిక్ చక్రాల చెత్తబండీ చప్పుడు మీద
అలికిడి అయితే లేచి కిచెన్ కిటికీ నుంచి చూస్తాను
ఆజానుబాహువైన కొడుకు ఆత్మీయమైన తల్లి
అతను ఒక దాంట్లోంచి తోడి తడి పొడి వేరు చేస్తూ
వేరే దాంట్లో వేస్తూ ఉంటాడు
చేతులకు తొడుగులూ ఉన్నట్లు లేవు
అతడు ఎంతమంది సఫాయీ కర్మచారీల వ్యక్తరూపమో
మహానగర దివారాత్రుల కార్యకలాపాల విసర్జన వేకువవేళ
లిఫ్ట్‌లో చక్రాల డబ్బాతో వాళ్లు వస్తున్న శబ్దం
కోసం వేచి ఉన్నపుడు అనుకుంటాను
అపార్ట్‌మెంట్స్ సిసి కెమెరాల్లో తప్ప
ఈ 'చెత్త మనుషులు' స్వచ్ఛ భారత్ ప్రచార
వీడియోల్లో మీడియాలో
ఎప్పుడయినా ఎక్కడయినా కనిపిస్తారా అని
'మన్ కీ బాత్'లో వినిపిస్తారా అని.

2
మే నెలా సగం గడిచిపోయింది
బిఎంఎంసి డ్యూటీలు మార్చినట్లున్నది
ఇపుడు మధ్యాహ్నాలు వస్తున్నారు 'చెత్త' మనుషులు
పని పెరిగిందో బతుకు తెరువు కరువయిందో
బడికి సెలవులో కాని ఇపుడు
అటు కిచెన్ కిటికీ నుంచి ఆ తల్లీ ఆ కొడుకే
తడి పొడి వేరు చేయడం తల్లి వంతు
ఇటు ముగ్గురు పసిపిల్లలు కూడా వస్తున్నారు
మా అపార్ట్‌మెంటుకు దొర్లిస్తున్న చక్రాల బండి వెనుక
దూరం నుంచి
ఆ చేతులూ లేత రూపాలూ కనిపించవు
తలుపు తీస్తే
చిరునవ్వు వెలిగించిన మట్టి ప్రమిదల్లా
ఆ పిల్లల కేరింతల మాటల్లో
'ఖానే కే టైమ్ పే ఆతే క్యా, కచ్రేవాలే'
అని విసుక్కుంటున్నాడు ఎదురింటాయన.

('అకవితా వస్తువు' మర్లిన్ మన్రో మీదనో, 'చిరునవ్వు భాష' స్మితా పాటిల్ మీదనో రాసి ఉండవచ్చు గాని, 'చెత్త' మనుషుల మీద రాసినా అచ్చెయ్య వచ్చునా అని ఇన్నాళ్లూ బయట పెట్టలేదు. 2024 హైదరాబాదు బుక్‌ఫెయిర్‌లో 19 ఫిబ్రవరి రాత్రి గార్బేజ్ కలెక్టర్ జయను ఆన్‌లైన్‌లో విన్నాక ఈ ఉపరితల సఫాయీ కర్మచారీలకు మించిన కవితా వస్తువులెవరుంటారు అనిపించింది. లక్షలాది జయల కోసం.)

వరవర రావు
ముంబై, 2023 వేసవి

(బిఎంఎంసి - బృహన్ ముంబాయి మునిసిపల్ కార్పొరేషన్)

నవలను విజ్ఞాన సర్వస్వంలా తీర్చిదిద్దిన నేర్పరి

నగర జీవన చిత్రణ, గ్రామీణ జీవన చిత్రణ విరుద్ధమైనవని, వాటిని ప్రతిపాదించేవారు వేరువేరుగా ఉంటారని సామాన్యంగా భావిస్తారు. కాని ఈ రెండిటిలోను నేర్పును ప్రదర్శించగలిగిన విశిష్ట రచయితలు అరుదు. అలాంటి అరుదైన రచయితల్లో నవీన్ ముఖ్యులు.

మన అలంకార శాస్త్ర చరిత్ర సుదీర్ఘమైనది. నాట్యశాస్త్రంతో మొదలై జగన్నాథ పండితరాయల రసగంగాధరం వరకు విస్తరించుకొని ఉన్న శాస్త్రాలన్నీ కావ్య నిర్వచనాలకు, నాటక కళకు పరిమితమై ఉన్నాయి. ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసం లాంటి వాటిని, నవరసాలను కావ్యాలకు, నాటకాలకు అన్వయింపజేసి ఎంతోమంది ఆలంకారికులు చర్చలు చేశారు. ధ్వని ప్రస్థానం లాంటివి కావ్య నాటకాలకు మాత్రమే అన్వయిస్తాయనిపిస్తాయి. కథన కళకంటూ విశిష్ట లక్షణాలను ప్రతిపాదించిన ఆలంకారికులెవ్వరూ లేరు. కథా నిర్మాణ శిల్పం గురించి తెలుగులో కొన్ని రచనలు వచ్చాయి కాని వాటివల్ల పూర్తిగా కథన కళ స్వరూపం అవగతం కాదు. దీన్ని తెలుసుకోవాలంటే చలం, కొడవటిగంటి, గోపీచంద్, మధురాంతకం, రావిశాస్త్రి, అంపశయ్య నవీన్ లాంటి రచయితల్ని చదివి అర్థం చేసుకోవలసిందే.

నవీన్ కథాకథన సామర్థ్యానికి 'అంపశయ్య', 'కాలరేఖలు' రెండు కొండగుర్తులు. ఒకటి నగర జీవనానికి దర్పణమయితే మరొకటి జీవన వైవిధ్యంలోని లోతుల్ని దర్శించే విజ్ఞాన సర్వస్వం. ఈ రెండిటి మధ్య వచ్చిన అనేక కథా సంకలనాలు మానవ స్వభావ చిత్రణలో ఎన్ని పోకడలను ప్రదర్శించవచ్చో నిరూపిస్తూ అంపశయ్య నవీన్ కథను ఎన్ని మలుపులు తిప్పగలడో తెలుపుతున్నాయి.



> **నవీన్ కథాకథన సామర్థ్యానికి 'అంపశయ్య', 'కాలరేఖలు' రెండు కొండగుర్తులు. ఒకటి నగర జీవనానికి దర్పణమయితే మరొకటి జీవన వైవిధ్యంలోని లోతుల్ని దర్శించే విజ్ఞాన సర్వస్వం.**

'అంపశయ్య' నవల తెలుగు సాహిత్యంలో ఒక ప్రయోగమయితే 'కాలరేఖలు' నవల సాఫల్యం. చైతన్యస్రవంతిని సమర్థవంతంగా కథనంలో ప్రవేశపెట్టిన రచయితలు తెలుగులోనూ ఉన్నారు. బుచ్చిబాబు, గోపీచంద్, రాచకొండ విశ్వనాథశాస్త్రి లాంటి రచయితలు చైతన్య స్రవంతి మర్మాలు తెలిసినవారు. నవీన్ అసలది చైతన్యస్రవంతి అనో లేక మరో శాస్త్రీయ పంథాకు చెందినదనే భావన కలగనీకుండా అత్యంత సహజంగా కథలో ప్రవేశపెట్టారు.

'అంపశయ్య' నవలలో విద్యార్థి దశలో రవి ప్రధాన కేంద్రమయితే అతని చుట్టూ ఉన్న స్నేహితులు విభిన్న మనస్తత్వాలకు ప్రతినిధులుగా కనిపిస్తారు. సామాజిక వైరుధ్యాలు, ఆలోచనల వైవిధ్యాలు, వ్యక్తుల మధ్య అంతరాలు, ఆకర్షణలు, వైఫల్యాలు, అన్ని రకాల సంఘర్షణలు అక్షర రూపం దాల్చాయి. ఇది ఇలాగే ముగిసి ఉంటే ఇదొక అసమర్థుని జీవయాత్రగానో, విఫల మనోరథుని అంతిమయాత్ర గానో ముగిసిపోయి ఉండేది. కాని నవీన్ తన పాత్రను ఒక ఆశావాదిగా, ఆశయాల సాధకుడిగా నిలబెట్టడం మెచ్చుకోదగ్గ విషయం.

కథలో సంఘటనలనే ప్రధానంగా తీసుకున్నప్పటికీ ఆ సంఘటనలకు కారణమైన వ్యక్తులను సమర్థవంతంగా చిత్రించడంలో రచయిత నైపుణ్యం ఇమిడి ఉంటుంది. ఈ పాత్రలు కేవలం సంఘటనలలో ఒక పాత్ర వహించడానికే ఉంటే అది నైపుణ్యం అనిపించుకోదు. ఏ పాత్ర అయినా ఒక సామాజిక సత్యానికి, అంతరంగ మథనానికి, మానవ భావజాలానికి ప్రతినిధిగా నిలిస్తే రచయిత కథన సామర్థ్యానికి ప్రతీకగా నిలుస్తాడు. ఇలా ప్రాతినిధ్యాన్ని కల్పించడం అంపశయ్యలో కనిపిస్తుంది. మానవ స్వభావానికి పాత్రల ద్వారా ప్రాతినిధ్యం కల్పించడంలో తాను దిట్టనని నిరూపించుకున్నారు నవీన్.

చైతన్యస్రవంతి అంటే అంతరంగాన్ని ఆవిష్కరించడం. ఏ క్షణానికాక్షణం మెదడులో పుట్టే ఆలోచనల్ని జీవితానికి అన్వయించి విశ్లేషించి చూడగలిగితే రచయితకు సార్థక్యం లభిస్తుంది. ఇది సంక్లిష్టతకు పరమావధిగా మారి అధోజ్ఞాపికల వరకు వెళ్లిందంటే అది సహృదయ స్పందనకు దూరమవుతుంది. మానసిక సంఘర్షణల సంక్లిష్టతను సరళంగా చిత్రించడం అంత సులభమేమీ కాదు. విద్యార్థి జీవితంలో కనిపించే విభిన్న కోణాలను అత్యంత సహజంగా పాఠకుని ముందుంచారు రచయిత. నాగరిక జీవితంలోని వైరుధ్యాల్ని, గ్రామీణ జీవితంలోని అమాయకత్వాన్ని అనుసంధానం చేయగల్గిన విశిష్ట ప్రయోగం 'అంపశయ్య'. గ్రామీణ వాతావరణం నుంచి నగర జీవనంలో ప్రవేశించిన యువకుల మానసిక సంఘర్షణను నిరూపించడానికి 'అంపశయ్య' కంటె అర్థగాంభీర్యం కల పేరు మరొకటి లేదు.

వ్యక్తుల సంఘర్షణల సమాహారంగా 'అంపశయ్య' నవల వెలువడితే సమాజం లోతుల్లోకి తొంగిచూడాల్సినంత విస్తృత పరిధిలో 'కాలరేఖలు' నవల వెలువడింది. 1944 నుంచి 1956 వరకు - అంటే, పదకొండో ఆంధ్ర మహాసభ నుండి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రావతరణ వరకు పన్నెండేళ్ళ కాలాన్ని ఈ నవలలో చిత్రించారు. దీని కాలావధి పన్నెండేళ్ళే కావచ్చు కాని అది విగిల్చిన కాలరేఖలు మాత్రం అనంతమైనవి. లేకుంటే ఆరువందల పుటల బృహదాకార గ్రంథం వెలువడేది కాదు. తెలంగాణ ప్రపంచ చరిత్ర పుటలకు అందించిన చారిత్రక పోరాటం ఈ కాలావధిలోనే జరిగింది. ఈ పోరాటం స్వరూపాన్ని, దాని ద్వారా జరిగిన జీవన పరిణామాన్ని ఈ నవలలో చిత్రించారు నవీన్.

కాలరేఖలు నవల అయినా నాటకీయతను సంతరించుకొని ఒక దృశ్యకావ్యంలా కనిపిస్తుంది. ఇలాంటి నవల రాయాలంటే కేవలం కల్పన సరిపోదు. వాస్తవాంశాలను, సామాజిక సంఘటనలను, వాటి ప్రాముఖ్యాన్ని గుర్తించి వాడుకోవలసి వస్తుంది. నవల ఎత్తుగడలోనే కథాస్వరూపాన్ని సూచించారు నవీన్. "తన మొట్టమొదటి జ్ఞాపకం.... పన్నెండేళ్ల క్రితం తన ఊర్లో జరిగిన ఒక మహాసభ" అని ప్రారంభించి అప్పటి నాయకులను పరిచయం చెయ్యడం ద్వారా ఈ నవల నేపథ్యాన్ని, ఈ కథలోని సామాజిక పరిస్థితుల్ని సూచించారు. కథ సాగేకొద్దీ సంఘటనలు ముడులు విప్పుకుంటూ పోతాయి. ఒక్కొక్క పాత్ర పరిచయమవుతూ ఉంటే కథాబలం పెరుగుతూ ఉంటుంది. రచయిత సమాజంలో ఆచారాలను, సంప్రదాయాలను, వ్యక్తుల భావవ్యక్తీకరణను ఎంత సూక్ష్మంగా గమనించి కథలో వాడుకున్నారో చూస్తే అబ్బురపడతాం. పండుగలు, పబ్బాలు, పెళ్ళిళ్ళ ముచ్చట్లు, బాల్య వివాహాలు, పాఠశాలలో చదువుల తీరు - ఒక్కటేమిటి పల్లెటూరి సమాజంలో విషయాలన్నీ విపులంగా నవల ప్రారంభంలోనే చోటు చేసుకున్నాయి.

నవల సాగేకొద్దీ పాత్రల క్రమ పరిణామాన్ని రచయిత చిత్రించిన తీరు కూడా రచనలోని పనితనానికి తార్కాణంగా ఉంది. వీరయ్య, సత్యం మాటల్లో వైరుధ్యాన్ని చూపడం ద్వారా సమాజంలో వర్గ సంఘర్షణను, పోరాటం ఆవశ్యకతను సూచించారు రచయిత. సత్యం మాటల్లో ఇది స్పష్టమయింది: "ఆంధ్ర మహాసభ చాలా చేస్తది. సమాజంలో ఉన్నోళ్ళకు లేనోళ్ళకు మధ్య వున్న తేడాను పోగొడ్తది. ఈ దొరల పెత్తనాన్ని, భూస్వాముల పెత్తనాన్ని, వెట్టిచాకిరిని రద్దుజేస్తది. కులమత భేదాల్ని లేకుంటజేస్తది. అందరూ సమానంగుండే సమాజాన్ని స్థాపిస్తది". సత్యం చిన్నాయనంటే రాజుకు గౌరవం. అతనికి సత్యం మాటల్లో నిజం కనిపించింది. తను పెద్దయ్యాక సత్యం చిన్నాయన లాగే బాగా చదువుకొని అనేక విషయాలు తెలుసుకోవాలని రాజు అనుకోవడంలో రాజులో వ్యక్తిత్వ వికాసాన్ని రచయిత సూచించారు.

కథ ముందుకు సాగేకొద్దీ రాజులో పరిణామాన్ని, అతనిలో రేకెత్తే ఆలోచనల్ని, కులరహిత సమాజం కోసం అతను చేసే ప్రయత్నాల్ని అత్యంత సహజంగా చిత్రించారు రచయిత.

సత్యాన్ని "రావి నారాయణరెడ్డి గొప్పోడా? గాంధీ మహాత్ముడు గొప్పోడా?" అని రాజు అడగడంలో అమాయకత్వంతో బాటు విషయాలు తెలుసుకోవాలన్న కుతూహలం కనిపిస్తుంది. గాంధీ మహాత్ముడు బ్రిటిషోళ్ళను వెళ్ళగొట్టేందుకు పోరాటం జేస్తుంటే రావి నారాయణరెడ్డేమో నైజాం రాజును వెళ్ళగొట్టేందుకు, దొరోల్లను గద్దె దించేటందుకు పోరాటం చేస్తున్నడనే విషయాన్ని సత్యం తెలుపుతాడు. వాళ్ళ వాళ్ళ స్థాయిలో న్యాయం కోసం పోరాటం జరపాలనే విషయం ఇందులో స్పష్టమయింది.


తెలంగాణా పోరాటాన్ని సృజనాత్మక రచన ద్వారా ఎలా పరిచయం చెయ్యాలో తెలుసుకోవాలంటే కాలరేఖలు చదివి తీరాలి. రజాకార్లు ఊరిమీదికొస్తే వాళ్ళనెలా ఎదుర్కోవాలో చర్చలు జరుగుతాయి. వడిసెలను తయారు చేసుకోవడం, వడిసెలలో ఉపయోగించే రాళ్లను తయారు చేసుకోవడం, గుదపల్ని, గొడ్డళ్ళని, బరిసెల్ని, రోకళ్ళని, కారపు పొడుల్ని సిద్ధంగా ఉంచుకోవడం చదువరుల మనసుల్లో కుతూహలాన్ని రేపడంతో బాటు అప్పటి సామాజిక పరిస్థితుల్ని కళ్ళకు కట్టినట్లు చూపిస్తాయి.

భారతదేశానికంతా స్వాతంత్ర్యం వస్తే హైదరాబాద్ పరిస్థితి మాత్రం భిన్నంగా ఉంది. రజాకార్లు గ్రామాల మీద పడి ప్రజల్ని చంపేస్తుంటే నిజాం, లియాకత్ అలీ నిమ్మకు నీరెత్తినట్లు ఉండిపోయారు. ఈ రాజకీయాల మధ్యలో గ్రామదేవతలు, పండుగలు, పూనకాలు, ఊరేగింపులు... ఒకటేమిటి ఈ నవలలో లేని విషయమంటూ లేదనిపిస్తుంది. ఇదొక విజ్ఞాన సర్వస్వం. రచయిత చుట్టుపక్కల సమాజాన్ని, అందులో మనుషుల్ని, మానవ సంబంధాల్ని శక్తివంతంగా నిరూపించారు. ముఖ్యంగా భవిష్యత్తుపై ఆయనకున్న ఆశ, అభ్యుదయాకాంక్ష స్పష్టంగా కనిపిస్తాయి. నవల ముగింపు దీన్నే సూచిస్తుంది. స్కూలు బిల్డింగ్ గోడలు పైకి లేస్తుంటే చూచిన రాజు అది నవభారత నిర్మాణ ప్రతీక అనుకుంటాడు. ఈ దేశంలో తరతరాలుగా పేరుకుపోయిన అవిద్య, అజ్ఞానం, మూఢనమ్మకాలు పటాపంచలైపోతాయనుకుంటాడు. దేశమంతా విజ్ఞానజ్యోతులు వెల్లివిరుస్తాయని ఆశిస్తాడు. ఇలాంటి సదాశయం రచయితది.

ఒక విధంగా ఈ నవల మిథ్యా సాహిత్యపు విలువలపైన తిరుగుబాటులా కనిపిస్తుంది. సైద్ధాంతిక చర్చల ద్వారా సమాజాన్ని విశ్లేషించకుండా పాత్రల ద్వారా, సంఘటనల ద్వారా వాస్తవాలను ప్రతిబింబింపజేయడం ఈ నవలలో విశేషం. ఒక రచనను విజ్ఞాన సర్వస్వంలాగా తీర్చిదిద్దడంలో ప్రాచీన కవులలో పాల్కురికి సోమనాథుడితో పోల్చదగినవాడు నవీన్ అని చెప్పే అతిశయోక్తి కాదు.

ఆర్వీయస్ సుందరం

రంధి సోమరాజు రసస్పృష్టి 'పొద్దు'



తెలుగు జాతీయ సాహిత్యం జానపద సాహిత్యం. ఇందులో మన భాషామూలాలు, పల్లెపట్టుల ప్రాకృతిక జీవన వైవిధ్యాలూ అనేకానేక పరిణామాంశాలూ ప్రతిఫలిస్తూంటాయి. జానపద వాఙ్మయంలో ఎన్నో శాఖోపశాఖలు. ఆ గేయ సాహిత్యంలో రచనా కర్తృత్వాలు అనామకంగానే ఉంటాయి. కవిత్వ పరిమళాలను చిందిస్తూంటాయి.

జానపద ప్రభావ స్ఫూర్తితో వచ్చిన నండూరి సుబ్బారావు ఎంకి పాటలు చెళ్ళపిళ్ళ వంటి మహనీయులచే సైతం, వారి కోణాల కారణాల వల్ల, తక్కువ చేయబడినా రస భావ కవిత్వ సృజనాత్మకు శిఖరాయమాన ఉదాహరణమై కవితా విజయ పతాకను ఎగురవేసింది. కొనకళ్ళ ప్రభృతులు ఈ విధమైన పాటలు రాశారు. ఆ వెనుక కాలంలో గురజాడ ప్రభావంతో గరిమెళ్ళ, బసవరాజు, కవికొండల ప్రజల భాషలో సారళ్య స్థితిలో తమ ప్రత్యేకతలతో పాటలూ అవీ రాసి రసజ్ఞ రంజకులైనారు. అయితే జానపద సాహిత్యంలో తూర్పు యాస బాసలో వచన కవితల్లో ఋతువర్ణనలు రసవత్కవిత్వపు గీటురాయికి తగ్గట్లు రాసిన గొప్ప కవి రంధి సోమరాజు. ఈ వర్తమాన తరం కవులు ఆయనని పట్టించుకుని స్ఫూర్తి పొందవలసిన అవసరం ఉంది. ఇలా చెప్పడానికి కారణం ఆయన 'పొద్దు' కావ్యం. అది ఋతు వర్ణన రత్నాకరం. కమ్మని తూర్పు యాస బాసలోని మెత్తందనాన్ని గుత్తకు తీసుకున్న కావ్యం. కొత్తచూపు, కొత్త ఒరవడి పొదిగించుకున్న కవితాకాల ముద్రలవి.

కొన్ని ప్రయోగాలు కొందరివి అద్భుత పాండిత్య స్ఫోరకాలుగా వచ్చి చరిత్రలో పేర్కొనబడతాయి. ప్రజా రసజ్ఞులను చేరకపోవచ్చు. ఉదాహరణకు శతాధిక గ్రంథకర్త శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి రాసిన 'శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిరూష్మ నిర్వచనైకాదశాక్షరీ శాకుంతలం' వంటివి. కొందరి ప్రయోగాలు రసబంధితాలైన కవిత్వ సంబంధితాలు కావడం వల్ల రసజ్ఞ పఠనీయ యోగ్య ప్రయోజనకర ప్రయోగాలవుతాయి. అటువంటి ప్రయోగం రంధివారి 'పొద్దు'. అయిదు దశాబ్దాల క్రితం 1972లో జానపద ప్రభావ సాహిత్యాకాశంలో అది ఒక కొత్త పొద్దు పొడుపైంది. కవితా రాగ రంజితమైంది. 'పొద్దు'లో వానాకాలం, శీతకట్టు, ఏసంగి పొద్దులు అనేవి మూడు విభాగాలు.

తక్కిన కవుల వలే వారు రాసే పద్ధతుల్లో వచన కవిత్వం రాసే రంధి సోమరాజుకు ఎంత సాధన చేస్తే ఈ తూర్పు యాస బాసలో పట్టువచ్చిందీ, జానపదులే వ్రాసినట్లుందీ అని వేత్తలు ఆశ్చర్యపోయారు. ఆయన చూపూ, భావుకత, నిర్మాణ ధురీణత్వం వల్ల ఆయన ఇతర రచనలకు భిన్నంగా విలక్షణంగా ఉండి పొద్దు శాశ్వతంగా చదువుకొని భావించుకోదగ్గ కావ్యమయింది. వాల్మీకి, కాళిదాసు వంటి మహాకవుల కాలం నుండి శ్రీకృష్ణ దేవరాయల వంటి కవుల కాలం నుండి వెనుక, ముందు కవులు ఋతు వర్ణనలు మనోహర మనోజ్ఞంగా చేశారు, విశ్వనాథాదులూ చేశారు, రాశారు. అయితే జానపద యాస బాసలో చేసిన ఘనత రంధివారిదే.

వానా కాలంలో- "జలజల సినుకులడ్తావుంటే/ సమర్తాడిన గుంటలు/ సెమ్మసెక్కలాడ్తున్నట్టుంటాది/... వానలకి కొత్త తలుపు సెక్క లెదిగి/ సచ్చినోడి పల్లనా బిగుసుకుపోతే/ తెల్లారగట్ట తలుపుల్తో కుత్తీ పట్టిపట్టి/ భడాలున అయ్యి వూడొత్తే/ కొత్త మొగుడూ పెల్లాలు/ వొరు మీద వొరు పడిపోయి/ వొకటే సిగ్గులు/ ఆ సెనంలో ఆల్ని సూసినోల్ల/ కల్లల్లో లచ్చ ఎలుగులు" అంటారు. ఇందులో కైత వెలుగులున్నాయి.

"డబ్బుండాల గాని/ కోడిమాంసం గారెలు/ తింటావుంటే/ వానా కాలం/ సొరగమెహె!" - వానలకి ఇంట్లో వుండే కొందరి భావన. "వానకి మట్టీ యిసకా కొట్టుకపోయి/ కంకర్రోడ్రునిండా లెగిసిన రాలు/ దొంగరాలుగాయి కౌన్సిలేర్ల/ రంపంపల్లనా వుంటాయి." సామాజికాంశాల్ని కవితీకరించడంలో సోమరాజు దిట్ట.

వ్యంగ్య మర్యాద తెలిసిన ఆయన, "గోదారి పూటుగా వొత్తే/ సూడ్డానికొచ్చే పట్టుసీర్ల రాణీలు/ బిడ్జీ కాడ ఈదుల్లోని నీలు సూసి/ సీర్ల కన్నా వొల్లే సిగ్గు లేన్దని/ గుడ్డలెత్తుకొని నడుత్తారు" అంటారు.

"వానలో ఎలిగే బల్బులు/ సిన్ని సేమంతి పూరేకు మొనల్లాటి/ సిరుసెమటతో మెరుత్తూ/ నల్లని కిరనాల వాన కురిపిత్తయ్/ సిన్ని బుడ్డి సూరి దేవుళ్ళనాగ" అని సౌందర్య వర్ణన చేస్తారు.

"జెర్రి పాకినట్టు ఆకాశం మీద సూడు/ ఎలా పాకుడ్డో మెరుపు" అంటూ కవిత్వంలో పోలిక మెరుపు చూపిస్తారు.

"ఎన్ని సీతాపల్లు తిన్నా/ అదేటో/ ఆ ఇట్టానికిట్టమే గాని మరో అడ్డుండదు/ పానకంలో పుడక నాగ/ పిక్కలొక్కటే అడ్డు/ ఆటిని తిని తిని/ ఇన్ని నీలు తాగితే సాలు/ వొంటికేటీసెయ్యదు" అంటూ సీతాఫలవంత కవిత పలుకుతారు.

"ఏలెట్టి/ ఆకాశం కంటిలో పొడిత్తే/ కారే నీలలా/ వొకటే వాన", "సెట్లు కూలిపోయి/ పచ్చులు రాలిపోయి/ యీదుల్నిండ/ ఆకులు సెల్లాసెదురై వుంటే/ యిళ్ళన్నీ మొగుడుసచ్చినట్టు/ తెల్ల మబ్బు ముసుగుల్తో బెంగనావున్నాయ్/ తెల్లారేతలికి" అంటే భావుకతలో ఎంతటి లోతు!

"పట్టణాల్లోని బజారుల్లో/ మడ్సుల నెత్తి మీద గొడుగులు/ ఎగుడు దిగుడు తార్రోడ్రునా వుంటాయి/ మేడ మీదున్న కుర్రోలు/ దాని మీద వో సిన్ని కారు/ తోలాలనుకుంటారు. నల్లటి గొడుగుపై భాగాలు తారు రోడ్డులా కనబడింది కవి దృష్టికి. అందరూ వచన కవిత అని వ్యవహరించే ప్రక్రియను సోమరాజు మాత్రం నవ కవిత అనే వ్యవహరిస్తారు. పొద్దు కవితల్ని 'నవ కవిత' అనే ముఖచిత్రంపై ప్రకటించారు.

ఇంక 'శీతకట్టు' విభాగంలో-

"పొద్దుటేల ఎండ మా సైతుగా వుంటాది/ బెమపడ్డ ఆడదాని ముందే/ కూసుండిపోయినట్టు/ య్యెండలో సతికిల పడాలనిపిత్తాది" అంటూ పోలికల జోలికల్లో ఊపుతారు. "అమ్మ కోసి పెట్టిన జున్ను ముక్క/ సలికి గడ్డ కట్టిన/ సెందురుడ్నా వుంది," అంటారు. "సన్నీలలో ఏలెడ్తే/ అయ్యి జివ్వున కర్సేసినాయి/ కొత్తగా పల్లొచ్చిన సిట్టి పాపాయినా"లో ఉపమానం బావుంది. "తెల్లారగట్ట/ గోదాట్లో/ అరటి దొప్పల్లో ఆడోళ్ళొదిలిన దివ్వెలు/ సుక్కలికి తల్లిసుక్కలెట్టిన బువ్వలోరే" అనడం మనోజ్ఞంగా ఉంటుంది. "ఎప్పుడూ నేదు గొల్లమ్మ/ సిక్కని పాలోసింది/ రేత్రి ఎన్నెల్ని కాని పిండుకుందేమో"... ఇలా ఎన్నెన్నో మరెన్నో!

'ఏసంగి పొద్దులు' విభాగంలో నిత్య జీవిత కార్యకలాపాల్లో వేసవి తాపాలు ఎలా ఉంటాయో బొమ్మకట్టి మరీ చూపారు. పిల్లలు ఈ కాలంలో, "తిండి తిన్రు/ వో నీలు తాగేత్తారు/ కూజా నీలంటే/ మాసెడ్డ మోజు/... కుర్రనాగమ్మల వొల్లు/ నూకల కూడు నా పేలిపోద్ది/ మంచిగందంసెక్క/ అరగదీసి పామితే/ తల్లి సుట్టూ గందం బొమ్మల్లా గెంతులేత్తారు". గంధం బొమ్మలై గెంతులేయడం- చిత్ర దృశ్యమే!


"నల్లని నీడల్లో/ కొమ్మరాకులు సాటెట్టి/ దాసిన టెంకాయలు/ సెక్కు కోని తాగితే పేనాలు లేసొత్తాయి/ నోట్లో ఏసుగుంటే సాలు/ మీగడ్లాటి నేత కొబ్బరి/ అమ్మ మనసునా కరుగుద్ది"- కైత ముగింపు వాక్యంలో బిగింపులో ఎంత ఆర్ద్రత! "సెక్కేసి వుప్పు నీలతో కడిగేసి/ అనాసకాయ ముక్కలు కోసుకోని/ పంచదారలో ఏసి నాలిక మీదెడితే... వాఁ/ ఎల్లవే ఏసంగీ/ మా దగ్గర కాదు నీ ఏసాలు/ అనాలనిపిత్తాది" అనడంలో బతుకు తీపి అనుభూతి చెందవలసిందే.

పల్లెటూళ్ళల్లో కొన్ని పట్టణాలలో సామాన్య జనుల సంపన్నుల ఉష్ణ జీవనాల దార్శనికత 'కవిత్వ రంధి'కి ఎంతో! అందుచేతనే- "వట్టేళ్ళ తడకలు కట్టుకోని/ నీలు జల్లించుకుంటూ బలిసినోలు/ పంకాలేసుకోని/ మద్దేనపేల/ సైతుగా కునుకుతారిల్లల్లో/ డబ్బున్నోలకి కాలం బలాదూరెహె" అంటారు.

రంధివారి రచనా నైపుణ్యానికి, ప్రాకృతిక సౌందర్య దర్శన దృష్టికి, భావుక శక్తికి తార్కాణంగా ఏసంగి పొద్దుల్లోని ఈ కైతని భావించాలి: "పిటపిటలాడే సాకలి సిన్నది/ వొయ్యారం వొల్లైంది/ రేవు కాడ రైకిసిరేసి/ వున్న వోయిల సీరిప్పకుండ/ నీలల్లో మునిగి/ మునేల మీద గట్టెక్కితే/ ఓరి నాయనో ఎయ్యి కల్లు సాలవే/ పొరలు పొరలుగా/ తడి వొదుగుల్ల సీర నలుగుళ్ళు/ సెర్మాన్ని సుట్టేసుకుని/ బిగువుల్ని సూపితే/ సిగ్గేసి సిన్నది సిన్న నవ్వు నవ్వితే/ చస్... ఆ నవ్వునా ఎలగనేకపోనానని/ సురీడు సిగ్గుతో సత్తాడంతే," అన్నారు.

ఇటువంటి స్వచ్ఛ జానపద మార్గ వచన కవి తల్లి కూర్చుకుంది కనకే 'పొద్దు'ను, 'పొద్దు' కవినీ కవిత్వ రంగంలో హేమాహేమీలు నిండా ఇష్టంతో మెచ్చులు కురిపించారు. ఆచార్య సి. నారాయణరెడ్డి "సోమరాజు చేతిలో యేం మయిమ వుందోగాని అందరికీ విరుకున్నదే మా ముద్దుగ జెప్పుతడు. ఒకసారి యెన్నపూస తీర్గ యిడదీసి సూపుతడు. ఇంకోసారి యెండి కొండంత యెదిగి అందకుండ పోతడు" అన్నారు. సంజీవదేవ్ "సోమరాజు చూసే చూపు వేరు; రాసే రూపు వేరు" అంటారు. దాశరథి "మన ఊళ్ళలో మాట్లాడుకునే భాషకు కావ్యతను కల్పించి ఒప్పించడం మెప్పించడం సోమరాజుకే చెల్లింది. ఆచ్ఛాదనలేని అపురూప సౌందర్యం 'పొద్దు'లో ప్రతి పంక్తిలోను నాకు కన్పించింది. ఈయన కవితా సౌందర్యాన్ని చూడడానికి వేయి కళ్ళు చాలవు" అన్నారు. మల్లంపల్లి శరభయ్య "ఇది జానపదుల ఋతుసంహారం! కాదు - కాదు - ఈ జాతి జీవనంలో ఇది కొంగ్రొత్త పొద్దు! పూర్వ ఋతు వర్ణనలు చదివి, యిది చదివితే - ఉద్యాన లతల అందం అడవితీగల అందం ముందు బలాదూరు అన్న కాళిదాసు గుర్తుకు రాక మానదు" అనడంలో ఎంతో విశేషముంది.

రంధి సోమరాజు ఈ ఒక్కరచనతోనే పొద్దు పుచ్చలేదు. దశాధిక గ్రంథాలు రాశారు. విరగిన కల్చర్, సిన్నమ్మ వచ్చింది, బుల్లి బుల్లి సిత్రాలు, రసోరా, రోజీ, ఎదగండి, బూర్జువా పెళ్ళికూతురు, దినమొల సోగ్గత్తె వంటి కవిత్వ గ్రంథాలు రాసి ప్రసిద్ధి పొందారు. ఆదర్శాలు అవరోధాలు, సౌందర్యం - సౌశీల్యం, దుఃఖితులు వంటి నవలలు రాసిన నవలా రచయిత. ఉన్నతాశయాలు, దేవుడైన మానవుడు, నేనేమి చేశాను, ఈ మనిషి ఈ లోకం, సోమరాజు కథలు- రాసిన కథా రచయిత. రతనాల తండ్రి అనే నాటికను రాశారు. సోమరాజు 1927 మార్చి 1వ తేదీన రాజమహేంద్రవరంలో జన్మించారు. 2006 సంవత్సరం జనవరి 25వ తేదీన విశాఖపట్నంలో 79వ ఏట కీర్తిశేషులయ్యారు. ఆధునిక, అభ్యుదయ, విప్లవ భావాల సమాహారం ఆయన రచనలు. జానపదపు తూర్పు యాస బాసలో పొద్దును ప్రయోజనకర కావ్యంగా ప్రయోగాత్మక కావ్యంగా ఋతు వర్ణనల గ్రంథంగా కవిత్వ రసజ్ఞులకు ప్రదానం చేసిన అవిస్మరణీయుడు ఆయన.



> **జానపద సాహిత్యంలో తూర్పు యాస బాసలో వచన కవితల్లో ఋతువర్ణనలు రసవత్కవిత్వపు గీటురాయికి తగ్గట్లు రాసిన గొప్ప కవి రంధి సోమరాజు. ఈ వర్తమాన తరం కవులు ఆయనని పట్టించుకుని స్ఫూర్తి పొందవలసిన అవసరం ఉంది. ఇలా చెప్పడానికి కారణం ఆయన 'పొద్దు' కావ్యం. అది ఋతు వర్ణన రత్నాకరం. కమ్మని తూర్పు యాస బాసలోని మెత్తందనాన్ని గుత్తకు తీసుకున్న కావ్యం. కొత్తచూపు, కొత్త ఒరవడి పొదిగించుకున్న కవితాకాల ముద్రలవి.**

సన్నిధానం నరసింహశర్మ
92920 55531

ప్రాచీన కావ్యాలు, లక్షణ గ్రంథాలపై సమాలోచన

తెలంగాణ విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయన శాఖ - ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం నెల్లూరు, భారతీయ భాషా సంస్థ మైసూరు సంయుక్త ఆధ్వర్యంలో 'తెలుగు ప్రాచీన శాస్త్ర కావ్యాలు, లక్షణ గ్రంథాలు - సమాలోచన' అంశంపై మార్చి 5, 6 తేదీల్లో నిజామాబాద్ డిచ్‌పల్లిలోని తెలంగాణ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్మెంట్ కళాశాల సెమినార్ హాల్లో జాతీయ సదస్సు జరుగుతుంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథి బుర్రా వెంకటేశం, విశిష్ట అతిథులుగా ఎం. యాదగిరి, శైలేంద్ర మోహన్. సభలో కసిరెడ్డి వెంకటరెడ్డి, మాడభూషి సంపత్ కుమార్, సి. ఆరతి, పి. కనకయ్య తదితరులు పాల్గొంటున్నారు.

సిహెచ్ లక్ష్మణ చక్రవర్తి

ఫీచర సునీతా రావు పురస్కారాలు

ఫీచర సునీతారావు పురస్కారాలు 2023 సంవత్సరానికి గజ్జల రామకృష్ణ 'దీపముండగానే' కవిత్వ సంపుటికి; చింతకింది శ్రీనివాస్ 'ఉడుకు బెల్లం' కథా సంపుటికి; లక్ష్మణ చక్రవర్తి 'షడ్చక్రం', ఆడెపు లక్ష్మీపతి 'దిక్ చక్రం' విమర్శ పుస్తకాలకు లభించాయి. విజేతకు రూ.15000 నగదు జ్ఞాపికతో సత్కారం ఉంటుంది. విమర్శలో మాత్రం ఇద్దరు వ్యక్తులు సమానమైన మార్కులు సాధించి ఉమ్మడి విజేతలుగా ఎంపికయ్యారు. త్వరలో పురస్కార ప్రదానం జరుగుతుంది.

పి విజయేందర్ రావు

వచన కవితల పోటీ ఫలితాలు

కవిసంధ్య - భట్టిప్రోలు దుర్గాలక్ష్మీప్రసన్న స్మారక వచన కవితల పోటీలో రూ.3వేల ప్రథమ బహుమతికి 'ఖండిత శిరస్సుల ప్రశ్న' (బి. కళాగోపాల్), రూ.2వేల ద్వితీయ బహుమతికి 'యుద్ధలిపి' (ఆవాల శారద), రూ.1వెయ్యి తృతీయ బహుమతికి 'ఒంటరిరేవు' (చొక్కర తాతారావు) ఎంపికయ్యారు. ఒక్కొక్కటి రూ.500 కన్సోలేషన్ బహుమతులకు దేశరాజు, కుందుర్తి కవిత, రాజేశ్వరరావు లేదాళ్ళ, లోగిశ లక్ష్మీనాయుడు, కె. దాసుబాబు, దాసరి మోహన్, నేలపూరి రత్నాజీ, పొత్తూరి సీతారామరాజుల కవితలు ఎంపికయ్యాయి. సాధారణ ప్రచురణకు బి.వి. శివప్రసాద్, చిక్కొంద్ర రవి, బి. నాగరాజు, ఎ. శ్రీనివాసరావు, రమాదేవి కులకర్ణి, మల్లిపూడి రవిచంద్ర, కవిరాజుల కవితలు ఎంపికయ్యాయి. మార్చి 24 సా.5 గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో బహుమతి ప్రదానం ఉంటుంది.

దాట్ల దేవదానం రాజు

సముద్ర పక్షి



1.
రోజు రెండుగా చీలుతున్నపుడు
ఇల్లు గుర్తొచ్చి
గుండె పట్టనంత దిగులు
లోలోపలొక సుడిగుండపు రొద
రోజూ ఉండేదే

నన్ను నేను మడత పెట్టుకుని
కప్బోర్డ్‌లో సర్దుకునే లోపు
కేబిన్ రూం నుండి కబురు
జీవితాన్ని ఎక్కడిదక్కడ
వదిలేసి వెళ్ళిపోతాను

2.
దేశం కాని దేశంలో దిగుతున్నపుడు
చంటిదో చంటోడో గుర్తొచ్చి
మోయలేనంత రెప్పల బరువు

కాళ్ళకు సరిపడా నేల కోసం
వెదుకులాటలో
దేశాలు చాలా చిన్నవి
ఆకలీ అవసరాల ముందు
ప్రపంచపటం ఏ ఫోర్ సైజు కాగితం

బతుకును గాడిలోపెట్టే రెంచీ ఒకటి పట్టుకుని
ఖండాలమీద సముద్రపక్షిలా ఎగురుతుంటాను
రెక్కల్ని ఆరబెట్టుకోవడానికి
ఒక్క చెట్టూ కనబడదు

3.
బిస్తరి మడతలు విప్పినట్టు
రాత్రిని విప్పుతుంటే
ప్రాణంలో సగం గుర్తొచ్చి నిట్టూర్పు

రాత్రుళ్లు నేను
సగం ఒడ్డు మీదా సగం నీళ్ళలోనూ
ఊగే పడవను

చెదిరిన జ్ఞాపకాల్ని మూటగట్టుకొనేలోపే
పనులు చిట్టా విప్పడానికి
తెగిస్తుంది వేకువ

పనిలో పడిపోతే మరణిస్తాననే
విరామాల్లో తప్పనిసరిగా జీవిస్తుంటాను

4.
ఎత్తిపోసే నురగల మెరుపంతా తీరంలోనే
లోపలంతా కాటుకరంగు సముద్రం
పులికి దొరికిపోకుండా ఉండడానికి
చీకటిపొదలకు చిక్కుతుంటాను

ఎనిమిదో తొమ్మిదో నెలల తర్వాత
డ్యూటీ దిగి ఊళ్ళోకి వెళ్తుంటే
అందరికీ నేనొక కొత్త కరెన్సీనోటు గానో
పాత ఏటీఎం కార్డుగానో కనిపిస్తాను

5.
డెక్ మీద కొన్ని సాయంత్రాలు
నాకు నేను ఒక గాలిపటాన్ని,
దారం నుండి నన్ను తెంపేసే
పెనుగాలి అంటూ ఒకటి ఉంటుందని తెలుసు

సొంతగడ్డ మీద
చివరి ఊపిరి విడిచే అదృష్టం
నా వరకూ ఒక యాదృచ్ఛిక ఘటన.

సాంబమూర్తి లండ
96427 32008


విజయవాడ భవానీ ఘాట్ వద్ద చిన్నారికి పోలియో డ్రాప్స్ వేస్తున్న దృశ్యం

95 శాతం పల్స్ పోలియో

▸▸ నేడు, రేపు ఇంటింటా చుక్కల మందు

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నిండు జీవితానికి రెండు చుక్కలు అనే నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా ఆరోగ్యశాఖ నిర్వహించిన పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతంగా సాగింది. దాదాపు 95శాతం మందికిపైగా చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గవర్నర్ సతీమణి సమీరా నజీర్ చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. అనంతరం పోలియో బూత్‌ల వద్దకు రాని చిన్నారులను సోమ, మంగళవారాల్లో గుర్తించి, వారికి చుక్కల మందు వేయనున్నారు. 6వ తేదీన ఇంటింటి సర్వే చేయనున్నారు.

ఓటుతో తలరాతను మార్చుకుందాం!

కొండపి, మార్చి 3: ఓటును సక్రమంగా వినియోగించుకోవడం ద్వారా తలరాతను మార్చుకుందామని, నోటుకు ఓటును అమ్ముకోవద్దని ఓ యువకుడు స్వచ్ఛందంగా ప్రజల్లోకి వచ్చి అవగాహన కల్పిస్తున్నారు. ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం యడవల్లి గ్రామానికి చెందిన వేశపోగు గురువాబాబు అలియాస్ గురుసిద్ధార్థ్ కాలినడకన గ్రామాలు తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. ఆదివారం కొండపి చేరుకున్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడారు. తాను గతంలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ప్రచారం చేశానని తెలిపారు.


ప్రచార బోర్డుతో గురువాబాబు

ముగ్గురు విద్యార్థుల మృతదేహాలు లభ్యం

▸▸ మహాబలిపురం ఘటనలో మరొకరి కోసం గాలింపు

చెన్నై, యాడికి, మార్చి 3: తమిళనాడులోని చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం సముద్రతీరంలో గల్లంతైన నలుగురు విద్యార్థుల్లో ఆదివారం ముగ్గురి మృతదేహాలు దొరికాయి. అనంతపురంలోని ఓ కళాశాలకు చెందిన 18 మంది, చిత్తూరు జిల్లాలోని కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు విహారయాత్ర నిమిత్తం వేర్వేరుగా శనివారం మహాబలిపురం వచ్చారు. అక్కడి సముద్రంలో స్నానం చేస్తుండగా అలల తాకిడికి ఐదుగురు విద్యార్థులు గల్లంతైన విషయం విదితమే. వారిలో విజయకుమార్ మృతదేహం శనివారమే తీరానికి కొట్టుకురాగా.. శేషారెడ్డి, పెద్దిరాజు, మౌనిష్ మృతదేహాలను ఆదివారం రెస్క్యూ టీమ్ గుర్తించింది. మరో విద్యార్థి ప్రభు కోసం గాలిస్తున్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. జవాను మృతి

▸▸ పోలీసుల కాల్పుల్లో ఓ మావోయిస్టు హతం

▸▸ బీజాపూర్ జిల్లాలో ఆరుగురి అరెస్టు

దుమ్ముగూడెం/చర్ల, మార్చి 3: ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో ఆదివారం పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు హతమయ్యాడు. మావోయిస్టుల కాల్పుల్లో బస్తర్ ఫైటర్స్‌కు చెందిన పోలీస్ జవాన్ రమేశ్ మృతిచెందారు. కాంకేర్ జిల్లా చోటేబేతియా పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిందూర్ అటవీప్రాంతంలో మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారంతో పోలీసు బలగాలు కూంబింగ్ ప్రారంభించాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య కొన్ని గంటల పాటు ఎదురుకాల్పులు జరిగాయి. ఇదిలా ఉండగా, బీజాపూర్ జిల్లాలో ఐదుగురు మావోయిస్టు పార్టీ సభ్యులతో పాటు మరో మహిళా మావోయిస్టును అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. బీజాపూర్ జిల్లా బంగ్లా పోలీస్‌స్టేషన్ పరిధిలో కూబింగ్‌కు వెళ్లిన బలగాలను చూసి ఐదుగురు పారిపోతుండగా.. పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. రెండు కుక్కర్ బాంబులు, వైర్లు, రెండు డిటోనేటర్లు, కరపత్రాలు, బ్యానర్లను స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ జిల్లాలోనే పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళా మావోయిస్టును పోలీసులు అరెస్టు చేశారు.


జవాను రమేశ్

జీవో 11 అమలుకు పంచాయతీ కార్యదర్శుల డిమాండ్

విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్), మార్చి 3: పంచాయతీరాజ్ శాఖ విడుదల చేసిన జీవో 11ను వెంటనే అమలు చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీ బాషా డిమాండ్ చేశారు. విజయవాడలోని ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల ఆత్మీయ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా 10 ఉమ్మడి జిల్లాల నుంచి పంచాయతీ కార్యదర్శుల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జానీబాషా మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో అవినీతి ప్రక్షాళన కోసం పూర్తిస్థాయిలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు పూర్తిస్థాయిలో అండగా ఉంటామని హామీ ఇచ్చారు. భవిష్యత్తులో ఉద్యోగులకు మేలు చేకూర్చే ఏ రకమైన సహకారమైనా అందిస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం, పంచాయతీరాజ్ శాఖ విడుదల చేసిన జీవో నం 11 ద్వారా గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు సంబంధించిన అధికారాలు త్వరితగతిన అమలు చేయించే బాధ్యత తీసుకున్నామని పేర్కొన్నారు.

1.5 లక్షల మంది పాడి రైతులకు ఉచిత వైద్యం

▸▸ డాక్టర్ గుంటూరు వరుణ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ వరుణ్

విజయవాడ (వన్‌టౌన్), మార్చి 3: కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు విజ్ఞప్తి మేరకు యూనియన్‌లో సభ్యులుగా ఉన్న 1.5 లక్షల మంది పాడి రైతులకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు డాక్టర్ వరుణ్ కార్డియాక్ సైన్సెస్ చైర్మన్, ఐఏఐసీఎస్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ గుంటూరు వరుణ్ చెప్పారు. ఆస్పత్రిలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాధాలక్ష్మి హార్ట్ ఫౌండేషన్, ఇండియన్ ఇంటర్వెన్షనల్ కార్డియాక్ సర్జన్ల అసోసియేషన్ (ఐఏఐసీఎస్) సహకారంతో గతేడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది జనవరి వరకు తొలి విడతగా 1,700 మంది రైతులకు ఒక్కొక్కరికీ రూ.8వేల విలువైన వివిధ వైద్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన కొంతమందికి ఊపిరితిత్తుల వ్యాధికి సంబంధించి వైద్య పరీక్షలు కూడా నిర్వహించామని, వీరిలో 940 మందికి గుండె సంబంధిత సమస్యలున్నట్లు ప్రాథమికంగా గుర్తించామని తెలిపారు. 220 మందికి యాంజియోలు పూర్తయ్యాయని, ఆరుగురికి రూ.23 లక్షల విలువైన టావీ చికిత్సను కూడా ఉచితంగా అందించామని చెప్పారు. అవసరమైన వారికి అవోటిక్ వాల్వ్ మార్పిడి సహా రూ.4కోట్ల విలువైన స్టంట్‌లు, శస్త్రచికిత్సలు ఉచితంగా చేశామని పేర్కొన్నారు. తన తల్లిదండ్రుల పేరిట ఏర్పాటు చేసిన రాధాలక్ష్మి హార్ట్ ఫౌండేషన్ ద్వారా ఒక్కొక్కరికీ రూ.23 లక్షల విలువైన వాల్వ్ ఇంప్లాంటేషన్ ఉచితంగా చేసినట్లు తెలిపారు. రైతులకు సేవలందించడాన్ని సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. తమ ఆస్పత్రిలో అంతర్జాతీయ స్థాయి అత్యాధునిక హైబ్రిడ్ క్యాథ్‌ల్యాబ్ ఆపరేషన్ థియేటర్లు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో తానా మాజీ అధ్యక్షుడు లావు అంజయ్యచౌదరి, తానా కృష్ణాజిల్లా ఫోరం అధ్యక్షుడు రామ్ తాతినేని, కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, కృష్ణామిల్క్ యూనియన్ ఎండీ కొల్లి ఈశ్వరబాబు, రాధాలక్ష్మి హార్ట్ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ గుంటూరు రాజ్యలక్ష్మి, ట్రస్ట్ సభ్యులు రవీంద్రనాథ్ ఠాగూర్, కిలారు బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డా కొట్టొద్దురా..!

▸▸ తల్లి జుట్టుపట్టి ఈడ్చి.. ఎగిరి గుండెలపై తన్ని..

▸▸ తండ్రినీ చెంపలపై కొట్టి.. తన్ని దాష్టీకం

▸▸ కన్నవారిపైనే ఓ ఉన్మాది పుత్రుడి కాఠిన్యం

▸▸ ఆస్తి వెంటనే ఇవ్వలేదని విచక్షణారహితంగా దాడి

▸▸ మదనపల్లెలో ఘటన.. వీడియో వైరల్

▸▸ మూణ్నెల్లుగా కొడుతున్నాడని ఫిర్యాదిచ్చినా పట్టించుకోని పోలీసులు?


తల్లిని ఈడ్చుకెళ్తున్న శ్రీనివాసులురెడ్డి


ఆస్పత్రిలో బాధితులను విచారిస్తున్న సీఐ

మదనపల్లె టౌన్, మార్చి 3: నవమాసాలు మోసి, కని పెంచిన కన్నవారిపైనే ఓ కొడుకు మానవత్వానికి మచ్చ తెచ్చేలా ప్రవర్తించాడు. తన స్తన్యమిచ్చి ఆకలి తీర్చి.. గుండెలపై మోసి లాలించిన కన్నతల్లి గుండెలపైనే ఎగిరి తన్నాడు. తనకు ఆస్తి వెంటనే రాసివ్వలేదన్న అక్కసుతో.. కదలలేని స్థితిలో మంచానికి పరిమితమైన తండ్రిపైనా విచక్షణారహితంగా దాడి చేశాడు. సభ్య సమాజం తలదించుకునే ఈ సంఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లె పట్టణం అయోధ్యనగర్‌లో శనివారం చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో ఆదివారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు రంగంలోకి దిగారు. మదనపల్లె టూటౌన్ సీఐ యువరాజు కథనం మేరకు.. బి.కొత్తకోట మండలం బయ్యప్పరెడ్డిపల్లెలోని గుంతవారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి(72), లక్ష్మమ్మ దంపతులకు మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి కొడుకులున్నారు. వీరికి గ్రామ సమీపంలో మూడెకరాల భూమి, రెండెకరాల డీకేటీ పొలం ఉంది. ఇద్దరూ చెరి సగం వ్యవసాయం చేసుకుంటున్నారు. పదేళ్ల క్రితం చిన్నకొడుకు శ్రీనివాసులురెడ్డి వ్యవసాయం చేయలేదని మదనపల్లెలో చేనేత మగ్గాల పనిలో చేర్చారు. అప్పటి నుంచి వృద్ధాప్యంలో ఉన్న వెంకటరమణారెడ్డి, లక్ష్మమ్మ దంపతులు మదనపల్లె పట్టణం అయోధ్యనగర్‌లోని చిన్నకుమారుడు శ్రీనివాసులురెడ్డి వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో 2010లో రెండెకరాల డీకేటీ పట్టాలో బోరు వేసి, వేరు భాగాలు చేసుకున్నారు. మనోహర్‌రెడ్డి పేరిట రాసిన భూములను తన పేరిట రాసిమ్మని శ్రీనివాసులురెడ్డి తల్లిదండ్రులను డిమాండ్ చేశాడు. అందుకు వారు ఒప్పుకోకపోవడంతో ఆగ్రహించిన చిన్న కొడుకు శ్రీనివాసులురెడ్డి శనివారం తల్లిని దుర్భాషలాడుతూ జుట్టుపట్టుకుని ఈడ్చుకుంటూ వెళుతూ.. కాలితో తల్లి ఎదపై పలుమార్లు తన్ని దాడి చేశాడు. ఆమె వీపును గుద్దుతూ, చెంపలపై కొడుతూ విచక్షణారహితంగా దాడి చేశాడు. 'కొట్టొద్దు బిడ్డా' అని ఆ తల్లి వేడుకుంటున్నా.. కనికరం చూపకుండా తీవ్రంగా కొట్టాడు. కదలలేని స్థితిలో మంచంపై కూర్చొన్న తండ్రి వెంకటరమణారెడ్డిని సైతం కాలితో తంతూ, చెంపలపై కొట్టాడు. అక్కడే ఉన్న ఓ బాలిక ఈ ఘటనను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది ఆదివారం వైరలైంది. దీంతో కర్నూల్ రేంజ్ డీఐజీ సీహెచ్ విజయరావు ఆదేశాలతో మదనపల్లె టూటౌన్ సీఐ యువరాజు వేగంగా స్పందించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెంకటరమణారెడ్డి, లక్ష్మమ్మ దంపతులను విచారించారు. నిందితుడు శ్రీనివాసులురెడ్డిపై ఐపీసీ సెక్షన్ 324, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామన్నారు. కాగా, మూడు నెలలుగా తమను కొడుతున్నాడని పోలీసులకు ఫిర్యాదు చేసినా.. సర్దుబాటు చేసి పంపుతున్నారే తప్పచర్యలు తీసుకోలేదని బాధితులు తెలిపారు.

'పాఠశాల విద్య'కు పైసల్లేవు!



(మొదటి పేజీ తరువాయి)

పథకాన్ని కూడా అప్పులపై ఆధారపడి అమలుచేస్తోంది. 'ఈ ఏడాది డబ్బులు వచ్చే ఏడాది' అనే విధానంతో చెల్లింపులు ఆపేసింది. దీంతో విసిగిపోయిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతున్నారు. కనీసం 50శాతం బకాయిలు చెల్లిస్తేనే వచ్చే ఏడాది విద్యాకానుక వస్తువులు సరఫరా చేస్తామని తేల్చిచెప్పారు. దీంతో రూ.600 కోట్ల బకాయిల్లో ఇప్పటికిప్పుడు రూ.300 కోట్లు ఎలా కట్టాలంటూ అధికారులు తలలు పట్టుకున్నారు. వచ్చే విద్యా సంవత్సరానికి పంపిణీ చేయాల్సిన విద్యాకానుక వస్తువులకు కొనుగోలుకు టెండర్ల ఎత్తివేసిన విషయం తెలిసిందే. ఎన్నికల ముందు తమకు కావాల్సినవారికి కాంట్రాక్టు కట్టబెట్టాలనుకోవడం ఒక కారణమైతే, గతేడాది విద్యాకానుక బకాయిలు పెండింగ్ పెట్టడం మరో కారణంగా కనిపిస్తోంది. 2022-23 విద్యా సంవత్సరానికి ప్రభుత్వం రూ.1,042 కోట్లతో 39.95 లక్షల విద్యాకానుక కిట్లు కొనుగోలు చేసింది. 19మంది కాంట్రాక్టర్లు వాటిని సరఫరా చేశారు. పాఠ్యపుస్తకాలకు ప్రత్యేకంగా టెండర్లు పిలిచారు. పాఠ్యపుస్తకాలు, యూనిఫాం కుట్టుకూలీ పోగా రూ.720 కోట్లతో బూట్లు, బ్యాగులు, బెల్టులు, యూనిఫాం, సాక్సులు కొనుగోలు చేసింది. అందులో ఇప్పటివరకూ రూ.120 కోట్లు మాత్రమే కాంట్రాక్టర్లకు చెల్లించింది. ఆ బకాయిలు ఇవ్వకపోతే వచ్చే ఏడాదికి వస్తువులు సరఫరా చేయలేమని వారు చేతులెత్తేశారు. దీంతో టెండర్లకు మంగళం పాడేసి, ఎవరొచ్చినా నామినేషన్‌పైనే కాంట్రాక్టు అప్పగిస్తామనే స్థాయికి పాఠశాల విద్యాశాఖ దిగొచ్చింది.

పాఠ్యపుస్తకాలకూ ఇదే తీరు

విద్యాకానుకలో ఇచ్చే పాఠ్యపుస్తకాల వరకూ ప్రత్యేకంగా టెండర్లు పిలుస్తారు. ఇందుకోసం రూ.253 కోట్లు ఖర్చు అవుతోంది. ఈ విద్యా సంవత్సరంలో ఇచ్చిన పుస్తకాలకు గతేడాది తమిళనాడు ప్రభుత్వ రంగ సంస్థ అయిన తమిళనాడు న్యూస్‌ప్రింట్ అండ్ పేపర్ లిమిటెడ్ (టీఎన్‌పీఎల్) కాగితం సరఫరా చేసింది. గత పదేళ్లుగా ఆ సంస్థే కాగితం ఇస్తోంది. గతేడాది ఇచ్చిన కాగితానికి రూ.200 కోట్లు చెల్లించాల్సి ఉండగా, జగన్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. పైగా ఈ ఏడాది పుస్తకాలు ప్రింటింగ్ చేసే ప్రింటర్లే కాగితం తెచ్చుకోవాలని ప్రభుత్వం కొత్త నిబంధన పెట్టింది. దీనిపై ఏపీ జ్యుడీషియల్ కమిషన్‌కు టీఎన్‌పీఎల్ లేఖ రాసింది. బకాయిలు చెల్లించకపోగా, దీర్ఘకాలం నుంచి ఉన్న కాంట్రాక్టు వదులుకోవడం ఏమిటని నిలదీసింది. దీంతో ఏంచేయాలో పాలుపోని జగన్ ప్రభుత్వం... చెన్నైకి పంపే తెలుగు గంగ నీళ్లకు తమిళనాడు ప్రభుత్వం బకాయి ఉందని, ఆ నిధులతో సర్దుబాటు చేసుకోవాలని చెప్పి తప్పించుకుంది.

సమగ్రశిక్షలో జీతాలకు కష్టం

కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సమగ్రశిక్షలో జీతాలకూ డబ్బుల్లేక పాఠశాల విద్యాశాఖ నానాపాట్లు ప డుతోంది. ఈ విద్యా సంవత్సరంలో సమగ్రశిక్ష ఉద్యోగులకు ప్రతినెలా జీతాలు అనే విధానం నుంచి మూడు నెలలకోసారి అనే పద్ధతికి తీసుకెళ్లింది. 3 నెలలకోసారి జీతాలిస్తే ఎలా బతకాలంటూ ఉద్యోగులు రోడ్డెక్కే వర కూ ప్రభుత్వం స్పందించలేదు. వారు పలు డిమాండ్ల తో సమ్మెలోకి వెళ్లాక అప్పుడు జీతాలు చెల్లించింది. ఇప్పటికీ సమగ్రశిక్షలో అధికారులకు తరచూ జీతాలు ఆపేస్తున్నారు. కేంద్రం నుంచి ఏటా రూ.3వేల కోట్ల వ రకూ నిధులొస్తున్నా, వాటిని ఇతర అవసరాలకు వాడేసి, ఉద్యోగుల జీతాలు పెండింగ్‌లో పెడుతున్నారు.

ఉగ్రవాద సంస్థ కార్యదర్శి అబ్దుల్ సలీం అరెస్ట్

▸▸ ప్రార్థనల మాటున మసీదులో మకాం!


అబ్దుల్ సలీం

మైదుకూరు, మార్చి 3: పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (భారత ప్రభుత్వ నిషేధిత సంస్థ)ఉత్తర తెలంగాణ కార్యదర్శి అబ్దుల్ సలీమ్ కడప జిల్లా మైదుకూరు మండలం మారుమూల గ్రామమైన చెర్లోపల్లెలోని ఓ మసీదులో ఉంటున్నట్లు గుర్తించిన ఎన్ఐఏ పోలీసులు శనివారం అరెస్టు చేయడంతో చెర్లోపల్లెతో పాటు మైదుకూరు పట్టణమంతా ఉలిక్కిపడింది. తెలంగాణాలోని నిజామాబాద్ పీఎఫ్ఐ కేసులో ఉన్న వ్యక్తుల్లో అబ్దుల్ సలీం ఒకరు. ఒక అజ్ఞాత వ్యక్తి ద్వారా చెర్లోపల్లెకు చెందిన వ్యక్తికి అబ్దుల్ సలీం పరిచయమై ఆ వ్యక్తి ద్వారా మసీదులో నిత్యం ప్రార్థనలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుని ఇక్కడికి వచ్చినట్లు తెలుస్తోంది. అతడు 25 రోజుల నుంచి మసీదులో ఉంటున్నాడని, పేరు తెలియదని, పగలు బయట తిరగడం కన్పించలేదని, రాత్రి పూట మాత్రం నాలుగైదుసార్లు తిరిగాడని స్థానికులు చెబుతున్నారు. అబ్దుల్ సలీంను మసీదులో ప్రార్థనల కోసం ఉంచిన గ్రామానికి చెందిన వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

కంటైనర్‌తో పోలీసుల పైకి..

▸▸ గంజాయి ముఠా బరితెగింపు

▸▸ పలాసలో ఎస్ఐ సహా ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలు

పలాస(ఆనందపురం)విశాఖపట్నం, మార్చి 3: శ్రీకాకుళం జిల్లా పలాసలో గంజాయి స్మగ్లర్లు బరితెగించారు. కంటైనర్ లారీలో గంజాయిని చెన్నైకి తరలిస్తుండగా అడ్డుకున్న పోలీసులను ఢీకొట్టేలా వాహనాన్ని పోనిచ్చారు. దీంతో ఎస్ఐతో సహా ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. ఒడిశా రాష్ట్రం గారబంద వద్ద గంజాయిని కంటైనర్‌లో నింపి పలాస మీదుగా చెన్నై తరలిస్తున్నారని ఎస్ఈబీ పోలీసులకు సమాచారం అందింది. శనివారం అర్ధరాత్రి ఎస్ఈబీ ఎస్ఐ గోరు ప్రభాకర్, కానిస్టేబుల్స్ బొడ్డేపల్లి సురేష్, బలగాన సంతోశ్‌కుమార్ బృందం శ్రీకాకుళం జిల్లా పలాస జాతీయరహదారి నెమలినారాయణపురం వద్ద మాటు కాసింది. ఆదివారం వేకువజామున 3 గంటల ప్రాంతంలో ఆ కంటైనర్ లారీ రానే వచ్చింది. దాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయగా పోలీసులపైకి దూసుకెళ్లడంతో ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుల్స్ గాయాలకు గురై ప్రాణాపాయం నుంచి బయట పడ్డారు. కంటైనర్ ఆగకుండా దూసుకుపోయింది. సమాచారం అందుకున్న విశాఖ జిల్లా ఆనందపురం పోలీసులు ఆ కంటైనర్‌ను గుర్తించారు. ఆపకుండా ముందుకు పోవడంతో.. 7కిలోమీటర్లు వెంబడించి.. పరదేశిపాలెం వద్ద పట్టుకున్నారు. అందులో జేసీబీ స్పేర్ పార్ట్స్ ఉన్నాయంటూ, పత్రాలు తీసుకువస్తమని డ్రైవర్, క్లీనర్లు పరారయ్యారు. కంటైనర్‌ను స్టేషన్‌కు తరలించి తనిఖీ చేయగా 80 ప్యాకెట్ల (380కిలోలు) గంజాయి లభించింది. దీనివిలువ రూ.8లక్షలు ఉంటుందని సీఐ చెప్పారు. కాగా, గాయపడిన పలాస పోలీసులను శ్రీకాకుళంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్చారు.

సినీనటి సౌమ్యశెట్టి దొంగావతారం!



▸▸ స్నేహితురాలి ఇంట్లో విడతలవారీగా బంగారం చోరీ

▸▸ ఆ నగలు విక్రయించి గోవాలో ఎంజాయ్

▸▸ దొంగతనం కేసులో అరెస్టు.. 57 తులాలు రికవరీ

విశాఖపట్నం, మార్చి 3(ఆంధ్రజ్యోతి): స్నేహం పేరిట దగ్గరైంది. తరచూ ఇంటికి కూడా వచ్చి వెళ్లేది. ఈ క్రమంలోనే స్నేహితురాలి ఇంట్లో బంగారంపై కన్నేసిన ఆ సినీనటి.. బెడ్‌రూమ్‌లోని కప్‌బోర్డులో భద్రపరిచిన బంగారాన్ని విడదతవారీగా మాయం చేసింది. కొద్దిరోజుల తర్వాత చోరీ విషయం గుర్తించిన స్నేహితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సినీనటి సౌమ్యశెట్టి బండారం బయటపడింది. ఈ కేసులో 57 తులాల బంగారాన్ని రికవరీ చేసిన పోలీసులు ఆమెను అరెస్టు చేసి ఈ నెల 1న రిమాండ్‌కు తరలించారు. విశాఖపట్నంలోని దొండపర్తి ప్రాంతంలోని బాలాజీ రెసిడెన్సీలో ఉంటున్న జనపాల ప్రసాద్ ఉద్యోగ విరమణ చేశారు. ఆయన కుమార్తె మౌనిక 2016లో బీటెక్ చదువుతుండగా యూట్యూబ్ రీల్స్, షార్ట్‌ఫిల్మ్స్‌లో నటించే గోపాలపట్నం సమీపంలోని వెంకటాపురానికి చెందిన సౌమ్యతో పరిచయమైంది. మౌనికకు మోడలింగ్‌పై ఆసక్తి ఉండడంతో ఇద్దరూ కలిసి షార్ట్‌ఫిల్మ్‌లో కూడా నటించారు. తర్వాత మౌనికకు వివాహం చేయడంతో ఇద్దరి మధ్య స్నేహం తెగిపోయింది. సౌమ్య కూడా సుజాతానగర్‌లో ఉంటున్న ఒడిశాకు చెందిన బలరాం శెట్టిని ప్రేమ వివాహం చేసుకుంది.

ఇన్‌స్టాగ్రామ్‌లో మళ్లీ స్నేహం: ఇటీవల మౌనికకు పాప పుట్టడంతో ఇన్‌స్టాగ్రామ్‌లో ఫొటోని పోస్ట్ చేసింది. ఈ ఏడాది జనవరిలో సౌమ్యశెట్టి ఆ పోస్ట్‌ని చూసి కామెంట్ పెట్టింది. దీంతో ఇద్దరి మధ్య మళ్లీ స్నేహం చిగురించింది. దొండపర్తిలోని పుట్టింట్లో ఉంటున్నానని మౌనిక చెప్పింది. సౌమ్యశెట్టి కూడా తాను ఇటీవలే 'ద ట్రిప్' 'యు వర్స్ లవింగ్లీ' సినిమాల్లో నటించానని, మరికొన్ని షార్ట్‌ఫిల్మ్‌లో నటిస్తున్నానని చెప్పింది. ఈ క్రమంలో సౌమ్య పలుమార్లు మౌనిక పుట్టింటికి వెళ్లి వచ్చారు. ఈనెల 23న ఎలమంచిలిలోని బంధువుల ఇంట శుభకార్యక్రమం ఉండడంతో మౌనికతో పాటు ఆమె తల్లిదండ్రులు బంగారు ఆభరణాల కోసం బెడ్‌రూమ్‌లోని కప్‌బోర్డు తెరిచారు. ఆభరణాలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదుచేశారు. పోలీసులు కేసు నమోదు చేసి వివరాలు సేకరించారు. తరచూ ఇంటికి వచ్చి వెళ్లినవారిలో సౌమ్యశెట్టి ఉన్నట్టు చెప్పడంతోపాటు ఆమె పలుమార్లు వాష్‌రూమ్‌కి వెళతానంటూ మాస్టర్ బెడ్‌రూమ్‌లోకి వెళ్లి డోర్ వేసుకునేదని చెప్పారు. దీంతో పోలీసులకు ఆమెపై అనుమానం ఏర్పడింది. ముందుగా ఆమె బ్యాంకు ఖాతాల వివరాలను సేకరించి, లావాదేవీలను పరిశీలించారు. ఫిబ్రవరి 6న విశాఖలోని లలితా జ్యువెలరీలో రూ.పది లక్షల విలువైన పాతబంగారం విక్రయించి, కొత్త నగలు తీసుకున్నట్టు గుర్తించారు. అలాగే కురుపాం మార్కెట్‌లోని 2 బంగారం దుకాణాల వద్ద పాత బంగారం విక్రయించి, ఆ డబ్బుని ఏటీఎం ద్వారా తన ఖాతాలోకి డిపాజిట్ చేసుకున్నట్టు గుర్తించారు. దీంతో సౌమ్యశెట్టిని అదుపులోకి తీసుకుని విచారించగా మొదట తనకేమీ తెలియదని చెప్పింది. పోలీసులు ఆమె లావాదేవీలను బయటపెట్టడంతో నేరాన్ని అంగీకరించింది. బంగారం విక్రయించిన డబ్బులో రూ.4 లక్షలు ఖర్చుపెట్టి గోవాలో ఎంజాయ్ చేశానని, మరో రూ.2 లక్షలు క్రెడిట్‌కార్డు అప్పులు కట్టానని, రూ.1.5 లక్షలుతో కార్‌కు మరమ్మతులు చేయించానని తెలిపింది.

'సరస్వతి' పేరిట దోపిడీ

▸▸ టర్నోవరే లేని సంస్థలో జగన్ దంపతుల వాటా: ఆనం



నెల్లూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): సరస్వతి పవర్ కంపెనీ రెవెన్యూ సున్నా అని.. టర్నోవర్ లేని కంపెనీలో రూ.80 లక్షల పెట్టుబడి ఆరవై రోజుల్లో రూ.18.87 కోట్లకు ఎలా పెరుగుతుందని టీడీపీ ప్రశ్నించింది, నల్లధనాన్ని వైట్ చేసుకునేందుకు ఇలాంటి కంపెనీలు పెట్టి సీఎం జగన్ ఆర్థిక నేరాలకు పాల్పడ్డారని.. ఆయన కడిగిన ముత్యం కాదని.. బురదలో తిరిగే పంది అని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి దుయ్యబట్టారు. ఆయన ఆదివారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. '1999లో సరస్వతి పవర్‌ను రూ.కోటి ఆథరైజ్డ్ కేపిటల్‌తో ప్రారంభించగా.. 2009 వచ్చే సరికి ఆ కంపెనీ షేర్ కేపిటల్ రూ.35 కోట్లకు చేరుకుంది. ఆ కంపెనీలో 2009 జూన్‌లో జగన్ రూ.87.08 లక్షలు, భారతీరెడ్డి రూ.80 లక్షలు పెట్టుబడి పెట్టారు. అప్పటికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రెండోసారి సీఎం అయ్యారు. 2009 సెప్టెంబరు నాటికి వీరి పెట్టుబడి రూ.18.87 కోట్లకు పెరిగింది. ఏమిటీ మ్యాజిక్? సరస్వతి పవర్‌కు ఆఫీసు భవనం కాదు కదా.. గుడిసె కూడా లేదు. షేర్ విలువ మాత్రం రాకెట్‌లా దూసుకుపోయింది. పవర్ కంపెనీకి లైమ్‌స్టోన్‌తో ఏం పని..? 2008 జూన్ 12న వైఎస్ భారతి డైరెక్టర్‌గా లైమ్‌స్టోన్‌కు అనుమతులు కోరారు. అప్పటికి సిమెంట్ ఫ్యాక్టరీ పెట్టే పర్మిషన్ కూడా ఆ కంపెనీకి లేదు. కానీ 2008 జూలై 15న సిమెంటు కంపెనీ కూడా పెట్టవచ్చని మెమోరాండమ్ ఆఫ్ ఆర్టికల్స్‌లో అనుమతి వచ్చింది. వైఎస్ మళ్లీ సీఎం అవుతున్నారని డిక్లేర్ అయ్యాక ఆ తర్వాత రెండు రోజులకే సరస్వతి పవర్‌కు 1515.80 ఎకరాల్లో లైమ్‌స్టోన్‌ను లీజుకు ఇస్తూ జీవో 107 జారీఅయింది. దాచేపల్లి, మాచవరం మండలాల్లో 1515.80 ఎకరాలను సరస్వతి పవర్ కంపెనీకు లీజుకు ఇచ్చారు. టన్నుకు రాయల్టీ రూ.5, ప్రభుత్వ సెస్ రూ.3, హెక్టారుకు లీజు ఏడాదికి రూ.200గా నిర్ణయించారు. ఏమిటీ దోపిడీ..? ఆ మాత్రం దానికి ఉచితంగా ఇచ్చుకోవచ్చుగా..? లీజు ఇచ్చే సమయంలో గ్రామసభలు పెట్టి స్థానికులకు ఒక్కో కుటుంబానికి ఒక్కో ఉద్యోగం అని నమ్మించారు. ఇప్పటికీ ఫ్యాకరీకట్టకుండా, ఉద్యోగం ఇవ్వకుండా రైతులను అన్యాయం చేసింది జగన్, వైఎస్ భారతి కాదా? ఫ్యాక్టరీ ఏర్పాటుకాక, ఉద్యోగం లేక ఇళ్లు గడవడం కష్టంగా ఉందని, తమ భూములు సాగు చేసుకుంటామని రైతులు వేడుకుంటే వారిపై 2014లో దాడులు చేశారు. పెట్రోల్ బాంబులతో భయభ్రాంతులు చేశారు. ఆ భూములను వెనక్కు తీసుకోరా..? మిగతా వాళ్లకు ఒక న్యాయం సీఎం దంపతులకు మరో న్యాయమా..? పరస్వతి పవర్ కంపెనీ పెట్టబోయే ఫ్యాక్టరీకు జీవితకాలం కృష్ణ జలాలను ఇచ్చేలా 2020 మే 15న ఇరిగేషన్ శాఖ జీవో జారీ చేసింది. కృష్ణా నదినే తీసేసుకోవచ్చుగా..? గుడిసె కూడా లేని కంపెనీకు జీవితాంతం నీళ్లు ఇవ్వాలంటూ జీవో ఇవ్వడం క్విడ్ ప్రోకో కాదా..' అని ఆనం నిలదీశారు. టీడీపీ ప్రభుత్వం రాగానే ఈ భూములను వెనక్కి తీసుకుంటామని, నీళ్లు కేటాయించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దోపిడీధీర!



(మొదటి పేజీ తరువాయి)

ఉండిపోయింది. అయితే అక్రమార్జనలో మాత్రం ఎమ్మెల్యే బాగా అభివృద్ధి చెందారు. ఏ చిన్న ఆదాయ వనరును వదలకుండా ముడుపులు దండుకుంటున్నారు. ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేయడం, అడ్డగోలుగా ఇసుక తవ్వుకోవడం.. ముంపుపరిహారంలో అనర్హుల పేర్లు చేర్పించి సొమ్ములు నొక్కేయడం.. చివరికి చికెన్ సెంటరు నిర్వాహకుల నుంచి కూడా చిల్లర వసూళ్లకు పాల్పడుతున్నారు.

పరిశ్రమల నుంచి కోట్లు

ఈ నియోజకవర్గం ఖనిజాల ఖిల్లా. ఓవైపు నాపరాయి, మరోవైపు ఇసుకతో పాటు సిమెంటు పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు ఉన్నాయి. సదరు నాయకుడు గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత ఇక్కడంతా కలెక్షన్లే. అన్నింట్లో వాటాలు తీసుకుంటారనే ప్రచారం ఉంది. తన అక్రమ సంపాదనకు సిమెంట్ పరిశ్రమలను ఆదాయ వనరుగా మార్చుకున్నారు. 'గత ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టినా.. మీ వ్యాపారం సజావుగా జరగాలంటే కప్పం కట్టాల్సిందే' అంటూ కొన్ని సిమెంటు ఫ్యాక్టరీల యజమానులను ఎమ్మెల్యే బెదిరించి కోట్లు కొల్లగొట్టారని చెబుతారు. ఇక నియోజకవర్గంలో సోలార్ కంపెనీ ప్లాంట్లు ఏర్పాటు చేశారు. వారినుంచి కూడా ఆమ్యామ్యాలు వసూలు చేసి బ్యాంక్ ఖాతాలోకి పంపించినట్లు ప్రచారం జరిగింది. సోలార్ కంపెనీ ప్రతినిధులు ఇతర వైసీపీ నేతల వద్ద ఈవ్యవహారాన్ని ప్రస్తావించినట్లు చెబుతారు. ఓ మైనింగ్ నిర్వాహకుడి నుంచి సదరు నేత రూ.5 కోట్లు డిమాండ్ చేశారనే ప్రచారం ఉంది. నియోజకవర్గంలో విద్యుత్ సబ్‌స్టేషన్లలో లైన్ ఆపరేటర్ల పోస్టులు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగుల నుంచి ఒక్కొక్కరి వద్ద రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలు వసూలు చేసినట్లు ప్రచారం ఉంది. ఇక సోలార్ కంపెనీలో పనిచేసే కూలీలకు రూ.400 ఇస్తారు. అయితే అక్కడ కూడా ఒక్కొక్కరి నుంచి రూ.వంద కమిషన్ కాజేసినట్లు చెబుతారు. టీడీపీ హయాంలో కాంట్రాక్టు పనులు చేసిన వారికి బిల్లులు మంజూరు చేయిస్తామంటూ డబ్బు వసూలు చేశారనే ప్రచారం ఉంది. అన్నింటిలో ఎమ్మెల్యేకు వాటాలు ఉన్నట్టు తెలుస్తోంది.

చికెన్‌లోనూ చేతివాటం

ఎమ్మెల్యే చివరకు చికెన్ కొట్టు నిర్వాహకులను కూడా వదలకుండా ముడుపులు తీసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. అందుకు ప్రతిఫలంగా చికెన్ కొట్టు నిర్వాహకులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచి అమ్ముకునే వెసులుబాటు కల్పించారు. నియోజకవర్గం చుట్టూ ఉన్న ప్రాంతాల్లో కేజీ చికెన్ రూ.120, 110 మధ్య ఉంటే.. అక్కడ మాత్రం రూ.40, 50 అధికంగా ఉండేది. యువగళం పాదయాత్రలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఈ విషయాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. లోకేశ్ మాటలు ఆ నియోజకవర్గంలోని జనానికి బాగా కనెక్ట్ అయ్యాయి. దీంతో జనాల్లో మరింత పలుచనవుతానని భావించి అప్పటి నుంచి చికెన్ కొట్టు నిర్వాహకుల నుంచి సదరు నాయకుడు ముడుపులు తీసుకోలేదని చెబుతున్నారు. దీంతో చికెన్ రేట్లు బయటి ప్రాంతాల్లో ఉన్నట్టు ఇక్కడా అందుబాటులో ఉన్నాయి.

ఎమ్మెల్యే స్వగ్రహం ఉన్న మండలంలో నాపరాయి పరిశ్రమలు భారీగా ఉన్నాయి. 30 గనులు, 200 పరిశ్రమలు ఉన్నాయి. ఏటా ఇక్కడ రూ.50 కోట్ల నుంచి రూ.100 కోట్ల మధ్య వ్యాపారం జరుగుతుందని అంచనా. ఎమ్మెల్యే అక్కడి గనుల యజమానులను పూర్తిగా తన కంట్రోల్‌లో పెట్టుకున్నారు. ప్రత్యర్థి పార్టీల నేతలతో సంబంధాలు పెట్టుకున్న, వారిని ఆహ్వానించిన వ్యాపారులపై ఉక్కుపాదం మోపారని చెబుతారు. ఎమ్మెల్యే దెబ్బకు భయపడి వ్యాపారులంతా టీడీపీకి దూరంగా ఉంటున్నారు.

ఇసుక తవ్వకాలను అడ్డుకున్నారని...

ఎమ్మెల్యే అనుచరుడు ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వేసి బాగా సంపాదిస్తున్నారు. ఇసుక అమ్మకాల్లో ఎమ్మెల్యేకు వాటాలు వెళుతున్నట్లు సమాచారం. ఇసుక అక్రమ తవ్వకాలను అడ్డుకున్నందుకు టీడీపీ నేతలపై ఎదురు కేసులు పెట్టించారు. ఇసుక తవ్వకాలపై స్థానిక టీడీపీ ఇన్‌చార్జి పెన్నానదిలో నిరసన తెలుపుతూ అక్కడ ఉన్న టిప్పర్‌ను నిలిపివేశారు. వాహనం తాళాలు తీసుకుని పోలీసులకు అప్పజెప్పారు. నిరసన అనంతరం వెనక్కి వస్తున్న టీడీపీ నాయకుడి అనుచరులపై ఎమ్మెల్యే బామ్మర్ది తన అనుచరులతో వెళ్లి గొడవకు ప్రయత్నించారు. 'ఈ టిప్పరు నాది, ఏం చేస్తావు' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారని చెబుతారు. ఈ వ్యవహారంలో టిప్పర్ డ్రైవర్‌పై టీడీపీ నేతలు దాడి చేయకున్నా దాడి చేసినట్లు కేసు పెట్టడం గమనార్హం.

ఫిర్యాదు చేశారని హత్య

గండికోట ముంపు పరిహారం విషయంలో ఫిర్యాదు చేశారని సొంత పార్టీకే చెందిన మరో కీలక నాయకుడి వర్గీయుడిని ఎమ్మెల్యే అనుచరులు హత్య చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి. నియోజకవర్గంలో గండికోట ముంపు బాధితులు ఉన్నారు. ఓ గ్రామంలో లేనివారి పేర్లను కూడా నిర్వాసితుల జాబితాలో చేర్చి పరిహారం బొక్కేస్తున్నారని వైసీపీకే చెందిన కీలక నాయకుడి వర్గీయుడు, ఆర్మీ మాజీ ఉద్యోగి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేసేందుకు అధికారులు వచ్చారు. అధికారుల సమక్షంలోనే ఎమ్మెల్యే వర్గీయులు ఆయన్ను దారుణంగా హత్య చేసినట్లు చెబుతారు.


దిక్సూచి DIKSUCHI

మిస్సింగ్ నంబర్ టెస్ట్

రీజనింగ్

పార్ట్-3

1. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 162 బి) 136 సి) 145 డి) 174

సమాధానం: (ఎ)

వివరణ : ప్రతి డయాగ్రమ్ పై అంకెల లబ్దం, కింది అంకెల లబ్దాలను కూడితే వృత్తం మధ్యలోని సంఖ్య వస్తుంది.

8x4x2=64 7x1x6=42 9x4x2=72


3x6x5=90 8x2x5=80 6x5x3=90



64+90=154 42+80=122 72+90=162

కాబట్టి సమాధానం అవుతుంది.

2. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 229 బి) 349 సి) 254 డి) 529


సమాధానం: (ఎ)

వివరణ : పైన వృత్తంలో అంకెలను ఒక సమూహంగా, వృత్తానికి కింద గల అంకెను ఒక సమూహంగా రాసుకొని తీసివేసిన వృత్తంలో సంఖ్య వస్తుంది.

426-351=75, 756-543=213

కాబట్టి 574-345=229

3. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 32 బి) 48 సి) 56 డి) 71

సమాధానం: (సి)


వివరణ : చతురస్రానికి నాలుగు వైపుల గల అంకెల లబ్దాన్ని 10తో భాగిస్తే చతురస్రంలోని సంఖ్య వస్తుంది.

$$5\times4\times2\times3=\frac{120}{10}=12$$

$$8\times3\times5\times6=\frac{720}{10}=72$$

కావున $7\times4\times10\times2=\frac{560}{10}=56$ సమాధానము అవుతుంది.

4. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 51 బి) 84 సి) 60 డి) 96

సమాధానం: (ఎ)

వివరణ : వృత్తానికి నాలుగు వైపుల గల విడివిడి అంకెల వర్గాలను కూడితే వృత్తంలోని సంఖ్య వస్తుంది.

62+32+102+92=226

82+62+72+22=153

52+12+42+32=51

5. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?

L_{12}	N_{34}	M_{16}
M_{24}	L_{30}	N_{33}
N_6	M_8	?

ఎ) L7 బి) N6 సి) M4 డి) L6

సమాధానం : (ఎ)

వివరణ : ప్రతి వరుసలో నిలువుగా అడ్డంగా ఔ, ఖా ప్రతి వరుసలోను వస్తున్నాయి. కాబట్టి 3వ వరుస చివర ఔ రావాలి. ప్రతి వరుసలో నిలువుగా గల మొదటి రెండు సంఖ్యల మొత్తం.

12+14=36 **36 అనేది 62**


34+30=64 **64 అనేది 82**

అదే విధంగా

16+33=49 49 అనేది 72

కావున సమాధానం ఔ7

6. ప్రశ్నార్థకం గుర్తుగల స్థానంలో వచ్చే సంఖ్యను తెలపండి?



ఎ) 55 బి) 46 సి) 62 డి) 58

సమాధానం: (ఎ)

వివరణ : మొదటి డయాగ్రామ్‌లో

52 + 72 = 25 + 49 = 74 - 32 = 42

రెండో డయాగ్రామ్‌లో

62 + 42 = 36 + 16 = 52 - 25 = 27

కాబట్టి మూడో డయాగ్రామ్‌లో


92 + 32 = 81 + 9 = 90 - 35 = 55 సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్
సీనియర్ ఫ్యాకల్టీ

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

గగన్‌యాన్



అంతరిక్షంలోకి వ్యోమగాములను పంపి, వారిని క్షేమంగా తిరిగి భూమికి తీసుకువచ్చేందుకు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) తొలిసారి చేపట్టబోతున్న ప్రయోగమే 'గగన్‌యాన్'

భారత అంతరిక్షరంగ పరిశోధనలను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు, భవిష్యత్తులో 2035 నాటికి అంతరిక్షంలో సొంత స్పేస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసుకొనేందుకు, 2040 నాటికి మానవ సహిత చంద్రమండల యాత్రకు సంసిద్ధమయ్యేందుకు గగన్‌యాన్‌ను ఒక నాంది ప్రస్థానంగా చెప్పుకోవచ్చు. 2006లో పునాది పడిన ఈ ప్రాజెక్ట్ అంచనా వ్యయం రమారమి పదివేల కోట్లు.

వివిధ దశల్లో భద్రత పరీక్షలు

2025లో చేపట్టనున్న ఈ ప్రయోగానికి ముందు భద్రతపరంగా మరో రెండు డమ్మీ ప్రయోగాలను ఇస్రో చేపట్టనుంది. 2024 జూలైలో జీ1(గగన్‌యాన్-1) ద్వారా 'వ్యోమమిత్ర' అనే రోబోను కలిగి ఉన్న తొలి గగన్‌యాన్ క్యాప్సూల్ ఆర్బిటాల్ టెస్ట్ ఫ్లయిట్‌ను, 2024 డిసెంబర్‌లో జీ2(గగన్‌యాన్-2) అనే రెండో గగన్‌యాన్ క్యాప్సూల్ ఆర్బిటాల్ టెస్ట్ ఫ్లయిట్‌ను పంపనున్నారు. 2025లో జీ3 అనే మూడో దానితో ఈ డమ్మీ ప్రయోగాలు ముగుస్తాయి. ఇవేకాక మరో 20 రకాలైన భద్రతా ప్రయోగాలూ ఇస్రో చేపట్టనుంది. చివరిగా వ్యోమగాములతో కూడిన గగన్‌యాన్ ప్రయోగాన్ని 2025 చివరినాటికి చేపట్టనున్నారు.

గత అక్టోబరులో టెస్ట్ వెహికల్ డెమాన్‌స్ట్రేషన్-1(టీవీ-డీ1) (లేదా) టెస్ట్ వెహికల్ అబార్ట్ మిషన్-1 అని పిలిచే ప్రయోగాన్ని చేపట్టి 'క్రూ ఎస్కేప్ సిస్టమ్' పనితీరును ఇస్రో విజయవంతంగా పరీక్షించింది. ఏదైనా అనుకోని ప్రమాదం సంభవిస్తే వ్యోమగాములు ఉండే క్రూ మాడ్యూల్‌ను రాకెట్ నుంచి వేరుచేసి, సురక్షితంగా భూమిపైకి తీసుకువచ్చే ప్రక్రియే 'క్రూ ఎస్కేప్ సిస్టమ్'. దీనికి అత్యంత వేగంగా ప్రతిస్పందించే 'క్విక్ రియాక్టింగ్ పాలిడ్ మోర్టార్'లను ఇస్రో అభివృద్ధి చేసింది. ఇవి చాలా వేగంగా ప్రజ్వరిల్లి అధిక థ్రస్ట్‌ను ఉత్పత్తి చేస్తాయి. తద్వారా ప్రమాద సమయాల్లో క్రూ మాడ్యూల్ తక్షణం రాకెట్ నుంచి వేగంగా విడివడి భూమి వైపు ప్రయాణించడానికి వీలవుతుంది. ఈ క్రమంలో వివిధ దశల్లో శక్తివంతమైన పారాచూట్‌లు విచ్చుకొని క్రూ మాడ్యూల్‌ను సురక్షితంగా బంగాళాఖాతంలో జారవిడుస్తాయి.

అనంతరం ఇండియన్ నేవి ఈ క్రూమాడ్యూల్‌ను వెలికితీస్తుంది. ఈ టీవీ-డీ1 ప్రయోగం ద్వారా వ్యోమగాములు లేని డమ్మీ క్రూ మాడ్యూల్‌ను వినియోగించి ఈ ప్రక్రియను విజయవంతంగా పరీక్షిస్తారు.

ఆదేవిధంగా వ్యోమగాముల భద్రతను దృష్టిలో ఉంచుకొని గగన్‌యాన్-1 డమ్మీ ప్రయోగంలో భాగంగా తొలుత వ్యోమగాముల స్థానంలో 'వ్యోమమిత్ర' అనే హ్యూమనాయిడ్ రోబోను క్రూ మాడ్యూల్‌లో ఉంచి అంతరిక్షంలోకి పంపనున్నారు. తద్వారా ఈ రోబో, మైక్రో గ్రావిటీ ఎక్స్‌పెరిమెంట్స్, మాడ్యూల్ పారామీటర్స్‌ను పరీక్షించి వ్యోమగాములు ఏదైనా అసౌకర్యానికి, ప్రమాదానికి గురయ్యే అవకాశాలు ఉంటే గుర్తిస్తుంది.

గగన్‌యాన్-ప్రయోజనాలు

- గగన్‌యాన్ విజయవంతమైతే వ్యోమగాములను అంతరిక్షంలోకి పంపే సామర్థ్యం సాధించిన అమెరికా, రష్యా చైనా సరసన భారత్ కూడా సగర్వంగా చేరుతుంది.
- గగన్‌యాన్ ప్రయోగ విజయం తదుపరి భారతదేశ మానవసహిత అంతరిక్ష ప్రయోగాలపరంగా, ఖగోళ అన్వేషణపరంగా చేపట్టబోయే అనేక ప్రాజెక్టుకు ఊతమవుతుంది.
- అంతర్జాతీయంగా భారతదేశ సాఫ్ట్‌పవర్ ఇనుమడించి, అంతర్జాతీయ దౌత్య వ్యూహాత్మక సంబంధాలను బలపరుస్తుంది.
- శాస్త్ర, సాంకేతిక రంగాలపైకి విద్యార్థుల ఆసక్తిని మళ్లించడానికి ఉపకరిస్తుంది. తద్వారా భావితరాల వైజ్ఞానిక నైపుణ్యాలు మరింత మెరుగవుతాయి. నవకల్పనలకు దారితీస్తుంది.
- అనేక రంగాల సమన్వయంతో, సహకారంతో జరుగుతున్న ఈ ప్రయోగం వల్ల భారీ స్థాయిలో ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.
- దేశీయంగా రూపొందించిన వాహకనౌక, సాంకేతికతలు గల ఈ ప్రయోగం దేశ ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా సామర్థ్యాలను చాటిచెబుతుంది.

వివిధ సంస్థల సహకారం

ఈ ప్రయోగంలో భాగంగా అంతరిక్షంలోకి పంపేందుకు నలుగురు వ్యోమగాముల ను ఎంపిక చేశారు. వీరు గ్రూప్ కెప్టెన్ ప్రశాంత్ బాలకృష్ణన్ నాయర్, గ్రూప్ కెప్టెన్ అజిత్ కృష్ణన్, గ్రూప్ కెప్టెన్ అంగద్ ప్రతాప్, వింగ్ కమాండర్ శుభాన్షు శుక్లా ఉన్నారు. భారతదేశంలో వ్యోమగాముల శిక్షణ సౌకర్యాలకు సంబంధించిన సాంకేతిక వ్యవస్థల కొరత కారణంగా ఇస్రో, రష్యా స్పేస్ ఏజెన్సీ 'రాస్ కోస్ మాస్' అనుబంధ సంస్థ 'గ్లావ్ కోస్ మాస్'తో ఒప్పందం చేసుకొని ఫిబ్రవరి 2020 - మార్చి 2021 మధ్యకాలంలో ఈ నలుగురు వ్యోమగాములకు అంతరిక్ష పరిస్థితుల్లో మనుగడ సాగించేందుకు అవసరమైన తర్ఫీదును ఇప్పించారు.

అంతేకాక ఈ గగన్‌యాన్ మిషన్‌లో అనేక భారతీయ సంస్థలు కూడా సాంకేతిక, పరిశోధన, అభివృద్ధిపరంగా విస్తృత సేవలు అందిస్తున్నాయి. అవి- ఇండియన్ ఎయిర్‌ఫోర్స్, ఇండియన్ నేవి, భారత వాతావరణ సంస్థ, ఇండియన్ కోస్ట్‌గార్డ్, షిప్పింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫి, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ, డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్, సిఎస్ఐఆర్ ల్యాబ్, అనేక విద్య, పారిశ్రామిక సంస్థలు.

ప్రయోగం-దశలు

'జీఎస్ఎల్‌వీ ఎంకె-3(ఎల్‌వీఎం-3)' లాంచ్ వెహికల్ ద్వారా ఆర్బిట్ మాడ్యూల్‌ను శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగకేంద్రం నుంచి ప్రయోగిస్తారు. ఇది భూమికి 400 కిలోమీటర్ల ఎత్తులో ఉన్న లోఎర్త్ ఆర్బిట్(దిగువ భూకక్ష్య)లోకి ఆర్బిట్ మాడ్యూల్‌ను 16 నిమిషాల్లో ప్రవేశపెడుతుంది. ఈ కక్ష్యలో వ్యోమగాములతో కూడిన, భూమిని పోలిన వాతావరణం ఉంటే క్రూ మాడ్యూల్, క్రూ మాడ్యూల్‌కు సాంకేతిక సహకారం అందించే సర్వీస్ మాడ్యూల్‌ల కలయిక అయిన ఆర్బిట్ మాడ్యూల్ మూడు నుంచి ఏడు రోజులపాటు(పరిస్థితులను బట్టి) ఉంటుంది. తదుపరి దిశ మార్చుకొని, భూమిపైకి తిరిగి రావడానికి సమాయత్తం అవుతుంది. భూమికి తిరిగి రావడానికి కావాల్సిన త్వరణం కోసం డీబూస్ట్ ప్రక్రియ ప్రారంభమై సర్వీస్ మాడ్యూల్ నుంచి క్రూ మాడ్యూల్ వేరుపడుతుంది. తదుపరి పారాచూట్స్ విచ్చుకొని క్రూ మాడ్యూల్‌ను భూమి వైపుగా తరలించి గుజరాత్ వద్ద అరేబియా సముద్రంలో పడుతుంది. క్రూ మాడ్యూల్ నుంచి వ్యోమగాములను రికవరీ ఆపరేషన్ ద్వారా నేవిదళం సురక్షితంగా వెలికితీయడంతో గగన్‌యాన్ ప్రయోగం సంపూర్ణమవుతుంది. డీబూస్ట్ తరవాత 36 నిమిషాల వ్యవధిలో క్రూ మాడ్యూల్ సముద్రంలో పడటం జరుగుతుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

శ్రీకాళహస్తిలో మహాశివరాత్రి ఉత్సవాలకు శ్రీకారం



శ్రీకాళహస్తి, మార్చి 3: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి క్షేత్రంలో ఆదివారం జరిగిన భక్తకన్నప్ప ధ్వజారోహణంతో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. 14 రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలు క్షేత్ర సంప్రదాయం ప్రకారం పరమశివుడి భక్తుడైన కన్నప్పకే తొలి పూజ చేశారు. ముక్కంటి ఆలయంలోని అలంకార మండపం నుంచి భక్తకన్నప్ప ఉత్సవ మూర్తిని కొండపైకి ఊరేగించారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, సకల దేవతలను ఉత్సవాలకు ఆహ్వానిస్తూ వేదోక్తంగా కన్నప్ప ధ్వజారోహణం చేశారు.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

తిరుమల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారిని తెలంగాణ, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తులు ఆదివారం దర్శించుకున్నారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు, మధ్యప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకటరమణ ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో వేర్వేరుగా శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం వారికి రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.



జస్టిస్ వెంకటరమణ

నరసరావుపేటలో వలంటీర్లకు నగదు పంపిణీ

ఒక్కొక్కరికీ కవర్‌లో రూ. 5 వేలు

- ఉదయం కవర్లపై ఎమ్మెల్యే స్టాంప్.. రాత్రికిచ్చినవాటిపై మాత్రం మాయం
- పెదకూరపాడు, వినుకొండల్లో యథేచ్ఛగా చీరెలు, కుక్కర్ల పంపిణీ
- పల్నాడులో వైసీపీ ఎమ్మెల్యేల ప్రలోభపర్వం
- ఈసీ పట్టించుకోవడం లేదని విపక్షాల ఆగ్రహం

నరసరావుపేట, మార్చి 3: పల్నాడు జిల్లాలో బహిరంగంగానే ఎన్నికల తాయిలాల పంపిణీకి వైసీపీ ఎమ్మెల్యేలు బరితెగించారు. కొద్దిరోజుల కిందట పెదకూరపాడు, వినుకొండ నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున ఓటర్లకు చీరెలు, కుక్కర్లు మొదలైనవి పంపిణీ చేశారు. ఇప్పుడు నగదు పంపిణీకి శ్రీకారం చుట్టారు. నరసరావుపేటలో ఆదివారం ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఒక్కో వలంటీరుకు రూ.5 వేల నగదు కవర్ ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఉదయం కవర్లపై ఎమ్మెల్యే స్టాంప్ ఉండగా, రాత్రికి ఇచ్చిన కవర్లపై స్టాంప్ లేదని వారు చెబుతున్నారు. ఈ భేటీలో ఎన్నికల్లో వైసీపీ కోసం ఎలా పని చేయాలో ఎమ్మెల్యే దిశానిర్దేశం చేశారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే వలంటీర్లు ఉండరని.. అందుచేత వైసీపీని మళ్లీ గద్దెనెక్కించేందుకు వారు కృషి చేయాలని, అలాగే సంక్షేమ పథకాలను పొందుతున్న లబ్ధిదారులను ప్రభావితం చేసేలా పనిచేయాలని ఆయన సూచించినట్లు పలువురు వలంటీర్లు తెలిపారు. తెలుగుదేశం అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఉండవంటూ ఓటర్లకు తెలిసేలా విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే వలంటీర్లపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే వార్డుల్లోని నేతలతో టచ్‌లో ఉండాలని ఆదేశించారని అంటున్నారు. బాహాటంగానే ప్రలోభాల పర్వం కొనసాగిస్తున్నా ఎన్నికల సంఘం (ఈసీ) పట్టించుకోవడంలేదని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి.



రాత్రి పంపిణీ చేసిన నగదు కవర్‌పై స్టాంప్ లేని వైనం

రూ.300 దర్శన క్యూలైన్ వద్ద స్వల్ప అగ్నిప్రమాదం

తిరుమల, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం భక్తులు ప్రవేశించే రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూలైన్‌కు సమీపంలోని ఓ గదిలో ఆదివారం స్వల్ప అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించడంతో ప్రమాదం తప్పింది. క్యూలైన్‌కు సమీపంలో విద్యుత్, ఇతర వస్తువులను భద్రపరిచే గది నుంచి ఆదివారం మధ్యాహ్నం పొగలు రావడాన్ని దగ్గర్లో ఉన్న భద్రతా సిబ్బంది గుర్తించారు. వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు ఫైర్ ఇంజన్‌తో ఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. లోపలున్న వస్తువులను వెలుపలకు తీసుకొచ్చారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగినట్టు అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



ట్రోఫీతో ఏపీ హైకోర్టు క్రికెట్ జట్టు సభ్యులు

హైకోర్టు ఉద్యోగుల క్రికెట్ మ్యాచ్‌లో విజేతగా ఏపీ జట్టు

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ హైకోర్టు ఉద్యోగుల మధ్య మంగళగిరి అంతర్జాతీయ స్టేడియంలో ఆదివారం క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఇరుజట్ల మధ్య హోరాహోరీగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఏపీ జట్టు 18 పరుగులతో విజేతగా నిలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన ఏపీ జట్టు 20 ఓవర్లలో 126 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన తెలంగాణ జట్టు 108 పరుగులకు ఆలౌటైంది. అంతకు ముందు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎస్.జయసూర్య, జస్టిస్ సురేష్‌రెడ్డి, జస్టిస్ బీవీఎల్ఎన్ చక్రవర్తి క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. మ్యాచ్‌లో విజయం సాధించిన ఏపీ జట్టుకు ఏపీ హైకోర్టు ప్రోటోకాల్ రిజిస్ట్రార్ ఏపీ రాఘవస్వామి ట్రోఫీ అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన తెలంగాణ జట్టుకు ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు అక్కెన వేణుగోపాల్ కప్ అందించారు.

నేటి నుంచి 'పది' హాల్ టికెట్లు

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాయబోయే విద్యార్థులు సోమవారం నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పేరు, పుట్టిన తేదీ వివరాలు ఇచ్చి www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకునే వీలుందన్నారు. అలాగే పాఠశాల కోడ్, పాస్‌వర్డ్‌తో ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో చదివే టెన్త్ విద్యార్థుల హాల్ టిక్కెట్లు పొందవచ్చన్నారు. ఈ నెల 18 నుంచి టెన్త్ పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపారు.

ఇస్రో చైర్మన్‌కు పిన్నమనేని ఫౌండేషన్ పురస్కారం

విజయవాడ (మొగల్రాజపురం), మార్చి 3 : భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చైర్మన్ ఎస్.సోమనాథ్‌కు ప్రతిష్ఠాత్మక పిన్నమనేని ఫౌండేషన్ పురస్కారం అందిస్తున్నట్టు ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు చెప్పారు. విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 1989 నుంచి తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సామాజిక, కళారంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులను గౌరవిస్తున్నామని, జాతీయ, అంతర్జాతీయ స్థాయి ప్రముఖులకు పురస్కారాలను అందిస్తున్నామన్నారు. ఫౌండేషన్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఈ ఏడాది ఇస్రో చైర్మన్ సోమనాథ్‌కు ఈ పురస్కారం ఇవ్వాలని నిర్ణయించామన్నారు. కాగా, పిన్నమనేని పురస్కార ప్రదానోత్సవం సిద్ధార్థ ఆడిటోరియంలో ఈ నెల 6వ తేదీన జరుగుతుందని ప్రకటించారు.

ఉక్కు పరిరక్షణకు మహా పాదయాత్ర

విశాఖపట్నం, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోరుతూ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ, అఖిలపక్ష నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం మహా పాదయాత్ర నిర్వహించారు. కూర్మన్నపాలెం రిలే నిరాహార దీక్షల శిబిరం నుంచి ఉదయం 6.15 గంటలకు ప్రారంభమైన పాదయాత్ర వడ్లపూడి, శ్రీనగర్, గాజువాక, ఆటోనగర్, షీలానగర్, కాకానినగర్, ఎన్ఏడీ మీదుగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జనసేన పీఏసీ కమిటీ సభ్యుడు కోన తాతారావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు, సీపీఐ రాష్ట్ర నాయకులు కేవీ సత్యనారాయణ మూర్తి, డి.ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు. పాదయాత్రకు సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకుడు ఎం.శ్రీభరత్ సంఘీభావం ప్రకటించారు.



మహా పాదయాత్ర నిర్వహిస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ సభ్యులు, కార్మికులు

ముక్కంటి ఆలయంపై ఎగిరిన డ్రోన్

- శనివారం అర్ధరాత్రి వీడియోల చిత్రీకరణ
- పోలీసుల అదుపులో ఐదుగురు తమిళనాడు యువకులు

శ్రీకాళహస్తి, మార్చి 3: తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తీశ్వరాలయంపై ఓ డ్రోన్ కెమెరాతో తమిళనాడుకు చెందిన ఐదుగురు యువకులు వీడియోలను చిత్రీకరించారు. వీరిని ఆలయ సెక్యూరిటీ గుర్తించి పోలీసులకు అప్పగించారు. చెన్నైకి చెందిన విఘ్నేష్, అజిత్ కన్నన్, శంకర్ శర్మ, అరవింద్, పోర్చే జీఎన్ తిరుమల శ్రీవారిని దర్శించుకునిశనివారం రాత్రి శ్రీకాళహస్తికి చేరుకున్నారు. ముక్కంటి ఆలయానికి సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు అతిథి గృహంలో గది అద్దెకు తీసుకున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆరంభం కావడంతో ఆలయ పరిసరాలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. వీటిన్నింటినీ చిత్రీకరించాలని ఆ యువకులు భావించారు. తాముంటున్న అతిథి గృహం భవనం పైనుంచి డ్రోన్ కెమెరాతో అర్ధరాత్రి ప్రధాన ఆలయంలో చిత్రీకరించారు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది ఆలయ అధికారులకు సమాచారం అందించారు. ఆ తర్వాత డ్రోన్‌ను వెంబడించి యువకులను గుర్తించారు. శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు.


పాత పెన్షన్ విధానాన్ని తెచ్చే పార్టీకే ఓటు: యూటీఫ్

విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్), మార్చి 3: ఏ పార్టీ అయితే పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు హామీ ఇస్తుందో రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఆ పార్టీకే తమ ఓటు ఉంటుందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్ కుమార్ తెలిపారు. విజయవాడలోని యూటీఎఫ్ కార్యాలయంలో జిల్లా కార్యదర్శివర్గ సమావేశం ఆదివారం జరిగింది. అనంతరం యూటీఎఫ్ రాష్ట్ర సంఘం రూపొందించిన ఓట్ ఫర్ ఓపీఎస్ బుక్‌లెట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మనోహర్ కుమార్ మాట్లాడుతూ పాత పెన్షన్ పునరుద్ధరణను మేనిఫెస్టోలో పెట్టిన పార్టీలకే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యుల మద్దతు ఉంటుందని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



ఎన్.టి.ఆర్ జిల్లా వార్తలు

సోమవారం 4 మార్చి 2024

పోటెత్తిన భక్తులు

● నేటితో ముగియనున్న వీరమ్మ తిరునాళ్ల



ఉయ్యూరు వీరమ్మ తిరునాళ్లకు భక్తులు పోటెత్తారు. చివరి ఆదివారం కావడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం, రహదారులు జనసంద్రమయ్యాయి. సోమవారంతో తిరునాళ్ల ముగియ నుండటంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి.

- 6లో..

• పోలియో చుక్కలు



నగరంలోని సివిల్ కోర్టు సమీపాన సీవీ ఆర్ స్కూల్ కేంద్రంలో ఆదివారం కలెక్టర్ దిల్లీరావు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 1008 కేంద్రాల ద్వారా చిన్నా రులకు పోలియో చుక్కలు వేస్తున్నా మని, 4244 మంది వ్యాక్సినేటర్లను నియమించామని కలెక్టర్ తెలిపారు.

వైసీపీ నేత కబ్జాకాండ!



ఆక్రమణకు గురైన స్థలం చుట్టూ రేకులతో వేసిన ఫెన్సింగ్

రూ.5 కోట్ల విలువైన స్థలం కబ్జా

పక్కా స్కెచ్‌తో దొంగ డాక్యుమెంట్లు సృష్టి


- వాటి ఆధారంగా ఆస్తి పన్ను నంబరు
- అసలు యజమానుల ఫిర్యాదుతో కళ్లు తెరిచిన వీఎంసీ
- ఆస్తి పన్ను రద్దు చేసి అసలు యజమాని పేరుపైనే కొనసాగింపు
- ఇప్పుడు అదే స్థలాన్ని భార్య పేరుపై రాసి ఇంటి నిర్మాణం
- అసలు యజమానులు గగ్గోలు పెడుతున్నా స్పందించిన అధికారులు
- కేసులు పెడతామని అసలు యజమానులకే అధికారుల బెదిరింపులు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : విజయవాడ సత్యనారాయణపురానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు గండూరి ఉమమాహేశ్వరరావుకి సత్యనారాయణపురం లక్ష్మీనగర్‌లో కెనరాబ్యాంకు ఎదురుగా సర్వే నంబరు 126/1లో 325 గజాల స్థలం ఉంది. ఆయన చనిపోయిన తర్వాత కుటుంబ సభ్యులు నడమ జరిగిన ఆస్తి పంపకాల్లో ఆయన నాలుగో కుమారుడు, కృష్ణా బ్యారేజీ ఆర్కిటెక్ట్ అయిన గండూరి రాధాకృష్ణమూర్తికి ఈ స్థలం వారసత్వ ఆస్తిగా సంక్రమించింది. రాధాకృష్ణమూర్తి 1981లో చనిపోగా ఆయన సతీమణి విజయలక్ష్మి సదరు స్థలానికి యజమానురాలిగా కొనసాగుతూ పన్నులు చెల్లించుకుంటూ ఆస్తిని సంరక్షించుకుంటూ వచ్చారు. ప్రస్తుతం ఓ కార్పొరేషన్ చైర్మన్‌గా ఉన్న వైసీపీ నేత 2014లో వేరే ఆస్తి కాగితాలను విజయలక్ష్మి స్థలం కాగితాలుగా చూపి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులను పక్కదారి పట్టించి ఆ స్థలానికి ఫేక్ ప్రాపర్టీ ట్యాక్స్‌ను సృష్టించారు. దీంతో ఒకే స్థలానికి విజయలక్ష్మి పేరుతో ఒక ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్ నంబరు, సదరు వైసీపీ నేత పేరుతో మరో ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్ నంబరు ఏర్పడింది. ఈ విషయాన్ని విజయలక్ష్మి, ఆమె కుమారుడు గండూరి ఉమామహేశ్వరరావు అప్పటి వీఎంసీ కమిషనర్ జె.నివాస్ దృష్టికి తీసుకెళ్లగా సుదీర్ఘ విచారణ తర్వాత 2018లో గౌతంరెడ్డి పేరుతో ఉన్న తప్పుడు ప్రాపర్టీ ట్యాక్స్ అసెస్‌మెంట్ నంబరును రద్దు చేయడంతోపాటు ఆ స్థలంలో గౌతంరెడ్డి చేసిన నిర్మాణాన్ని డిమాలిష్ చేయాల్సిందిగా ఆర్‌సీ నం. ఏ9-101477/2018 ఉత్తర్వుల జారీ చేశారు. అదే ఉత్తర్వుల్లో ముందుందు ఆ స్థలంలో ఎలాంటి ఇంటి నిర్మాణాలకు సదరు వైసీపీ నేత పేరు మీద అనుమతి ఇవ్వొద్దని పేర్కొన్నారు. కానీ రాజకీయ ఒత్తిళ్లతో డిమాలిషన్ జరగలేదు. ఈ కబ్జా స్థలంలోనే చాలాకాలం గౌతంరెడ్డి వైసీపీ కార్యాలయాన్ని నిర్వహించారు.

భార్య పేరుపైకి మార్చి... వీఎంసీని ఏమార్చి..!

కబ్జా చేసిన స్థలంపై మరింత పట్టు బిగించేందుకు సదరు వైసీపీ నేత 2017లో ఆ స్థలంలో 225 గజాలను తన భార్యకి గిఫ్ట్ డీడ్‌గా రాసేశారు. తాను కబ్జా చేసిన.. తనకు అధికారం లేని స్థలాన్ని తన భార్యకు గిఫ్ట్ డీడ్‌గా రాసి ఆమె పేరుతో ఆ స్థలంలో ఇంటి నిర్మాణం చేసుకునేందుకు ప్లాన్‌కు అనుమతి ఇవ్వాలంటూ వీఎంసీకి మరోసారి దరఖాస్తు చేశారు. అయితే అప్పటికే ఈ వివాదం హైకోర్టుకు వెళ్లడం అక్కడ స్టేటస్‌కో పాటించాలని ఆదేశించింది. ఈ విషయాన్ని కప్పిపుచ్చి ఆ స్థలంలో ఇంటి నిర్మాణం కోసం వైసీపీ నేత భార్య దరఖాస్తు చేశారు.

వీఎంసీ స్టాండింగ్ కమిటీ అత్యుత్సాహం



గౌతంరెడ్డి చేసిన నిర్మాణాన్ని కూల్చాలని ఇచ్చిన ఆర్డర్

సదరు వైసీపీ నేత రాజకీయంగా ఒత్తిళ్లు తీసుకొచ్చి వీఎంసీ మేయర్ ద్వారా స్టాండింగ్ కౌన్సిల్‌లో ఇంటి ప్లానుకు ఆమోదం పొందారు. గత ఏడాది నవంబరు 14న స్టాండింగ్ కౌన్సిల్‌లో సత్యనారాయణపురంలో వైసీపీ నేత కబ్జా చేసిన స్థలంలో హైకోర్టు స్టేటస్‌కో ఉత్తర్వులను బేఖాతర్ చేస్తూ వీఎంసీ స్టాండింగ్ కౌన్సిల్ ఇంటి ప్లానుకు ఆమోదం తెలిపింది. అప్పటి నుంచి అక్రమ నిర్మాణాన్ని ఆపేందుకు స్థల యజమాని ఉమామహేశ్వరరావు చేసిన ప్రయత్నాలు అరణ్యరోదనగా మిగిలిపోయాయి. తన అధికార పరిధిని దాటి మరీ స్టాండింగ్ కౌన్సిల్ ఇంటి ప్లానుకు ఆమోదం తెలపడం గమనార్హం.

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో ఆయన పేరుమోసిన వైసీపీ నేత. రాష్ట్రస్థాయిలో ఓ కార్పొరేషన్‌కు చైర్మన్‌గా కూడా ఉన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో తనకు దగ్గర బంధుత్వం ఉందని అందరికీ చెప్తుకుంటుంటారు. ఆయన కుమార్తె మున్సిపల్ ఎన్నికల్లో అధికార పార్టీ తరఫున కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. కమ్యూనిస్టుగా రాజకీయ జీవితం మొదలు పెట్టి ఇప్పుడు వైసీపీ నాయకుడిగా కొనసాగుతున్నారు. ఆయన కన్ను విజయవాడ సత్యనారాయణపురంలోని కోట్లాది రూపాయల విలువ చేసే ఓ స్థలంపై పడింది. ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు పక్కాగా స్కెచ్ వేశారు. 2014లో మొదలు పెట్టిన ఈ కబ్జాకాండకు ఇప్పుడు ఇంటి నిర్మాణంతో ముగింపు పలకాలని ఆగమేఘాలపై ఆ కబ్జా స్థలంలో భారీ ఇంటిని నిర్మించేస్తున్నారు. ఒకప్పుడు ఈ ఆక్రమణను తప్పు అన్న వీఎంసీ అధికారులు ఇప్పుడు రాజకీయ ఒత్తిళ్లతో అసలు స్థల యజమానులనే కేసులు పెడతామంటూ బెదిరిస్తున్నారు. కబ్జా చేసిన ఆ స్థలం విలువ అక్షరాలా రూ.5 కోట్లు..!

న్యాయం చేయకుంటే ఆమరణదీక్ష చేస్తా



నా తండ్రికి వారసత్వంగా వచ్చిన స్థలాన్ని అక్రమంగా కబ్జా చేసిన స్థలంలో వీఎంసీ అధికారులు కుట్రపూరితంగా ఇంటి నిర్మాణానికి అనుమతి ఇచ్చారు. ఈ విషయం తెలియజేసి, ఇంటి నిర్మాణాన్ని నిలుపుదల చేస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని కోరితే వీఎంసీ అధికారులు నాపైనే పోలీసు కేసు పెడతామని బెదిరింపులకు దిగుతున్నారు. వైసీపీ నేత మా ఆస్తులను కబ్జా చేయడంతో మానసిక క్షోభతో నా కుటుంబానికి చెందిన ఇద్దరు సభ్యులను కోల్పోయాను. నాకు న్యాయం జరగని పక్షంలో కబ్జా చేసిన స్థలం ఎదుట ఆమరణ దీక్ష చేస్తా.

- గండూరి ఉమామహేశ్వరరావు, స్థలం వాస్తవ యజమాని

పోలింగ్ కేంద్రాలు ఫిక్స్

ఎన్నికల సంఘానికి చేరిన జాబితా



- ఎన్టీఆర్ జిల్లాలో 1781 కేంద్రాలు
- వీటికి అదనంగా విజయవాడ రూరల్‌లోని 82 పోలింగ్ కేంద్రాలు జిల్లా పరిధిలోకి..
- అత్యధికంగా విజయవాడ వెస్ట్‌లో 298 కేంద్రాలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఎన్నికల నోటిఫికేషన్‌కు సన్నద్ధమౌతున్న దశలో ఎన్టీఆర్ జిల్లా ఎన్నికల యంత్రాంగం పోలింగ్ కేంద్రాలను ఫిక్స్ చేసింది. ఈ మేరకు ఫిక్స్ చేసిన పోలింగ్ కేంద్రాల వివరాలను జిల్లా ఎన్నికల యంత్రాంగం రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపించింది. పోలింగ్ కేంద్రాలను ఫిక్స్ చేయటం వల్ల వీటిని మార్చే అవకాశం అయితే లేదు. తుది ఓటర్ల జాబితా అనంతరం ఓటర్ల దామాషాకు అనుగుణంగా అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ కేంద్రాలను పెంపుదల చేయాల్సి వచ్చింది. కొద్దిరోజుల కిందటే విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో పది పోలింగ్ కేంద్రాలను పెంచారు. ఇలా ప్రతి నియోజకవర్గం పరిధిలో స్వల్పంగా పోలింగ్ కేంద్రాలు పెరిగాయి. కలెక్టర్ దిల్లీరావు ఇటీవల తరచూ రాజకీయ పార్టీల నాయకులతో సంప్రదింపులు జరుపుతూ పోలింగ్ కేంద్రాల పెంపుదలకు నిర్ణయం తీసుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 1781 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో తిరువూరు నియోజకవర్గంలో 234 పోలింగ్ కేంద్రాలు, విజయవాడ ఈస్ట్ నియోజకవర్గంలో 253 పోలింగ్ కేంద్రాలు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో 257 పోలింగ్ కేంద్రాలు, విజయవాడ వెస్ట్ నియోజకవర్గంలో 298 పోలింగ్ కేంద్రాలు, మైలవరం నియోజకవర్గంలో 295 పోలింగ్ కేంద్రాలు, నందిగామ నియోజకవర్గంలో 222 పోలింగ్ కేంద్రాలు, జగ్గయ్యపేట నియోజకవర్గంలో 222 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.

● గన్నవరం నియోజకవర్గంలోని కొన్ని పోలింగ్ కేంద్రాలు ఎన్టీఆర్ జిల్లా పరిధిలోనే..

ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఉన్న 7 నియోజకవర్గాల పరిధిలో 1781 పోలింగ్ కేంద్రాలు కాకుండా కృష్ణాజిల్లా పరిధిలోని గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి విజయవాడ రూరల్ మండలం పరిధిలోని పలు గ్రామాలు ఎన్టీఆర్ జిల్లా పరిధిలో ఉన్నాయి. ఇవి 82 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. గన్నవరంతో కూడా కలిపితే మొత్తం 1863 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి.

నెల నిండకుండానే స్థానచలనం

సిటీ డీసీపీ కృష్ణకాంత్ పాటిల్ బదిలీ

కొత్తగా అధిరాజ్ సింగ్ రాణా రాక



కృష్ణకాంత్ పాటిల్

విజయవాడ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల నేపథ్యంలో జరిగిన బదిలీల్లో వచ్చిన అధికారులు కుదురుకునేలోపే స్థాన చలనాలు కలుగుతున్నాయి. విజయవాడ డీసీపీగా ఉన్న కృష్ణకాంత్ పాటిల్ బాధ్యతలు స్వీకరించి ఇంకా నెల రోజులు నిండకుండానే బదిలీ అయ్యారు. ప్రభుత్వం తాజాగా నలుగురు ఐపీఎస్‌లను బదిలీ చేసింది. ఇక్కడ ఉన్న కృష్ణకాంత్ పాటిల్‌ను తిరుపతి జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయనగరం ఐదో బెటాలియన్ కమాండెంట్ అధిరాజ్ సింగ్ రాణాను నియమించారు. తొలి విడతలో జరిగిన బదిలీల్లో విజయవాడ డీసీపీగా ఆనంద్‌రెడ్డిని నియమించారు. తర్వాత విడుదలైన జాబితాలో ఆయన బదిలీ ఇంటెలిజెన్స్‌కు మారిపోయింది. తర్వాత కృష్ణకాంత్ పాటిల్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. ఆయన గడచిన నెల ఐదో తేదీన బాధ్యతలు స్వీకరించారు. నగరం మీద ఒక అవగాహనకు వచ్చి పాలనను ట్రాక్‌లో పెడుతున్న తరుణంలో ప్రభుత్వం బదిలీ చేసింది.



సమస్యలపై స్పందించేంత వరకు పోరాటం

- రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రావణ్ నిరవధిక దీక్ష
- విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్

- 6లో..

అవనిగడ్డ నియోజకవర్గంలో దీవి గ్రామాల ప్రజల చిరకాల వాంఛ కలగానే మిగిలింది. వారిని బయట ప్రపంచానికి దగ్గర చేసే ఎదురుమొండి వారధిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం ప్రకటనలకే పరిమితమైంది. బ్రిడ్జి నిర్మాణానికి గత ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన వైఎస్ జగన్ అధికారంలోకొచ్చాక ఎప్పటికప్పుడు ప్రకటనలు ఇవ్వడం తప్ప పని జరిగింది లేదు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం ఎటువంటి చొరవా చూపింది లేదు.

మొండి మాటలాయే!

నాలుగున్నరేళ్లుగా ఎదురుమొండి వారధిపై వైసీపీ నేతల బూటకపు ప్రకటనలు

- దీవి గ్రామాల సమూహమైన ఎదురుమొండి వారధిపై హై లెవల్ బ్రిడ్జి కలే
- ఎదురుమొండి దీవుల్లోని మూడు పంచాయతీల్లో నివసిస్తున్న 10 వేల మందికిపైగా మత్స్యకారులు బాహ్య ప్రపంచానికి దూరం
- టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన పంటు మాత్రమే నేటికీ దిక్కు
- నాటి ప్రతిపక్ష నేతగా జగన్ ఇచ్చిన హామీ ప్రకటనలకే పరిమితం



పంటు దిగి నడుచుకుని వస్తున్న కూలీలు

అవనిగడ్డ : గత ప్రభుత్వం 2018లో ఎదురుమొండి వారధి నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. ఇందుకు సంబంధించి ఏడీబీ (ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ బ్యాంక్) ద్వారా రాష్ట్రంలోని ఆర్ అండ్ బీ రహదారుల అభివృద్ధి, ఎదురుమొండి వారధి నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదించగా, కొద్ది రోజులకే ఎన్నికల కోడ్ రావటంతో ఆ ప్రతిపాదన ఫైళ్ల దశలోనే నిలిచిపోయింది.

వారధి నిర్మిస్తామని జగన్ హామీ

ప్రతిపక్ష నేతగా ఎన్నికల ప్రచారం కోసం అవనిగడ్డ నియోజకవర్గానికి వచ్చిన జగన్మోహన్‌రెడ్డి... అధికారంలోకి రాగానే వారధి నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

వైసీపీ అధికారం చేపట్టిన తర్వాత ప్రభుత్వ విధానాలు నచ్చక ఏడీబీ రాష్ట్రంలో కార్యకలాపాలు పూర్తిగా నిలిపివేసింది. అనంతరం పలుమార్లు స్థానిక నేతలు ముఖ్యమంత్రి దృష్టికి ఎదురుమొండి వారధి నిర్మాణ ఆవశ్యకతను వివరించారు. 2020లోనే వారధి నిర్మాణానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అంగీకరించారని స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు ఒక ప్రకటన విడుదల చేశారు.

నిర్మాణానికి ప్రభుత్వ ప్రకటన

ఎదురుమొండి వారధి నిర్మాణానికి అనుమతి ఇస్తూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2022 ఏప్రిల్ 21న ఓ ప్రకటన విడుదల చేసింది. రూ.109 కోట్లతో ఎదురుమొండి వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తున్నామని, నాబార్డు అందుకు ఆర్థిక సాయమందిస్తుందని ప్రకటించింది. సెప్టెంబరు 20వ తేదీన డీపీఆర్ తయారు చేసేందుకు ఆర్ అండ్ బీ, నాబార్డు అధికారులు ఎదురుమొండి దీవులను సందర్శించారు. వారంలోగా సాయిల్ పరీక్షలు పూర్తి చేసి 18 నెలల్లో వారధి నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని ప్రకటించారు.

ముందుకు రాని కాంట్రాక్టర్లు

అనంతరం 2023 జనవరి 28వ తేదీన నాబార్డు చైర్మన్ దీవి ప్రాంతంలో పర్యటన సందర్భంగా కూడా దీనిపై ఎటువంటి ప్రకటనా రాలేదు. ఎంపీ బాలశౌరి నాబార్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా, గత ఏడాది ఆగస్టులో వారధి నిర్మాణానికి రూ.143 కోట్లు మంజూరయ్యాయని కలెక్టర్ రాజాబాబు తెలిపారు. అప్పటి నుంచి కొద్ది నెలలపాటు వారధి విషయం మరుగున పడిపోగా, స్థానిక ప్రజలు, ప్రతిపక్షాలు వారధి నిర్మాణం ఏమైందంటూ వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కు పెట్టడంతో డిసెంబర్‌లో రూ.109 కోట్లతో వారధి నిర్మాణానికి టెండర్లు పిలిచినప్పటికీ నాబార్డు మంజూరు చేసిన మొత్తానికి ఆర్ అండ్ బీ అధికారులు ఇచ్చిన టెండర్‌కు సాపత్యం లేకపోవటంతో కాంట్రాక్టర్లు ఎవ్వరు టెండర్లు వేసేందుకు ముందుకు రాలేదు.

విజిలెన్స్‌ను కదిలించిన ఇంటెలిజెన్స్

ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలపై రహస్య నివేదిక



- పీడీఎస్ బియ్యం మాఫియాతో లింక్‌లు
- విభాగంలోకి కొత్త నీరు
- ప్రస్తుతం ఉన్న వారిని రేంజ్‌కు పంపిన అధికారులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఒక నివేదిక పాత నీరును పంపేసింది. కొత్త నీరును తీసుకొచ్చింది. విజిలెన్స్ విభాగంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐల మార్పు వెనుక ఇంటెలిజెన్స్ నివేదిక ఉన్నట్టు నిఘా వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. వివిధ జిల్లాలో పనిచేస్తున్న కొంతమంది ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు విజిలెన్స్‌ను ఎంచుకున్నారు. అప్పటి అధికారులతో ఉన్న పరిచయాలను ఉపయోగించుకుని సిఫార్సులు చేయించుకున్నారు. 2019లో వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విజిలెన్స్‌కు వెళ్లిన అధికారులు అక్కడే పాతుకుపోయారు. కొంతమంది రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం నుంచి చక్రం తిప్పితే, కొంతమంది జిల్లా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ కార్యాలయంలో చక్రం తిప్పారు. కల్తీ వ్యవహారాలు, నకిలీ బాగోతాలను వెలికి తీయాల్సిన విభాగంలో పనిచేస్తున్న ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు ఆ మాఫియాలతో మిలాఖత్ అయినట్టు తీవ్రంగా ఆరోపణలు ఉన్నాయి. నేరుగా నిఘా విభాగంలో అధికారులు అండదండలు ఉండడంతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో కల్తీ మాఫియా రెచ్చిపోతోందని తెలిసింది.

● అసలు ఏం జరిగింది?

ఉమ్మడి కృష్ణా జిల్లాలో బియ్యం మాఫియా భూమి మీద నిలబడటం లేదు. పగలు, రాత్రి తేడా లేకుండా ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన బియ్యాన్ని లారీల్లో మిల్లులకు, పోర్టులకు తరలిస్తోంది. ఈ మాఫియాకు జిల్లా మొత్తం కొంతమంది ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ బియ్యాన్ని భద్రపరచడానికి ఆటోనగర్‌లో పెద్ద గొడౌన్ నడుస్తోంది. ఇక్కడ రాత్రిపూట లోడింగ్, అన్‌లోడింగ్ జరుగుతున్నాయన్నది బహిరంగ రహస్యం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ తరహా గోడౌన్లను మాఫియా నిర్వహిస్తోంది. విజిలెన్స్ అధికారులు ఇప్పటి వరకు ఈ గోడౌన్ల జోలికి వెళ్లిన దాఖలు ఎక్కడా కనిపించలేదు. నిఘా విభాగం పనిచేస్తుందన్న భావన కలిగించడానికి అప్పడప్పుడు మెరుపు దాడులు చేసేవారు. ఆటోలు, మినీ వాహనాల్లో వెళ్తున్న బియ్యాన్ని సీజ్ చేశామని ప్రకటనలు ఇచ్చేవారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న గొడౌన్లలో అనధికారికంగా ఉన్న పీడీఎస్ బియ్యం గుట్టు తెలిసినా వాటివైపు కన్నెత్తి చూడలేదు. దీని కారణం నెలవారీగా మాఫియా నుంచి లక్షలాది రూపాయల ముడుపులు అందడమేనని ప్రచారం జరుగుతోంది. కొద్దినెలల క్రితమే ఇంటెలిజెన్స్ విభాగం దీనిపై క్షేత్రస్థాయిలో పరిశీలించి ఒక నివేదికను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉన్నతాధికారులకు ఇచ్చినట్టు సమాచారం. ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలకు ఏ స్థాయిలో ముడుపులు అందుతున్నాయో ఈ నివేదికలో స్పష్టం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఈ నివేదికను పరిశీలించిన ఉన్నతాధికారులు విజిలెన్స్‌లో ఉన్న పాత ముఖాలను బయటకు పంపేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా ఒక ఎస్‌ఐను విజయవాడ నుంచి తూర్పుగోదావరి జిల్లా వీఆర్‌కు పంపేశారు. ఇన్‌స్పెక్టర్‌ను ఏలూరు రేంజ్‌కు సరెండర్ చేశారు. రేంజ్ అధికారులు ఎన్నికల బందోబస్తు నిమిత్తం ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌కు అటాచ్‌మెంట్ ఇచ్చారు.

● ఉన్నతాధికారుల పరిచయాలతో...

విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి వెళ్లాంటే దానికి సుదీర్ఘ ప్రక్రియ ఉంటుంది. విజిలెన్స్‌కు వెళ్లాలనుకున్నవారు ముందుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీకి దరఖాస్తు చేసుకోవాలి. ఆయన సంబంధిత యూనిట్ ఆఫీసర్ (కమిషనర్/ఎస్పీ) ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను, ట్రాక్ రికార్డును రప్పించుకుంటారు. అన్నీ పరిశీలించుకున్న తర్వాత విజిలెన్స్‌లో పనిచేయడానికి వారు అర్హులు అని గుర్తిస్తే ఆ ఫైల్‌ను డీజీపీ కార్యాలయంలో ఉన్న పర్సనల్ విభాగానికి పంపుతారు. ఈ విభాగం ఆయా కమిషనరేట్, జిల్లాలో ఉన్న సిబ్బంది సంఖ్యను పరిశీలించిన తర్వాత రిలీవింగ్ ఉత్తర్వులు ఇస్తుంది. ఆ తర్వాత దరఖాస్తు చేసుకున్న ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు విజిలెన్స్ విభాగంలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. ఇలా వెళ్లిన వారి సేవలు సంతృప్తికరంగా లేకపోయినా, ఆరోపణలు తీవ్రమైన స్థాయిలో ఉన్నా వారిని తిరిగి పర్సనల్ విభాగానికి పంపేస్తారు. అక్కడి నుంచి ఏలూరు రేంజ్‌కు సరెండర్ చేస్తారు. 2019లో వైసీపీ విజయవాడలో పోలీసు కమిషనర్‌గా పనిచేసిన అధికారులు డీజీ స్థాయికి వెళ్లడంతో ఆ పరిచయాలను ఉపయోగించుకుని కొంతమంది ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు వారి ఫైళ్లను చకచకా నడిపించుకున్నారు. ఐదేళ్లపాటు అటు రాష్ట్ర కార్యాలయంలో, ఇటు జిల్లా కార్యాలయంలో తిష్ట వేసుకుని ఉండిపోయారు.

కేంద్ర బలగాలు వచ్చేశాయి

- ఎన్నికల బందోబస్తుకు మూడు కంపెనీలు
- ఒక్కో కంపెనీలో 92 మంది సిబ్బంది

- 6లో..



భక్తులతో జనసంద్రంలా ఆలయ ప్రాంగణం

వీరమ్మ తిరునాళ్లకు పోటెత్తిన భక్తులు

ఉయ్యూరు, మార్చి 3 : వీరమ్మతల్లి తిరునాళ్లకు ఆదివారం భక్తులు పోటెత్తారు. తిరునాళ్లలో చివరి ఆదివారంతో పాటు సోమవారంతో తిరునాళ్ల ముగియనుండగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. తెలుగు రాష్ట్రాలనుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి జనసంద్రంలా మారింది. వేకువజామునుంచి భక్తులు ఆలయ ప్రదక్షిణ చేసి పాలపొంగళ్లతో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారి దర్శనానికి క్యూలైన్లతో పాటు ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎండలో ఇబ్బందులు తప్పలేదు. నిలబడ్డారు. భక్తుల రద్దీని అదుపుచేసేందుకు పోలీసులు అవస్థలు పడ్డారు.



పట్టువస్త్రాలు ఉంచిన పళ్లేలతో దుర్గగుడి ఈవో రామారావు, ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రాంబాబు తదితరులు

శ్రీశైల మల్లన్నకు పట్టువస్త్రాల సమర్పణ

వన్‌టౌన్, మార్చి 3 : శ్రీశైలంలో భ్రమరాంబ మల్లేశ్వరుల బ్రహ్మోత్సవాల సందర్భంగా దుర్గామల్లేశ్వరదేవస్థానం తరఫున ఆదివారం ఈవో రామారావు, ట్రస్టబోర్డు చైర్మన్ రాంబాబు తదితరులు పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చక బృందంతో పాటు వెళ్లిన రామారావు, రాంబాబులకు శ్రీశైల దేవస్థానం అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్చరణల మధ్య, మేళతాళాలు, శివనామ స్మరణల మధ్య పట్టు వస్త్రాలను సమర్పించారు. స్వామి, అమ్మవార్ల దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు అందజేశారు

రేపు జయహో బీసీ సభ

▸▸ విజయవంతం చేయండి: మరక శ్రీనివాస్‌యాదవ్

విద్యాధరపురం, మార్చి 3: టీడీపీ బీసీ సెల్ ఆధ్వర్యంలో నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఉన్న మైదానంలో మంగళవారం జయహో బీసీ సభ నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ ఎన్టీఆర్ జిల్లా బీసీ సెల్ అధ్య క్షుడు మరక శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సభను విజయవంతం చేయడం కోసం ఆదివారం ఆటోనగర్ లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో బీసీ ముఖ్య నాయకులు సమావేశమయ్యారు. ఎన్టీఆర్ జిల్లా నుంచి బీసీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, బీసీల సత్తా చాటాలని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. చంద్రబాబు హయాంలో బీసీల కోసం ప్రవేశ పెట్టిన ఎన్నోరకాల పథకాలను రద్దు చేసిన బీసీల ద్రోహి జగన్‌రెడ్డి అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీసీలను రాజకీయంగా, ఆర్థికంగా జగన్‌రెడ్డి అణగదొక్కాడన్నారు. జగన్ రెడ్డి రాక్షసపాలనపై బీసీలు తిరుగుబాటు చేసే రోజు దగ్గర్లోనే ఉందన్నారు. టీడీపీ- జనసేన ప్రభుత్వం బీసీ లకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తుందని ఈ సభలో బీసీ డిక్లరేష న్‌ను ప్రకటిస్తారని ఆయన తెలిపారు. శింగం వెంకన్న, బెజవాడ తిరుపతిగౌడ్, కత్తుల మణికంఠ, కరణం వెంకటరమణ, పిల్లి రామ్మోహనరావు, సోమేశ్వరరరావు పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం: భానుసింగ్

ధర్నాచౌక్, మార్చి 3: టీడీపీతోనే బీసీల అభ్యున్నతి, సంక్షేమం సాధ్యమని రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి విజయానికి బీసీలు కృషి చేయాలని టీడీపీ బొందిలి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ ఎస్‌సీహెచ్ భానుసింగ్ పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయంలో బొందిలి సాధి కార సమా వేశం ఆదివారం నిర్వహించారు. టీడీపీ-జనసేన సంయుక్తంగా ప్రకటించే బీసీ డిక్లరేష న్‌లో ఆయా కులాల డిమాండ్లను కమిటీకి తెలియజేయాలని చెప్పారని తెలిపారు. ఈనెల 5న జయహో బీసీ బహిరంగ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మినిమం టైం స్కేల్ అమలు చేయాలి

▸▸ ఆర్ట్, క్రాఫ్ట్ వ్యాయామ ఉపాధ్యాయుల డిమాండ్

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 3: ఏపీ సమగ్ర శిక్ష పరిధిలో ఆర్ట్, క్రాఫ్ట్ వ్యాయామ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లకు తక్షణమే మినిమం టైం స్కేల్ అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ వర్క్, ఆర్ట్ వ్యాయామ ఉపాధ్యాయుల యూనిటీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సైకం శివకుమారిరెడ్డి, శంకరరావు డిమాండ్ చేశారు. నగరంలోని రెవెన్యూ ఉద్యోగుల సేవా సంఘం భవనంలో ఆదివారం రాష్ట్ర సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదర్ హాజరయ్యారు. పదేళ్లుగా రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా పాఠశాల విద్యలో విధులు నిర్వహిస్తున్న ఆర్ట్, క్రాఫ్ట్ వ్యాయామ ఉపాధ్యాయులు అరకొర జీతాలతో జీవనాన్ని నెట్టుకొస్తున్నారని వారు అన్నారు. పేరుకే పార్ట్ టైం అయినా ఫుల్‌టైంగా పదేళ్లుగా సేవలు అందిస్తున్నారని వారికి తక్షణమే ప్రభుత్వం మినిమం టైం స్కేల్ అమలు చేయాలని డిమాండ్‌చేశారు. ఎంటీఎస్, ఈఎస్ఐ, ఈపీఎఫ్ అమలు చేయాలని, వృత్తి విద్య ఉపాధ్యాయులుగా పని చేస్తున్న వారిని ఒకేషనల్ ఉపాధ్యాయులుగా మార్చాలని డిమాండ్ చేశారు.

లలిత కళల పరిరక్షణ అందరి బాధ్యత

సత్యనారాయణపురం, మార్చి 3: లలిత కళలు శాంతి, సహనానికి దోహదపడతాయని, వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపైన ఉందని రామకృష్ణమిషన్ కార్యదర్శి స్వామి వినిశ్చిలానంద అన్నారు. ముత్యాలంపాడు ఎంఎస్‌మూర్తి కళా ఆర్ట్ గ్యాలరీలో ది ఆంధ్రా అకాడమీ ఆఫ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఎంఎస్‌మూర్తి చిత్ర కళా ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఎంఎస్‌మూర్తి దృశ్యశ్రవణ లఘు చిత్రాన్ని దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఈవో కె.ఎస్.రామారావు ప్రారంభించారు. చిత్రకళాప్రదర్శన ఈనెల 14వ తేదీ వరకూ జరుగుతుందని ప్రతీ ఒక్కరూ ఉచితంగా సందర్శించవచ్చని అకాడమీ కార్యదర్శి ఎంవీ సాయిబాబు తెలిపారు. ప్రముఖ చిత్రకారుడు ఉస్మాన్‌ఖాన్, కార్టూనిస్ట్ 64 కళలు.కామ్ సంపాదకుడు కళాసాగర్‌లను ఘనంగా సత్కరించారు. డాక్టర్ బెజవాడ పాపారావు, యలమంచలి అంజని, ఎస్.సత్యనారాయణ వరప్రసాద్ పాల్గొన్నారు.

కార్మిక హక్కుల రక్షణకు సంఘటిత ఉద్యమాలు

గవర్నర్‌పేట, మార్చి 3: కమ్యూనిస్టు ఉద్యమంలో చీలికలను ఆసరాగా చేసుకుని కార్పొరేట్లు, కోటీశ్వరులు రాజకీయాల్లోకి వస్తున్నారని దీంతో కార్మికుల హక్కులను వారు కాలరాస్తున్నారని కార్మిక హక్కుల పరిరక్షణ కోసం సంఘటిత ఉద్యమాలు అవసరమని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు అన్నారు. సీపీఐ ఎంఎల్(న్యూడెమోక్రసీ) సీనియర్ నాయకుడు కూరపాటి రామారావు సంస్మరణ సభ ఆదివారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకేలో నిర్వహించారు. వామపక్ష పార్టీలు, కార్మిక సంఘాల నేతలు సభకు హాజరయ్యారు. కార్మిక సమస్యలపై నిరంతరం ఉద్యమాల్లో పాల్గొని రామారావు పోరాటాలు చేశారన్నారు. న్యూ డెమోక్రసీ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు పి.టాన్యా, పార్టీ రాష్ట్ర నాయకుడు సీఎస్ సాగర్ ఎంఎల్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాస్తి కిషోర్, ఇఫ్టూ కార్యదర్శి పి.ప్రసాద్, లిబరేషన్ పార్టీ నాయకులు డి.హరనాథ్, భారత కార్మిక సంఘాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.మోహన్ పాల్గొన్నారు.

బీజేపీకి మద్దతిచ్చే పార్టీలను ఓడించాలి

▸▸ సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు పిలుపు

వన్‌టౌన్, మార్చి 3: బీజేపీకి మద్దతిచ్చే పార్టీలను ఓడించాలని సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. లెనిన్‌భవన్‌లో ఆదివారం నిర్వహించిన ఏఐవైఎఫ్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలోని హామీలు నెరవేర్చని బీజేపీ ప్రభుత్వానికి మద్దతు పలికే పార్టీలను ఓడిం చాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్రానికి బీజేపీ తీవ్ర అన్యాయం చేస్తే ఉద్యమించకుండా రాష్ట్రంలోని అధి కార ప్రతిపక్ష పార్టీలు దానికి వంత పాడడం సిగ్గుచేటన్నారు. దేశ చరిత్రలో సచివాల యాన్ని ప్రైవేట్ బ్యాంకుల్లో కుదవ పెట్టిన సీఎంగా జగన్మోహన్‌రెడ్డి రికార్డుకెక్కారన్నారు. ఎన్.లెనిన్ బాబు, పి.విశాల్, లంక గోవిందరాజులు, కొట్టు రమణరావు, తాడి పైడయ్య పాల్గొన్నారు.

కేంద్ర బలగాలు వచ్చేశాయి

▸▸ ఎన్నికల బందోబస్తుకు మూడు కంపెనీలు

▸▸ చెన్నై సీఐఎస్ఎఫ్ బేస్ నుంచి రాక

▸▸ ఒక్కో కంపెనీలో 92 మంది సిబ్బంది

▸▸ గ్రామీణ ప్రాంతాల్లో ఫ్లాగ్ మార్చ్



విజయవాడలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ)

త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల బందోబస్తుకు పారా మిలటరీ బలగాలు విజయవాడకు చేరుకున్నాయి. సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్)కు చెందిన మూడు కంపెనీలు కమిషనరేట్‌కు వచ్చాయి. ఒక్కో కంపెనీలో 92 మంది సిబ్బంది ఉంటారు. చెన్నై సీఐఎస్ఎఫ్ బేస్ క్యాంపు నుంచి ఈ బలగాలు వచ్చాయి. ఎంజీ రోడ్డులోని ఏఆర్ గ్రౌండ్స్‌లో ఉన్న సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం అధీనంలో ఈ బలగాలు ఉన్నాయి. ప్రస్తుతానికి మూడు కంపెనీలు వచ్చినప్పటికీ త్వరలో మరిన్ని కంపెనీలు వస్తాయని తెలుస్తోంది. ఎన్టీఆర్ జిల్లా పోలీసులు, ఈ కంపెనీలతో కలిసి సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాలు, గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నారు. ఇప్పటికే అధికారులు ఎన్టీఆర్ జిల్లాలో సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రదేశాలను గుర్తించారు. స్టేషన్ల వారీగా ఆయా సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక ప్రాంతాల్లో ఫ్లాగ్‌మార్చ్‌లకు మ్యాప్‌లను సిద్ధం చేశారు. రోజుకు ఒక్కో పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ మార్చ్‌లు చేస్తారు. విజయవాడ కొత్తపేట స్టేషన్ పరిధిలో వైఎస్సార్ కాలనీ, పి.నైనవరం, అంబాపురం ప్రాంతాల్లో పశ్చిమ ఏసీపీ పడాల మురళీకృష్ణారెడ్డి, పశ్చిమ జోన్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రెడ్డి, గణేష్, వి.కృష్ణ, ఎంవీవీ సత్యనారాయణ తదితరులు ఫ్లాగ్ మార్చ్ చేశారు. తిరువూరు ఏసీపీ సుంకర మురళీమోహన్ ఆధ్వర్యంలో మైలవరంలో ఈ మార్చ్ సాగింది. నందిగామ ఏసీపీ బి.రవికిరణ్, జగ్గయ్యపేట ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ పుల్లా చంద్రశేఖర్ ఈ సీఐఎస్ఎఫ్ బలగాలతో జగ్గయ్యపేటలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సిటీ డీసీపీ కృష్ణకాంత్ పాటిల్, రూరల్ డీసీపీ కంచి శ్రీనివాసరావు ఫ్లాగ్‌మార్చ్‌ల్లో పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించేంత వరకు పోరాటం

▸▸ రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి శ్రావణ్ నిరవధిక దీక్ష

▸▸ విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్



నాగశ్రావణ్‌కు సంఘీభావం తెలుపుతున్న గద్దె రామ్మోహన్, కొమ్మారెడ్డి పట్టాభిరామ్ తదితరులు

విద్యాధరపురం, మార్చి 3 : విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కరించేంతవరకు తమ పోరాటం ఆగదని తెలుగుయువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారు నాగశ్రావణ్ చెప్పారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోరుతూ ఆటోనగర్‌లోని జిల్లా టీడీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన నిరవధిక నిరాహారదీక్షకు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ వైఖరి కారణంగా విద్యార్థులు ఎంతో నష్టపోతున్నారన్నారు. విద్యార్థుల ఫీజులు చెల్లించలేని ప్రభుత్వం.. సిద్ధం సభలకు రూ.800 కోట్లు ఖర్చుచేయడం దారుణమన్నారు. 2019లో పీజీ చేసిన విద్యార్థులకు జీవో 77 సాకుగా చూపి ఫీజు రీయింబర్స్‌మెంట్ చేయలేదన్నారు. విద్యార్థులకు నష్టం కలిగించే జీవో 77ను రద్దు చేయాలన్నారు. రూ.2750 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం చెల్లించాలన్నారు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, టీడీపీ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌లు శ్రావణ్‌కు సంఘీభావం తెలిపారు. సకాలంలో బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు ఫీజును విద్యార్థులే చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నారని, కళాశాలలకు వెళ్లలేక విద్యార్థులు సతమతమవుతున్నారన్నారు. దీక్షకు టీడీపీ యువత మద్దతు తెలిపింది.

టీడీపీ హయాంలోనే ముస్లింల అభ్యున్నతి

▸▸ దమ్ముంటే రుహుల్లా, వెలంపల్లి చర్చకు రావాలి

▸▸ మైనార్టీలంతా బొండా ఉమా వైపే..

▸▸ ఆయనను భారీ మెజారిటీతో గెలిపిస్తాం: టీడీపీ సెంట్రల్ మైనార్టీ నేతలు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 3: "టీడీపీ ప్రభుత్వ హయాంలో సెంట్రల్ నియోజకవర్గంలో ముస్లింల అభ్యున్నతికి జరిగిన కృషిని ఆధారాలతో సహా నిరూపిస్తాం. దీనిపై దమ్ముంటే ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, వైసీపీ సెంట్రల్ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావులు చర్చకు రావాలి" అని టీడీపీ సెంట్రల్ నియోజకవర్గ మైనార్టీ నేతలు సవాల్ విసిరారు. మూడేళ్ల కాలంలో మైనార్టీలకు ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా ఏం చేశారో చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని టీడీపీ సెంట్రల్ కార్యాల యంలో నియోజకవర్గ మైనార్టీ నేతలు ఆదివారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. శుక్రవారం జరిగిన టీడీపీ- జన సేన విస్తృత సమావేశంలో ముస్లింలకు సరైన ప్రాధాన్యం ఇవ్వలేదని వక్రీకరిస్తూ జగన్ పత్రికలో విషపు రాతలు రాశా రని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలకు వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చకపోవడంతో మైనార్టీలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని వెలంపల్లి గ్రహించి, తన అనుకూల నీలిమీడియాలో అసత్య వార్తలు రాయిస్తు న్నారని టీడీపీ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షుడు అన్వర్, ప్రధాన కార్యదర్శి గౌస్ బాషా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా నియోజకవర్గంలోని మైనార్టీలందరూ బొండా ఉమా వైపు ఉన్నారని రాబోయే ఎన్నికల్లో ఆయనను అత్యధిక మెజారిటీతో గెలిపించు కుంటామని వారు స్పష్టం చేశారు.

ఉద్యోగ నియామకాలు చేపట్టండి

▸▸ నిరుద్యోగ జేఏసీ డిమాండ్



అవనిగడ్డలో నిరసన తెలుపుతున్న ఏపీ నిరుద్యోగ జేఏసీ

అవనిగడ్డ, మార్చి 3 : ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి ఎన్నికలకు వెళ్లాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ అధ్యక్షులు సమయం హేమంత్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏపీ నిరుద్యోగ ఓదార్పు యాత్రలో భాగంగా ఆదివారం అవనిగడ్డలో డీఎస్సీ ఆశావహులతో కలిసి అవనిగడ్డలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మెగా డీఎస్సీ అని నిరుద్యోగులకు ఆశపెట్టి 6100 పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేశారని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేలా మెగా డీఎస్సీ ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రూపు-2 ప్రాథమిక పరీక్షా ఫలితాలను రెండు వారాల్లోపు విడుదల చేస్తే ప్రధాన పరీక్షకు చదువుకోవటానికి సమయం ఉంటుందని, డీఎస్సీ పరీక్ష జరిగే రోజే గ్రూపు-1 ప్రాథమిక పరీక్ష కూడా జరుగనున్నందున దీనిని రద్దు చేయాలని, పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 26 వేల ఉద్యోగాలను డిజిటల్ గ్రంథాలయాల్లో 30800 పోస్టులు భర్తీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అవనిగడ్డలో శిక్షణ పొందుతున్న పలువురు నిరుద్యోగులు కార్యక్రమంలో పాల్గొని ప్లకార్డులు ప్రదర్శించారు.

నేడు, రేపు ప్రతి ఇంటికీ పల్స్ పోలియో బృందం

▸▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గవర్నర్‌పేట, మార్చి 3 : పుట్టిన బిడ్డ మొదలుకొని ఐదేళ్ల లోపు వయసు గల చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలన్న లక్ష్యంతో ఈనెల 4, 5 తేదీల్లో ప్రతి ఇంటినీ సందర్శించి ఏ కారణం చేతనైనా పోలియో చుక్కలు వేయించని చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని నిర్ణయించినట్టు కలెక్టర్ ఢిల్లీరావు అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పల్స్‌పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం సివిల్ కోర్టు సమీపంలోని సీవీఆర్ స్కూల్‌లో కేంద్రంలో కలెక్టర్ ఢిల్లీరావు పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 2.48లక్షల మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ధారించడం జరిగిందన్నారు. 1008 కేంద్రాల ద్వారా చిన్నారులకు పోలియో చుక్కలు వేస్తున్నామని తెలిపారు. బస్టాండ్, రైల్వే స్టేషన్‌లలో 35 కేంద్రాలతో పాటు 71 మొబైల్ వాహనాల ద్వారా పోలియో చుక్కలు వేసేందుకు 4244 మంది వ్యాక్సినేటర్స్‌ను నియమించడం జరిగిందన్నారు. 4, 5 తేదీల్లో ప్రతిఇంటికీ పల్స్ పోలియో బృందం సందర్శిస్తుందని, మిగిలిన పిల్లలకు చుక్కలు వేసేలా చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎం.సుహాసిని, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ అమృత, టీబీ కంట్రోల్ అధికారిణి డాక్టర్ ఉషారాణి, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇందుమతి, సీఎంహెచ్‌వో డాక్టర్ రత్నావళి, డీపీఎంవో డాక్టర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ప్రజావ్యతిరేక పాలనతో విసిగిపోయి..

▸▸ టీడీపీలోకి భారీగా చేరికలు : బొండా ఉమా..




కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్/సత్యనారాయణపురం : సెంట్రల్ నియోజకవర్గంలోని ప్రజలు వైసీపీ ప్రజా వ్యతిరేకపాలనతో విసిగిపోయి తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారని, దీంతో వైసీపీ నేతల్లో ఓటమి భయం పట్టుకుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 61వ డివిజన్‌కు చెందిన వైసీపీ మహిళలు వై.అరుణ, పి.మంగమ్మ, పి.కుమారి, భాగ్యరేఖ, దివ్య, పూజితలతో సహా మొత్తం 200 మంది మహిళలు తెలుగుదేశం పార్టీలో చేరారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని సెంట్రల్ పార్టీ కార్యాలయంలో ఆదివారం బొండా ఉమా వారికి టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ వెలంపల్లి ఓటమి భయంతోనే తనపై ఆధారాలు లేని ఆరోపణలు చేస్తున్నాడని మండిపడ్డారు. త్వరలో సెంట్రల్‌లో వైసీపీ ఖాళీ అవడం ఖాయమని, దమ్ముంటే వెలంపల్లి వలసలను ఆపుకోవాలన్నారు. 27వ డివిజన్ సాంబమూర్తి రోడ్డు బావాజీపేట డీమార్టు వద్ద ఆదివారం ఓర్సు మస్తాన్ ఆధ్వర్యంలో 200మంది తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి బొండా ఉమా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. త్వరలో రాష్ట్రంలో సైకో పాలన పోయి రామరాజ్యం వస్తుందన్నారు. కార్యక్రమంలో బొండా శ్రీను, బొండా సిద్దార్థ, టీడీపీ రాష్ట్రకార్యదర్శి నవనీతం సాంబశివరావు, కార్పొరేటర్ వీరమాచినేని లలిత, కె.రూప్‌కుమార్, డి.వెంకటరావు, కె.ధనశేఖర్, డి.జయరాజు, గోపి, బి.కొండ సురేష్ పాల్గొన్నారు.

టీడీపీ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదు

▸▸ కలిసి పనిచేస్తాం.. ఉమా, బొమ్మసాని



గొల్లపూడి : తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఏశక్తి ఆపలేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు బొమ్మసాని సుబ్బారావులు అన్నారు. ఆదివారం గొల్లపూడిలో ఉమా, బొమ్మసాని కలిసి సంయుక్తంగా మాట్లాడుతూ, మైలవరంలో టీడీపీ గెలుపుకోసం, నారా లోకేశ్ శంఖారావం విజయవంతం చేసేందుకు కలిసి పనిచేస్తామన్నారు. సోమవారం జక్కంపూడి కాలనీలో జరగనున్న 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమాన్ని పార్టీశ్రేణులు విజయవంతం చేయాలని కోరారు. చంద్రబాబు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళతామన్నారు. మరో 50 రోజుల్లో టీడీపీ - జనసేన కూటమి అధికారంలోకి వస్తుందన్నారు. గొల్లపూడి గ్రామ అధ్యక్షుడు నర్రా వాసు, రంగినేని నరేంద్రబాబు, గొరిజాల సాంబశివరావు (చిన్ని) పాల్గొన్నారు.



ముళ్ల కంప చెట్లను తొలగిస్తున్న మహిళలు, రైతులు

కంపచెట్లు నరికి రాజధాని రైతుల నిరసన

● రెండేళ్లైనా అమలుకాని మాండమస్ తీర్పు

● ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా కొడవళ్లు చేపట్టిన అమరావతి మహిళలు, రైతులు

తుళ్లూరు, మార్చి 3: అమరావతి రైతులు, మహిళలు కొడవళ్లు, కత్తులు చేతపట్టారు. రాజధాని నిర్మాణం కోసం భూములిస్తే వాటిని అభివృద్ధి చేయకపోగా అడవిగా మార్చారని, సరిగ్గా రెండేళ్ల క్రితం ఇదేరోజు అమరావతి రైతుల ప్లాట్లను మూడు నెలల్లో అభివృద్ధి చేయాలని, ఆరు నెలల్లో అమరావతి నగర రాజధాని నిర్మాణ పనులను పూర్తి చేయాలని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం ద్విసభ్య ధర్మాసనం మాండమస్ తీర్పునిచ్చింది. అప్పటి నుంచి తీర్పును అమలు చేయకుండా కాలక్షేపం చేస్తున్న సీఎం జగన్‌రెడ్డి వెంటనే దిగిపోవాలంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు ఆదివారం తుళ్లూరు రెవెన్యూలోని వారి ప్లాట్లలో ముళ్ల కంపచెట్లను తొలిగించారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్, రాష్ట్ర రాజధానిని అడవిగా మార్చిన ముఖ్యమంత్రి డౌన్ డౌన్.. పరిపాలన చేతకాని పాలకులు కుర్చీలను వదలండి.. ప్రభుత్వ ఆస్తులను తాకట్టు పెడుతున్న జగన్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలంటూ నినాదాలు చేశారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

ఉంగుటూరు, మార్చి 3: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బైక్‌లు, సెల్‌ఫోన్లను దొంగిలిస్తూ, అప్పుడప్పుడు అక్రమంగా గంజాయిని తరలిస్తూ వచ్చిన డబ్బుతో జల్సాలు చేస్తున్న ఐదుగురు యువకులు, ఒక బాలుడిని ఆత్కూరు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెన్నై-కోల్‌కతా 16వ జాతీయ రహదారిపై పొట్టిపాడు టోల్‌గేట్ వద్ద ఆత్కూరు ఎస్సై ఎ.పైడిబాబు సిబ్బందితో కలిసి శనివారం రాత్రి ఏలూరు నుంచి విజయవాడవైపు వాహనాల తనిఖీ చేపట్టారు. గంజాయి సేవించి అనుమానాస్పద స్థితిలో మూడు బైక్‌లపై వెళ్తున్న విజయవాడకు చెందిన మహమ్మద్ ఫిరోజ్(23), ఉయ్యూరుకు చెందిన అబ్దుల్ బషీద్(24), మహమ్మద్ ఇమ్రాన్ (19), అబ్దుల్ హుస్సేన్ బాజీ(20), షేక్ ఆఫ్రీది(19), మైనర్(18)లను ఆపి తనిఖీ చేశారు. వారివద్ద 300గ్రా. గంజాయి, నాలుగు సెల్‌ఫోన్లతోపాటు ఐదు బైక్‌లు పట్టుబడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఐదుగురిని అరెస్టుచేసి వారిపై ఎన్డీపీఎస్ కేసు నమోదుచేశారు. కాగా మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకుని తదుపరి విచారణ చేపట్టినట్టు ఎస్సై తెలిపారు.

ఏప్రిల్ 18న లలితా సహస్రనామ మహా బృందగానం

విజయవాడ కల్చరల్, మార్చి 3: జయహో భారతీయం, దక్షిణాఫ్రికా-తెలంగాణ అసోసియేషన్ లింక్ పీల్ఫ్ సంస్థల ఆధ్వర్యంలో ఏప్రిల్ 18న 7500 మందితో లలితా సహస్రనామ మహా బృందగానం నిర్వహించనున్నట్లు ఐఆర్ఎస్ అధికారి వి.కోటేశ్వరమ్మ తెలిపారు. నగరంలోని జయహోభారతీయం సంస్థ కార్యాలయంలో ఆదివారం మహా బృందగానం విజయాన్ని కాంక్షిస్తూ మహాచండీహోమం, గణపతిహోమం, నవగ్రహ హోమాలను నిర్వహించారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. భారతీయం సంస్థ లలితా పారాయణంతో పాటు ఏప్రిల్ 28న తెలుగురత్నాలు అవార్డులు ఇవ్వనుంది. నాట్యారామం పేరుతో వెయ్యిమంది కూచిపూడి నృత్యకళాకారులతో బృంద ప్రదర్శనలు చేయనున్నారు. సంస్థ గౌరవాధ్యక్షుడు మండవ శశిధర్‌చౌదరి, అధ్యక్షుడు వల్లేశ్వర్, గోళ్ల నారాయణరావు, వెన్నా వల్లభరావు, గుమ్మా సాంబశివరావు, సుదర్శన్ పాల్గొన్నారు.

చిన్న బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలను ప్రభుత్వం ఆదుకోవాలి

▸▸ యూపీఎస్ఎఫ్ నేతల డిమాండ్

ధర్నాచౌక్, మార్చి 3: రాష్ట్రంలో ప్రైవేట్ విద్యా వ్యవస్థలో చిన్న బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలలు కీలకపాత్ర పోషిస్తున్నాయని, వాటిని ప్రభుత్వం ఆదుకోవాలని అన్ఎయిడెడ్ ప్రైవేట్ స్కూల్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (యూపీఎస్ఎఫ్ ఏపీ) వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రవీణ్ కంటి మహంతి స్పష్టం చేశారు. గాంధీనగర్‌లోని ఓ హోటల్‌లో ఆదివారం నిర్వహించిన ఫెడరేషన్ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న బడ్జెట్ ప్రైవేట్ పాఠశాలల అభివృద్ధి, సంక్షేమానికి సంస్థ కృషి చేస్తోందని అన్నారు. ప్రభుత్వ తీరుతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వేల్పుల సుదర్శన్, పీవీవీ వరప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా వల్ల తీవ్రమైన ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిన చిన్న అత్యల్ప బడ్జెట్ పాఠశాలలను ప్రభుత్వం ఆదుకోవడం లేదన్నారు. తిరుపతిరావు, ఎస్.కె.రత్నం, సీహెచ్ ప్రసాద్ వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

పాయకాపురం, మార్చి 3: కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి ప్రారంభం కానున్న కార్యక్రమానికి జిల్లాలోని అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని సూచించారు. డివిజన్, మండల, గ్రామ వార్డు సచివాలయాల స్థాయిలోను స్పందన నిర్వహిస్తామని, ప్రజలు అర్జీలను గ్రామ, వార్డు సచివాలయం, మండల, డివిజన్ స్థాయిలో అందించాలన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	256
చికెన్ స్కిన్‌లెస్	266

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.63

ఘనంగా ప్రపంచ వన్యజీవ దినోత్సవం

విజయవాడ స్పోర్ట్స్, మార్చి 3 : ఆవార ఈత శిక్షణ - ప్రాణ రక్షణ అకాడమీ ఆధ్వర్యంలో కృష్ణానది తీరాన తాడేపల్లి వారధి నదీ ప్రాంగణంలో ప్రపంచ వన్య జీవ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు,వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో చేరి ఇసుక తిన్నెల మీద పరుగు, పాట, ఆట, మాటా, మంతీ, యోగా చేశారు. ఈ కార్యక్రమాన్ని విజయ డెయిరీ పాల ప్రాజెక్టు రిటైర్డు సీఈవో త్రిపురనేని బాబూరావు ప్రారంభించారు. ఆవార దశాబ్దకాలంగా పర్యావరణ సేవలను, చిన్నారుల వ్యక్తిత్వ వికాసానికి చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పర్యావేరణ వేత ప్రొఫెసర్ అజయ్ కాట్రగడ్డ పాల్గొన్నారు.

మహిళలకు కుక్కర్లు పంపిణీ



కుక్కర్లు పంపిణీ చేస్తున్న పోతిన మహేష్

వన్‌టౌన్, మార్చి 3 : పశ్చిమ నియోజకవర్గంలో 54, 55 డివిజన్‌లకు సంబంధించి డివిజన్ నాయకులు సోము, గోవింద్, సమన్వయకర్తలు సయ్యద్ ముబీనా, ఉప్పల అజయ్, బొంతు గంగాధర్, నసీమా, సల్మా, ఆతుకూరి బాలు, పల్లంటి ఆది తదితరులు ఆధ్వర్యంలో జనసేన కార్యాలయాలను పార్టీ అధికార ప్రతినిధి పోతిన మహేష్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 600 మంది మహిళలకు కుక్కర్లను పంపిణీ చేశారు. రాష్ట్ర కమిటీ, డివిజన్ అధ్యక్షులు, డివిజన్ సమన్వయకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేదోక్తంగా సూర్యోపాసన సేవ

వన్‌టౌన్, మార్చి 3 : ఇంద్రకీలాద్రిపై ఆదివారం సందర్భంగా సూర్యోపాసన సేవను అర్చకులు వేదోక్తంగా నిర్వహించారు. సెలవు రోజు కావడంతో విశేషంగా భక్తులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లను చేశారు. భక్తులు అమ్మవారి ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీ చక్రనవావరణార్చన, సేవలలో పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలనకు అడ్డుకట్ట వేయాలి

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

భారతీనగర్, మార్చి 3 : వైసీపీ అరాచక పాలనను పారదోలి రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు, అభివృద్ధి చేసుకునేందుకు తెలుగు దేశం-జనసేన పార్టీల కలయిక జరిగిందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. తూర్పు నియోజకవర్గ టీడీపీ-జనసేన పార్టీ విస్తృస్థాయి సమావేశం ఆదివారం గురునానక్ రోడ్డులోని ఎన్.ఏ.సి కల్యాణ మండపంలో గద్దె రామ్మోహన్ అధ్యక్షతన జరిగింది. తూర్పు జనసేన ఇన్‌చార్జి అమ్మిశెట్టి వాసు, ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్, టీడీపీ నాయకులు బొప్పన భవకుమార్, కోనేరు శ్రీధర్ పాల్గొన్నారు. గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ. మార్చి 10వ తేదీ లోపల ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందన్నారు. టీడీపీ -జనసేన శ్రేణులు ఈనెల రోజులు సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. జగన్ సంక్షేమ పథకాల కంటే టీడీపీ -జనసేన కూటమి మేనిఫెస్టోలోని పథకాల వల్లే ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ఈ నెల 5వ తేదీ మంగళగిరి నాగార్జున యూనివర్సిటీ వద్ద జరిగే జయహో బీసీ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఎంపీ అభ్యర్థి కేశినేని శివనాథ్(చిన్ని)మాట్లాడుతూ టీడీపీ-జనసేన కూటమిని విచ్చిన్నం చేసేందుకు వైసీపీ సోషల్ మీడియా ద్వారా కుట్రలు పన్నుతూ తప్పుడు వార్తలు ప్రచారం చేస్తోందన్నారు. జనసేన తూర్పు ఇన్‌చారిర్జ అమ్మిశెట్టి వాసు మాట్లాడుతూ.వైసీపీ అధికారంలోకి వస్తే గంజాయిని రోడ్డు మీద బహిరంగంగా విక్రయిస్తారన్నారు. తూర్పులో రౌడీ రాజకీయాలు, దౌర్జన్యాలకు అడ్డుకట్ట పడాలంటే ఎమ్మె ల్యే గద్దె రామ్మోహన్ గెలిపించాలన్నారు. మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్, టీడీపీ నాయకులు కోనేరు శ్రీధర్, బొప్పన భవకుమార్, ఎస్.ఫిరోజ్, సొంగా సంజయ్ వర్మ, నాగేంద్ర రెడ్డి, ఆర్.శ్రీను, జనసేన నాయకులు పోతిరెడ్డి అనిత, పల్లె దుర్గా ప్రసాద్, దోమకొండ అశోక్ మాట్లాడుతూ, తూర్పు నియోజకవర్గంలో గద్దెను గెలిపించి టీడీపీ-జనసేన బలాన్ని చూపించాలన్నారు. చెన్నుపాటి గాంధీ, గుండు శ్రీను, ముమ్మనేని ప్రసాద్, పి.సాయిబాబు, దేవినేని అపర్ణ, చెన్నుపాటి ఉషారాణి, జాస్తి సాంబశివరావు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వకుంటే ఉద్యమం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



నిరసన దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న బాబూరావు

అజిత్‌సింగ్‌నగర్, మార్చి 3 : న్యూ రాజరాజేశ్వరిపేట ఏర్పడి 23 ఏళ్లు గడిచినా నేటి వరకు పేదలకు ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్ చేసి హక్కు పత్రాలు ఇవ్వకపోవడం బాధాకరమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబైరావు విమర్శిచారు. 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరిపేటలో పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్లు చేసి హక్కు పత్రాలు ఇవ్వాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ఆదివారం నిరసన దీక్ష జరిగింది. శిబిరాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ వచ్చే లోపు పేద ప్రజలకు ఇళ్ల పట్టాలు రిజిస్ట్రేషన్లు చేయాలని లేని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

మార్పు కోసం సీపీఎం ఇంటింటి ప్రచారం

పాయకాపురం : ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ పాలనలో ప్రజా ప్రతినిధులు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా తన సొంత ఆస్తులను అభివృద్ధి చేసుకున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు విమర్శించారు. మార్పు కోసం సీపీఎం కార్యక్రమంలో భాగంగా 62వ డివిజన్ ప్రకాష్‌నగర్ ప్రాంతంలో ఆదివారం ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ సెంట్రల్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే సీపీఎంను ఆదరించాలని కోరారు. కె. దుర్గారావు, నాగేశ్వరరావు, లింగాబత్తిన శివకుమార్, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆత్మబంధువు బాలయోగి



బాలయోగి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

రాణిగారితోట, మార్చి 3 : బడుగు బలహీన వర్గాల ఆత్మ బంధువు దివంగత లోక్‌సభ స్పీకర్ జి.ఎం.సి.బాలయోగి కోనసీమ అభివృద్ధికి నిరంతరం కృషి చేశారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. వర్ధంతిని పురస్కరించుకుని బాలయోగి చిత్ర పటానికి పూల మాలవేసి నివాళులర్పించారు. జనసేన నాయకులు అమ్మిశెట్టి వాసు, వేముల దుర్గారావు, రాయి రంగమ్మ, ముని పోలిపల్లి, వీరస్వామి, అదిబాబు తదితరులు పాలొన్నారు.

ప్రజలను మభ్య పెట్టేందుకా సిద్ధం?

ప్రజాపోరుయాత్రలో బీజేపీ నేత డాక్టర్ కిలారు దిలీప్



రామలింగేశ్వర్ నగర్ సమీపంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

పెనమలూరు, మార్చి 3 : సిద్ధం -సిద్ధం అంటూ మరోసారి ప్రజలను మభ్య పెట్టేందుకు రెడీఅయిన సైకో జగన్‌రెడ్డి దేనికి సిద్ధమో తేల్చుకోవాలని బీజేపీ నేత డాక్టర్ కిలారు దిలీప్ ప్రశ్నించారు. ఆదివారం రామలింగేశ్వర్ నగర్ సమీపంలోని స్క్రూ బ్రిడ్జి వద్ద జరిగిన బీజేపీ ప్రజాపోరుయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. సిద్ధం పేరుతో ఇష్టానుసారం విపరీతంగా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసి రోడ్లన్నింటినీ అలంకరించి రాష్ట్ర ప్రజలను ఎమోషనల్‌గా వాడుకునే ప్రణాళికలో భాగమేనని పేర్కొన్నారు. రాష్ట్ర ఆస్తులు కొల్లగొట్టడానికా సిద్ధం...ఏపీ యువతకు జాబ్ లేకుండా చేయడానికా ...రాజధాని లేని రాష్ట్రంగా చేయడానికా సిద్ధం..అని ప్రశ్నించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

పీబీ సిద్ధార్థలో ఎన్‌సీసీ సర్టిఫికెట్ పరీక్షలు



పరీక్షల్లో పాల్గొన్న కేడెట్‌లు

మొగల్రాజపురం, మార్చి 3 : పీబీ సిద్దార్థ కళాశాలలో ఆదివారం ఎన్‌సీసీ సి సర్టిఫికెట్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని వివిధ కళాశాలల క్యాడెట్‌లు వేయి మంది పరీక్షలకు హాజరయ్యారు. డ్రిల్ టెస్ట్, కమ్యూనికేషన్, మ్యాప్ రీడింగ్, వెపన్ టెస్ట్ జరిగాయి. కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ బల్వీందర్ సింగ్, లెఫ్టినెంట్ కల్నర్ రవి సునహరే, రాజేష్ యాదవ్, కల్నల్ సంజీవ్ గుప్తా పర్యవేక్షించారు. లెఫ్టినెంట్ డాక్టర్ రోహిణి కుసుమ, లెఫ్టినెంట్ విజయ్, సబ్ లెఫ్టినెంట్ వెంకటేష్, ఇతర కళాశాలల అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు పర్యవేక్షించారు.

బావిశెట్టి భానుకు ఘన నివాళి



భాను సంస్మరణ సభలో పాల్గొన్న వెంకన్న, కేశినేని శివనాథ్, నాగుల్‌మీరా

వన్‌టౌన్, మార్చి 3 : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, ఉత్తరాంధ్ర జిల్లా ఇన్‌చార్జి బుద్దా వెంకన్న అనుచరుడు బావిశెట్టి భాను సంస్మరణ సభ వన్‌టౌన్‌లోని బుద్దా వెంకన్న కార్యాలయంలో ఆదివారం జరిగింది. పలువురు నాయకులు బావిశెట్టి భాను ఆకస్మిక మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని ఆకాంక్షించారు. కుటుంబసభ్యులకు సానుభూతి ప్రకటించారు. భాను కుటుంబ సభ్యులకు తాను అండగా ఉంటానని బుద్దా వెంకన్న పేర్కొన్నారు. భాను సంస్మరణ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని), తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే గద్దె రామ్‌మోహన్, పోలీస్ అవుట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఛైర్మన్ నాగుల్ మీరా తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు డీసీపీ కౌన్సెలింగ్



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీ కృష్ణకాంత్ పాటిల్

వన్‌టౌన్, మార్చి 3 : వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలోని రౌడీషీటర్లకు డీసీపీ కృష్ణకాంత్ పాటిల్ ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీపీ కాంతి రాణా తాతా ఆదేశాల మేరకు పశ్చిమ డివిజన్‌లోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్ సౌత్ డివిజన్‌లోని కృష్ణలంక పోలీసుస్టేషన్, నార్త్ డివిజన్‌లోని సింగ్‌నగర్ పోలీసు స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లకు డీసీపీ కౌన్సెలింగ్ ఇచ్చారు. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు మంచినడవడికతో ఉండాలన్నారు. నేరాలు చేయరాదన్నారు. ఎటువంటి కేసుల్లో ప్రమేయం ఉన్నా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వంటి అంశాలకు దూరంగా ఉండాలన్నారు. ఎవరైనా గొడవలు, నేరాలలో పాల్గొంటే ఇబ్బందులకు గురికాక తప్పదన్నారు. ఆయా డివిజన్ల పరిధిలోని ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపండి



ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న పోతిన విజయలక్ష్మి

భవానీపురం, మార్చి 3 : అవినీతి, అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని ఎన్నికల్లో సాగనంపడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి పోతిన మహేష్ సతీమణి విజయలక్ష్మి అన్నారు. 43వ డివిజన్ పోలేరమ్మగుడి ప్రాంతంలో ఇంటింటికి రాబోయే మన జనసేన ప్రభుత్వం కార్యక్రమంలో డివిజన్ నాయకులతో కలిసి ఆమె ఆదివారం పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జనసేన-టీడీపీ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చి వైసీపీని ఇంటికి పంపాలని విజయలక్ష్మి ప్రజలను కోరారు. డివిజన్ అధ్యక్షుడు జెల్లి రమేష్, సోమశేఖర్, కాశీ, మాకిన శ్రీను, దుండి సాయి,శ్రీదేవి, వాసు నాయుడు, రమేష్, మెకానిక్ రమేష్, మల్లెపు విజయలక్ష్మి, శివ, రెడ్డిపల్లి అనిత, ఏలూరు సాయి శరత్, నూకరాజు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలే పార్టీల ఎజెండా కావాలి

ధర్నాచౌక్, మార్చి 3 : ప్రజా సమస్యలే ఎన్నికల ఎజెండా కావాలని, మత తత్వవాదులకు అవకాశం ఇవ్వరాదని పలువురు వక్తలు పిలుపునిచ్చారుర. యునైటెడ్ ఫోరమ్ ఫర్ డెమొక్రసీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో రాష్ట్రస్థాయి సమావేశం ఆదివారం జరిగింది. ముస్లిం నేత జనాబ్ మాలిక్ మొఅతసిమ్ ఖాన్ మాట్లాడుతూ నేటి పాలకులు ప్రాంతాలు, మతాల మధ్య విద్వే షాలు నింపడం, వ్యవస్థలను విధ్వంసం చేయడం లాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు సామాజిక, రాజకీయ చైతన్యం కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని, లేదంటే మతతత్వ శక్తులు బలపడతాయన్నారు. పలువురు వక్తలు మాట్లాడుతూ దేశాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాల్సిన అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. రాజకీయాలు మతం చుట్టూ తిరుగుతుంటే దేశాభివృద్ధి అసాధ్యమన్నారు. ఈ సందర్భంగా ఫోరమ్ తరఫున ప్రజా మ్యానిఫెస్టో విడుదల చేశారు. మ్యానిఫెస్టోలోని అంశాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు న్యాయవాది పిచ్చుక శ్రీనివాస్, ఫోరమ్ రాష్ట్ర కార్యదర్శి మతీన్, న్యాయవాది రిజ్వాన్, రమేష్ పట్నాయక్, పాస్టర్ శ్రీనివాస్, హాఫీజ్ మస్తాన్ షరీఫ్, మౌలానా సమి ఉజ్మమా, రాజకీయ విశ్లేషకుడు ఎం.షరీఫ్, జమాత్ అధ్యక్షుడు రఫీజ్ తదితరులు ప్రసంగించారు.

పల్స్ పోలియో విజయవంతం

దుర్గగుడిలో పిల్లలకు పోలియో చుక్కలు



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ రాంబాబు

వన్‌టౌన్, మార్చి 3 : దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు ఛైర్మన్ కర్నాటి రాంబాబు చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. **గవర్నర్‌పేట :** సీవీఆర్ మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కార్యక్రమంలో కార్పొరేటర్, వీఎంసీ ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి పాల్గొన్నారు. చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. 98వ సచివాలయం హెల్త్ సెక్రటరీ అరుణ పాల్గొన్నారు. **భారతీనగర్ :** ఐదు సంవత్సరాల లోపు చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు రెండు పోలియో చుక్కలు వేయించాలని కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ గల్లా పద్మావతి అన్నారు. నాల్గో డివిజన్ వరలక్ష్మీనగర్ కమ్యూనిటీ హాల్, గురునానక్ కాలనీ రామాలయం, ఏపీఐఐసీ కాలనీలో కల్యాణ మండపంతో పాటు ప్రధాన సెంటర్లలో కార్పొరేషన్ ఆర్యోగ శాఖ ఆధ్వర్యంలో పల్స్‌పోలియో కార్యక్రమం జరిగింది. గురునానక్ కాలనీ రామాలయం వద్ద కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ గల్లా పద్మావతి చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. శానిటరీ అధికారులు, ఆరోగ్యశాఖ అధికారి బాలకుమారి, ఆరోగ్యశాఖ సిబ్బంది రమా, గంగారత్నం పాల్గొన్నారు. **భవానీపురం :** 43వ డివిజన్ సిద్ధం కృష్ణారెడ్డి స్కూల్‌లో అత్యధికంగా 550 మందికి ఆశా వర్కర్లు ఆదివారం చుక్కల మందు వేశారు. ఊర్మిళానగర్, రెడ్డికాలనీ చిన్నారులకు చుక్కల మందు వేయించారు. వైసీపీ డివిజన్ అధ్యక్షుడు కంది శ్రీనివాసరెడ్డి, దూది బ్రహ్మయ్య, కనకం రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.



సీవీఆర్ స్కూల్‌లో..



ఏపీఐఐసీ కాలనీలో పోలియో చుక్కలు వేస్తున్న ఆరోగ్య శాఖ సిబ్బంది



అందం అంటే ఆత్మవిశ్వాసం

మోడల్ కావాలి, ర్యాంప్ మీద నడవాలి... ఇది థ్రేసియా స్టెల్లా జీవితాశయం. కానీ నల్లగా, సన్నగా ఉండే ఆమెకు వెక్కిరింతలు, ఈసడింపులు, బాడీ షేమింగ్... నిత్యానుభవాలు. "అందం అంటే ఆత్మవిశ్వాసం. ఇదీ నా నమ్మకం" అంటున్న థెర్సియా అవరోధాలెన్నిటినో అధిగమించి... ఇటీవలి 'గోల్డెన్ ఫేస్ ఆఫ్ సౌతిండియా' పోటీలో రన్నరప్‌గా నిలిచారు. తన లక్ష్యం దిశగా బలమైన అడుగు వేసిన థ్రేసియా కథ ఆమె మాటల్లోనే...



"అవి 'గోల్డెన్ ఫేస్ ఆఫ్ సౌతిండియా - 2024 ఫైనల్స్. నాతో సహా 29 మంది పోటీ పడుతున్నాం. మొదటి రౌండ్‌లో... సంప్రదాయ దుస్తులతో స్వీయ పరిచయం చేసుకోవాలి. తరువాత ప్రశ్నోత్తరాల రౌండ్ ఉంటుంది. నన్ను ఆన్‌లైన్ డేటింగ్ యాప్స్ గురించి ప్రశ్న అడిగారు. నేను సమాధానం ఇచ్చాక... కాసేపటి వరకూ చప్పట్లు ఆగలేదు. స్టేజ్ దిగి వస్తున్నాను. న్యాయనిర్ణేతలుగా ఉన్న అమీ జాక్సన్, శ్రియా శరణ్ పక్క నుంచి నేను వెళ్తుండగా... "షీ ఈజ్ అమేజింగ్" అని వారు అనడం వినిపించింది. నా ఒళ్ళు జలదరించింది. 'ఈ పోటీలో గెలుస్తానో లేదో నాకు అనవసరం. ఈ సెలబ్రిటీలకు నేను నచ్చాను. ఇది చాలు' అనుకున్నాను. కొంతసేపటికి విజేతలను ప్రకటిస్తూ... నేను రన్నరప్ అని చెప్పినప్పుడు... కన్నీరు ఆగలేదు. అంత భావోద్వేగాన్ని నా జీవితంలో ఎన్నడూ అనుభవించలేదు. నా మొత్తం జీవిత ప్రయాణం ఒక్కసారిగా ఆ క్షణంలో కళ్ళ ముందు మెదిలింది.

చదువు మానేద్దామనుకున్నాను...

నేను పుట్టి పెరిగింది కేరళ రాష్ట్రం తిరువనంతపురం జిల్లాలోని పుల్లువిలా. మాది ఆర్థికంగానూ, సామాజికంగానూ వెనుకబడిన మత్స్యకార కుటుంబం. నాకు ఊహ తెలిసినప్పటి నుంచీ ఈసడింపులు, వెక్కిరింతలు ఎదురవని రోజు లేదు. కారణం... నేను బాగా నల్లగా, సన్నగా ఉండడం. తరగతి గదిలో, వీధిలో ఎవరూ నా పేరు పెట్టి పిలిచేవారు కాదు. నాతో కలిసేవాళ్ళు కాదు. హైస్కూల్లో, కాలేజీలో చదువుతున్నప్పుడు తీవ్రమైన బాడీషేమింగ్‌కు గురయ్యాను. అందరూ నన్ను వెలివేసినట్టు చూసేవారు. నేను ఏడ్చేదాన్ని. ఇంటికి వచ్చి అమ్మతో చెప్పేదాన్ని. చదువు మానేద్దామని ఎన్నో సార్లు అనుకున్నాను.



 "నువ్వు నీ గురించి, నీ జీవితం గురించి ఆలోచించు. ఎవరో ఏదో అన్నారని... ఎప్పుడూ అదే ఆలోచిస్తూ ఉంటే... కుంగిపోవడం తప్ప ప్రయోజనం ఉండదు" అని మా అమ్మ నచ్చజెప్పేది. ప్రతి ఒక్కరూ వెలి వేస్తున్న చోట నన్ను నేను ఎలా నిరూపించుకోవాలి? కష్టపడి చదివేదాన్ని. స్కూల్లో, కాలేజీలో ఫస్ట్ ర్యాంకర్ని. మరోవైపు సాంస్కృతిక పోటీల్లో, ఆటల పోటీల్లో ప్రతిసారీ నాకు ప్రైజ్ రావాల్సిందే. అందరూ నాలో చూస్తున్న 'రంగు' అనే (వారి దృష్టిలో) లోపాన్ని నా ప్రతిభతో అధిగమించడానికి ప్రయత్నించేదాన్ని. అయితే నాకూ, మా అమ్మకూ మాత్రమే తెలిసిన సంగతి ఒకటుంది. నేను బాల్యం నుంచి కలలుగన్న ప్రొఫెషన్ మోడలింగ్. టీవీలో ఫ్యాషన్ షోలు చూస్తూ దాని మీద ఆసక్తి పెంచుకున్నాను. ర్యాంప్ మీద నడిచే మోడల్స్ ను చూసి... వారిని అనుకరించడానికి ప్రయత్నించేదాన్ని. మన చిన్ననాటి అభిరుచులు పెరిగి పెద్దయ్యాక మారిపోతూ ఉంటాయి. కానీ నా విషయంలో అలా కాదు. మోడలింగ్ మీద నా ఇష్టం నానాటికీ బలపడుతూ వచ్చింది. అయితే మా ఇంట్లో నేను మోడల్ కావడం ఏమాత్రం ఇష్టం లేదు. మోడలింగ్ అంటే వాళ్ళ దృష్టిలో పొట్టిపొట్టి దుస్తులు వేసుకోవడం. ఆ భావన తప్పని ఎన్నిసార్లు వివరించినా వాళ్ళ ధోరణిలో మార్పు రాలేదు. అలాగే ఈ సమాజంలో తెల్లటి రంగు లేదా డబ్బు ఉన్నవాళ్ళకే మర్యాద అనేది నా అనుభవం. కాబట్టి నా దృష్టంతా చదువుమీదే కేంద్రీకరించాను. ఇంజనీరింగ్ పూర్తి చేశాను. ఒక మెడికల్ కంపెనీలో చేరాను. కానీ నా ఆలోచనలన్నీ మోడలింగ్‌పైనే. చిన్న చిన్న మోడల్ ఏజెన్సీలను సంప్రతించేదాన్ని. ఫొటోషూట్స్ కోసం ప్రయత్నించేదాన్ని. ఉద్యోగం చేసే చోట... నా రంగు వల్ల చేదు అనుభవాలు ఎదురుకాలేదని చెప్పను కానీ... చాలా తక్కువ. ఆర్థిక స్థాయి, రంగు లాంటి వాటికన్నా సామర్థ్యానికి విలువ ఇచ్చేవారే నాకు ఎక్కువ తటస్థపడ్డారు. వారిలో చాలామంది స్నేహితులయ్యారు. మోడలింగ్ కోసం నేను చేస్తున్న ప్రయత్నాలు తెలిసి... వివిధ కేటగిరీల్లో జరిగే పోటీలకు హాజరయ్యేలా ప్రోత్సహించారు. నాకు చిన్నప్పటి నుంచీ స్టేజ్ ఫియర్ లేదు. రంగువల్ల నాకు కొత్తగా ఎదురయ్యే అవమానాలేవీ లేవు. కాబట్టి చిన్న చిన్న పోటీల్లో పాల్గొన్నాను. దీనికోసం నేను ఎక్కడా శిక్షణ పొందలేదు, ఎవరి సలహాలూ తీసుకోలేదు. నా ఆత్మవిశ్వాసంతోనే ప్రతి చోటా నిలబడ్డాను. సొంతంగా ఫొటోలు తీసుకొని, వీడియోలు చేసి సామాజిక మాధ్యమాల్లో ఉంచేదాన్ని. వాటివల్ల అనేక సర్కిల్స్ నన్ను గుర్తించడం ప్రారంభించాయి.

స్నేహితులే అండగా నిలిచారు..

ఈ క్రమంలోనే 'గోల్డెన్ ఫేస్ ఆఫ్ సౌత్ ఇండియా' పోటీకి ఆడిషన్ జరుగుతుందని ఇన్‌స్టాగ్రామ్‌లో చూశాను. అప్పటివరకూ నేను జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకే హాజరయ్యాను. ఇది దక్షిణ భారతదేశ స్థాయిది కాబట్టి ఆసక్తిగా అనిపించి... అప్లై చేశాను. కొచ్చీలో ఆడిషన్స్‌కు వెళ్లి ఎంపికయ్యాను. కానీ పోటీలో పాల్గొనాలంటే రిజిస్ట్రేషన్ ఫీజుగా ముప్ఫైవేలు కట్టాలన్నారు. మాది పెద్ద కుటుంబం. ఇంటికి నా జీతమే ఆధారం. ఒకేసారి ముప్ఫై వేలు ఇచ్చే స్థోమత నాకు లేదు. ఆ సంగతే నిర్వాహకులకు చెప్పాను. "వారం రోజులు టైముంది. ఆలోచించుకోండి" అన్నారు. ఇక ఆ పోటీ సంగతి మరచిపోదామని నిర్ణయించుకున్నాను. ఆఫీసులో నా కొలీగ్ అశ్విని నా ఆడిషన్ గురించి అడిగింది. మహారాష్ట్రకు చెందిన ఆమె నాకు మంచి స్నేహితురాలు కూడా కావడంతో... వివరాలు చెప్పాను. "ఆ డబ్బు నేనిస్తాను. లెక్కలు తరువాత చూసుకుందాం. వద్దంటే ఊరుకోను" అంటూ... నాతో రిజిస్టర్ చేయించింది. ఆ తరువాత పోటీకి అవసరమైన దుస్తుల కోసం కాలేజీ ఫ్రెండ్ ఒకరు సాయం చేశారు. నేను బస చేయడానికి, వీడియోలు తీసే సామర్థ్యం ఉన్న ఫోన్ కొనుక్కోడానికి... ఇలా ప్రతిదానికీ నా స్నేహితుల ప్రోత్సాహం, సహకారం ఉన్నాయి. నా గెలుపులో వారికీ భాగం ఉంది.

చెన్నైలో పోటీ జరిగే చోటుకు చేరుకున్న తరువాత... వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన అమ్మాయిలను చూడగానే... 'ఈ పోటీలో నేను గెలవగలనా?' అనే సందేహం వచ్చింది. కానీ వెంటనే నా సంకోచాలన్నీ పక్కకు నెట్టేశాను. పోటీలో ధైర్యంగా పాల్గొన్నాను. ఎర్నాకుళానికి చెందిన అమ్మాయి విన్నర్ అయితే... నేను ఫస్ట్ రన్నరప్‌గా... అంటే రెండో స్థానంలో నిలిచాను. సెలబ్రిటీల ప్రశంసలు అంతకుమించిన ఆనందాన్ని ఇచ్చాయి. ఇప్పుడు 'ఫెమీనా' లాంటి ప్రతిష్ఠాత్మక సంస్థలు నిర్వహించే అందాల పోటీల్లో పాల్గొనడానికి సిద్ధమవుతున్నాను. తెల్లటి మేని రంగే అందం అనేది సమాజంలో ఎక్కువశాతం మంది అభిప్రాయం. అయితే క్రమంగా మార్పు వస్తోందని గట్టిగా చెప్పగలను. నా లక్ష్య సాధన దిశలో ఈ విజయం తొలి అడుగు. నా అనుభవంతో నేను చెప్పేది ఒక్కటే... మీకు కల ఉంటే, దాన్ని నెరవేర్చుకోవడానికి కష్టపడండి. సంకల్పం ఉంటే... ఎలాంటి సంక్షోభం మిమ్మల్ని ఏమీ చెయ్యలేదు."

తెలుగులో తొలి బంజారా పీహెచ్‌డీ నాదే

గిరిజన తండాలో పుట్టిపెరిగిన సూర్యా ధనంజయ్ ఉస్మానియా విశ్వవిద్యాలయం సీనియర్ ప్రొఫెసర్‌గా ఎదిగిన తీరు మహిళా లోకానికి స్ఫూర్తి పాఠం. పెళ్లితో ఆగిన చదువును తన భర్త ధనంజయ్ ప్రోత్సాహంతో పూర్తిచేసి స్వయంకృషి, పట్టుదలకు ప్రతిరూపంగా నిలిచారు. ఆమె పర్యవేక్షణలో ఇరవైకుపైగా పీహెచ్‌డీలు వెలువడటం బోధనా రంగంలో అరుదైన విషయం. "బంజారా భాషా సాహిత్యాల అభివృద్ధే నా లక్ష్యం" అంటున్న ప్రొఫెసర్ సూర్య విద్యార్థి, ఉద్యోగ జీవిత ప్రస్థానంలోని కొన్ని విశేషాలను 'నవ్య'తో చెబుతున్నారిలా.!

"ప్రతిష్ఠాత్మక ఉస్మానియా విశ్వవిద్యాలయంలో మొట్టమొదటి బంజారా మహిళా ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తుండటం ఒకెత్తు అయితే, నా పర్యవేక్షణలో ఇరవైకి పైగా పీహెచ్‌డీలు, మూడు పోస్టు డాక్టోరల్ డిగ్రీలు వెలువడటం మరొక ఎత్తు. ఒక గిరిజన తండా నుంచి వచ్చిన నాకు సగటు విద్యార్థి ఎదుర్కొనే కష్టాలన్నీ తెలుసు కనుక నా విద్యార్థులతో నేను మాత్రం ఆధిపత్య ధోరణితో వ్యవహరించకూడదని ఈ వృత్తిలోకి అడుగుపెట్టిన తొలి రోజే నిశ్చయించుకొన్నాను. పిల్లల అభిరుచి మేరకే పరిశోధనాంశాలను ఎంపిక చేసుకొనే అవకాశమిచ్చాను. నా అభిప్రాయాలను ఎన్నడూ వాళ్ల మీద రుద్దలేదు. కనుకనే ఎరుకల, చెంచు, మాదిగ, మైనార్టీ... ఇలా విస్మృతికి లోనైన అణగారిన వర్గాల సాహిత్యం మీద పీహెచ్‌డీ పరిశోధనలు వెలుగుచూశాయి. తెలంగాణ పాట, ఈగ బుచ్చిదాసు సంకీర్తనలు తదితర వైవిధ్యభరితమైన అంశాలమీద నా విద్యార్థులు అధ్యయనం చేశారని చెప్పడానికి గర్విస్తున్నాను. 'పంచమహాకావ్యాల్లో స్త్రీ పాత్రలు' లాంటి ప్రాచీన సాహిత్యాంశాలమీదా నా పర్యవేక్షణలో పరిశోధనలు వచ్చాయి. బంజారా సాహిత్యం మీద తెలుగులో పీహెచ్‌డీ పరిశోధన చేసిన మొట్టమొదటి మహిళను నేనే. తద్వారా మా సంస్కృతి, జీవన విధానాన్ని బయట ప్రపంచానికి పరిచయం చేయగలిగానన్న తృప్తి నాకుంది.

తెలుగు సాహిత్యంతో పరిచయం...

మాది నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలంలోని భల్లూ నాయక్ తండా. పదిమంది పిల్లల్లో నేను తొమ్మిదో సంతానం. వ్యవసాయం జీవనాధారమైన మాకు పేదరికం కూడా వెన్నంటే ఉండేది. నేను పుట్టినప్పుడు.. 'మళ్లీ ఆడపిల్లే... వడ్లగింజో, సారాచుక్కో పోస్తే సరి' అని బంధువులు సలహా ఇచ్చారట. దానికి ఒప్పుకోని మా అమ్మానాన్న నన్ను ఉన్నంతలో అపురూపంగానే పెంచారు. మా నాన్న భల్లూ నాయక్‌కు చదువంటే ఇష్టం. ఆయన చొరవతోనే మా తండాలో ఒక పూరిపాకలో ఏకోపాధ్యాయ పాఠశాల ప్రారంభమైంది. నాకు నాలుగేళ్ల వయసప్పుడు మా నాన్న అనారోగ్యంతో కన్నుమూశారు. ఆ తర్వాత కొద్ది రోజులకు ఆ బడి కూడా మూతపడింది. దాంతో ఏడేళ్లు కూడా లేని నేను రోజూ ఏడు కిలోమీటర్లు కాలినడకన చదువుకోడానికి మరో తండాకు వెళ్లేదాన్ని. ఆరో తరగతికి మా అక్క కూతురితో కలిసి మిర్యాలగూడ బాలికల పాఠశాలలో చేరాను. అప్పుడు స్థానిక ఎస్సీ హాస్టల్‌లో ఉండేవాళ్లం. మా పాఠశాలలో వెయ్యిమంది విద్యార్థినులుంటే అందులో మేమిద్దరమే బంజారా అమ్మాయిలం. మా మాతృభాష బంజారా అయినా, తెలుగు మాధ్యమంలో నా చదవు సజావుగా సాగడానికి ఉపాధ్యాయులు బాగా ప్రోత్సాహించారు. మా వసతిగృహంలో రోజూ రాత్రిపూట అమ్మాయిలమంతా ఒకచోట చేరి కథలు, నవలలు కలిసి చదివేవాళ్లం. అలా నాకు తెలుగు సాహిత్యంతో సాన్నిహిత్యం ఏర్పడింది. ఆ అభిరుచే నన్ను ఇవాళ ఈ స్థానంలో నిలిపిందేమో.

నా భర్తతోనే నాకు అస్తిత్వ స్పృహ...

నా అసలు పేరు సూర్య. పెళ్లి అయ్యాక పేరు చివర ధనంజయ్ చేరింది. 'పేరు చివర మొగుడి పేరు తగిలించుకొన్నావు. నీకంటూ సొంత అస్తిత్వం లేదా' అని కొందరు హేళనగా మాట్లాడుతుంటారు. బలమైన కుటుంబ నేపథ్యముండి, ఉన్నత చదువులు చదివి కూడా భార్యను వంటింటికే పరిమితం చేస్తున్న మగవాళ్లు మనచుట్టూ బోలెడుమంది కనిపిస్తారు. అలాంటిది తండా నుంచి వచ్చిన నా భర్త ముప్ఫై ఏళ్ళ కిందట నేను చదువుకోడానికి, తద్వారా స్వావలంబన సాధించడానికి అడుగడుగునా అండగా నిలిచి నన్ను ముందుకు నడిపించారు. నా భర్త ధనంజయ్‌తోనే నాకు అస్తిత్వ స్పృహ కలిగిందని నమ్ముతాను. ఆయన ప్రోత్సాహం లేనిదే భల్లూ నాయక్, ధాళీబాయిల బిడ్డ సూర్య... ప్రొఫెసర్ సూర్యగా ఎదిగేది కాదు. మాకు ఇద్దరబ్బాయిలు, ఒక అమ్మాయి. చిన్న అబ్బాయి నెదర్లాండ్‌లో ఎల్‌ఎల్‌ఎమ్ చేస్తున్నాడు. పెద్దబ్బాయి సాఫ్ట్‌వేర్ రంగంలో స్థిరపడ్డాడు. అమ్మాయి మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం చేస్తూ, ఓయూ ఇంజనీరింగ్ కళాశాలలో రోబాటిక్స్ మీద పీహెచ్‌డీ చేస్తోంది. నా చదువును ప్రోత్సహిస్తూ, ధనంజయ్ కూడా జియాలజీ, న్యాయశాస్త్రాలలో పీహెచ్‌డీ చేశారు. కమర్షియల్ ట్యాక్స్ డిపార్టుమెంట్‌లో అసిస్టెంట్ కమిషనర్‌గా పదవీ విరమణ చేశారు. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు లాయర్‌గా ప్రాక్టీసు చేస్తున్నారు.

డిస్టెన్స్‌లో డిగ్రీ...

మా తండాలో అమ్మాయిలకు పన్నెండేళ్లలోపే పెళ్లి చేయడం ఆనవాయితీ. నేనా ఊరు దాటివెళ్లి చదువుతున్నాను. దాంతో ఇరుగు పొరుగు వారంతా అమ్మను 'పిల్లకు పెళ్లెప్పుడు చేస్తావు' అని సూటిపోటిమాటలతో పొడవసాగారు. నన్ను బాగా చదివించాలి అనుకున్న అమ్మకు నిర్ణయం మార్చుకోక తప్పలేదు. ఇంటర్ మొదటి సంవత్సరంలో ఉండగా నాకు ధనంజయ్ నాయక్‌తో వివాహమైంది. 'నా కూతురిని చదివించాలి' అని అమ్మ ఆయన దగ్గర ముందే మాట తీసుకొన్నదట. అప్పుడు ధనంజయ్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎమ్మెస్సీ జియాలజీ చదువుతున్నారు. పెళ్లి తర్వాత వెంటనే పిల్లలు, కుటుంబ బాధ్యతలతో నా చదువుకు బ్రేక్ పడింది. ఆయనకు పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి అవ్వగానే, ఉస్మానియాలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా ఉద్యోగం వచ్చింది. అయితే, ఇక నా చదువు అటకెక్కిందనుకొన్న సమయంలో, ధనంజయ్ ప్రోత్సాహంతో అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ డిగ్రీలో చేరాను. ప్రతి ఆదివారం తరగతులకు వెళితే, పిల్లల ఆలనాపాలనా ఆయన చూసేవారు. పరీక్షల సమయంలోనూ ఇంటి బాధ్యతలన్నీ తానే చూసుకొనేవారు. నా చదువుకు తొలి ప్రాధాన్యత ఇచ్చేవారు. నాకు అర్థం కానివి చెబుతూ, దగ్గర కూర్చొబెట్టుకొని మరీ చదివించేవారు. అలా మంచి మార్కులతో డిగ్రీ పట్టా అందుకున్నాను.



చదవలేనన్నాను...

నేను పోస్టుగ్రాడ్యుయేషన్ మాత్రం రెగ్యులర్‌గా చేయాలనేది నా భర్త సంకల్పం. దాంతో కోఠి మహిళా కాలేజీలో ఎమ్మే తెలుగులో చేరాను. తెలుగు అంటే ఏదో రోజూ మనం చదివేది, మాట్లాడేదే కదా. సులభంగా ఉంటుందనుకొన్నా. తీరా నాలుగు రోజులు గడిచాక 'వ్యాకరణం' ఎంత కష్టమో అర్థమైంది. ఇంటికొచ్చి నా వల్లకాదు అన్నాను. 'కష్టంగా ఉందని వదిలేస్తే, ఇష్టమైన జీవితాన్ని పొందలేమని' ధనంజయ్ నాకు కౌన్సెలింగ్ ఇచ్చారు. అప్పుడు మేమూ ఓయూ క్వార్టర్స్‌లోనే ఉండేవాళ్లం. మా ఇంటి పక్కనే ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, మరో వైపు తంగెడ కిషన్‌రావు, ఇంకో వైపు రుకునుద్దీన్ లాంటి తెలుగు పండితులుండేవారు. అలాంటి అరుదైన అవకాశాన్ని సద్వినియోగపరుచుకోమని సూచించారు. రోజూ కాలేజీ నుంచి వచ్చిన తర్వాత కసిరెడ్డి వెంకటరెడ్డి సర్ దగ్గరకెళ్లి వ్యాకరణం పాఠాలు చెప్పించుకొనేదాన్ని. తర్వాత గురువుగారి సహ అధ్యాపకురాలిగా నేను చదివిన కోఠి మహిళా కళాశాలలోనే చేరడం జీవితంలో మరిచిపోలేని ఒక మధురానుభూతి. నాకు ఎంఫిల్, పీహెచ్‌డీలలో పర్యవేక్షకుడిగా ఉన్న ఆచార్య మసన చెన్నప్పతో పాటు సినారె, ఆచార్య ఎన్ గోపీ తదితర పెద్దల సహకారం మరిచిపోలేనిది. వారంతా నన్ను కూతురిలా భావించి ప్రోత్సహించారు. అలాంటి గొప్ప ఆచార్యులు, పండితులు పరిచయం కావడం నా అదృష్టం.

రామాయణాల్లోని ఆశ్రమాలు...

మారుమూల తండాలో పుట్టి పెరిగిన నేను ఎమ్మే తెలుగులో పట్టా పొందాను. నా మాతృభాష బంజారా అయినా.. 'రామాయణం అరణ్యకాండలోని ఆశ్రమాలు- శ్రీరాముని దర్శనాలు' అంశంమీద ఎంఫిల్ పరిశోధన చేశాను. అందుకు శ్రీవాల్మీకి 'రామాయణం' సంస్కృతం, గోన బుద్ధారెడ్డి 'రంగనాథ రామాయణం', మొల్ల 'రామాయణం' చదివాను. అందులో శ్రీరాముడు సందర్శించిన ఆశ్రమాలు, వాటి స్థితిగతులు, మహర్షులు, విద్యా వాటికలు... లాంటి సునిశిత అంశాలను థీసెస్‌లో రాశాను. ప్రాచీన సాహిత్యం మీద కొంతవరకు సాధికారత సాధించగలిగాను. అది నేను పొందిన విజయం అనుకొంటాను. అమెరికా ఫోక్లోర్ సొసైటీ ఆహ్వానం మేరకు అక్కడికెళ్లి 'బంజారాల వస్త్ర, ఆభరణాల ప్రాముఖ్యత' మీద పత్ర సమర్పణ చేశాను. మా తండా జీవితాలు ఇతివృత్తంగా కథలు, నానీలు, కవిత్వం... ఇలా పదికిపైగా పుస్తకాలు రాశాను. ఇరవైకుపైగా పుస్తకాలకు సంపాదకత్వం వహించాను. తద్వారా మా వాళ్ళ గొంతుకను వినిపిస్తున్నాను. తెలుగు సాహిత్య చరిత్రలో బంజారా సాహిత్యాన్ని నమోదు చేయగలిగాను. తెలంగాణ ప్రభుత్వం నుంచి 'ఉమెన్ అచీవర్ అవార్డు అందుకొన్నాను.

అదే నా ఆశయం..

నాకు ధాళీబాయి జన్మనిస్తే... ఆగిన నా చదువు తిరిగి కొనసాగేలా అవకాశమిచ్చిన డాక్టర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం పునర్జన్మనిచ్చింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం జీవితాన్నిచ్చింది. గిరిజన సాహిత్య అధ్యయన కేంద్రాన్ని నెలకొల్పాలి. తద్వారా చరిత్రలో నమోదు కాని సంచార, గిరిజన సాహిత్యాన్ని వెలుగులోకి తేవాలి. బంజారా భాషా సాహిత్యాల అభివృద్ధికి కృషి చేయాలి అన్నది నా ఆశయం. ఆ దిశగా ప్రయత్నిస్తున్నాను.

అమ్మ స్మారకంగా...

ఉన్నత విద్య అభ్యసిస్తున్న క్రమంలోనే ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చింది. అంతటితో తృప్తి చెందలేదు. ప్రొఫెసర్ కావాలి అనుకొన్నాను. అదే లక్ష్యంగా కొన్నేళ్లు కష్టపడ్డాను. నా కల సాకారమైంది. పాతికేళ్లుగా బోధనా రంగంలో కొనసాగుతున్నాను. ఉస్మానియా తెలుగు శాఖ అధ్యక్షురాలిగా నాలుగేళ్లు బాధ్యతలు నిర్వర్తించాను. బిరుదురాజు రామరాజు తర్వాత అంతకాలం హోదాలో కొనసాగింది నేనే అని తెలిసి ఉప్పొంగిపోయాను. రాయప్రోలు సుబ్బారావు అధ్యక్షుడిగా 1919లో మొదలైన మా తెలుగు శాఖకు శతాబ్ది ఉత్సవాలను నిర్వహించడం నాకు లభించిన మరొక గొప్ప అవకాశం. నన్ను మరొకరు వేలెత్తి చూపించడానికి అవకాశం లేకుండా, స్వీకరించిన ప్రతి బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తున్నాను.

అబ్బాయిలనే పెద్దగా బడికి పంపని ఆ రోజుల్లో నన్ను పదో తరగతి వరకు చదివించింది మా అమ్మ ధాళీబాయి. నన్ను విద్యావంతురాలిని చేయాలని ఆమె ఎంతగా కలలు కన్నదో నాకు తెలుసు. అక్షరం ముక్క రాకున్నా ఆమె ప్రేమతత్వం మహత్తరమైనది. అదే నన్ను విజయతీరాలకు చేర్చింది. అందుకే మా అమ్మ స్మారకంగా 'యాడి' (అమ్మ) చారిటబుల్ ట్రస్ట్ ద్వారా కష్టాల్లో ఉన్న విద్యార్థులకు తోచిన సహాయం చేస్తున్నాను. ఉజ్వల్ క్రియేషన్స్ ద్వారా యువ రచయితలను ప్రోత్సహించాలని, వారి రచనలు ముద్రిస్తున్నాం.

● సొంత్వన్

నవ్య | చిత్రజ్యోతి

'నాటునాటుకు' రామ్ చరణ్‌తో చిందేసిన ఖాన్ త్రయం



ఖాన్ త్రయాన్ని ఒకే తెరపై చూడాలని అభిమానులు ఎప్పటినుంచో కలలు కంటున్నారు. వారి కల ఇప్పటికి నిజమైంది. కానీ అది సినిమాలో కాదు.. ముఖేష్ అంబానీ పుత్రుడు అనంత్, వీరేన్ మర్చెంట్ కుమార్తె రాధిక ప్రీ వెడ్డింగ్ సంబరాల్లో. గుజరాత్‌లోని జామ్‌నగర్ వేదికగా జరుగుతున్న ఈ వేడుకలో బాలీవుడ్ ప్రముఖులు సందడి చేశారు. ఈ వేడుకకు మన టాలీవుడ్ స్టార్ హీరో రామ్ చరణ్ కూడా తన సతీమణి ఉపాసనతో విచ్చేశారు. ఇక తెలుగు వారి పాటను అంతర్జాతీయంగా అందలమెక్కించిన నాటునాటు పాటకు ఖాన్ త్రయం రామ్ చరణ్‌తో కలిసి చిందులేశారు. ప్రస్తుతం వీరు కలిసి స్టెప్పులేసిన వీడియో నెట్టింట అభిమానులను సంబరాల్లో ముంచెత్తుతోంది. ఈ వేడుకలో డ్యాన్సింగ్ హంగామా ఇంతటితో ఆగిపోలేదు. అతిలోక సుందరి శ్రీదేవి కుమార్తెలు జాన్వీ కపూర్, ఖుషీ కపూర్ కలిసి 'కభీ ఖుషీ కభీ గమ్'లోని 'బోలె చూడియాన్ బోలే కంగనా' పాటకు డాన్స్ చేశారు. వీరికి అనన్యా పాండే, సారా అలీఖాన్ కూడా జతకలవడంతో సందడి మరింత పెరిగింది. అంగరంగ వైభవంగా సాగుతోన్న ఈ ప్రీ వెడ్డింగ్ వేడుకలో క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనీ దంపతులు, స్టార్ డైరెక్టర్ అట్లీ, నటి రాణీముఖర్జీతో పాటు స్టార్ కపుల్స్ రణ్‌వీర్-దీపిక, రణ్‌బీర్-ఆలియా భట్ తళుక్కుమన్నారు.

కేక పెట్టించే సినిమా అవుతుంది

గోపిచంద్



'భీమా' చిత్రం అవుట్‌పుట్ అద్భుతంగా వచ్చింది. ఈ సినిమా కేక పుట్టిస్తుంది. అందులో సందేహం లేదు' అని గోపిచంద్ అన్నారు. ఏ హర్ష దర్శకత్వంలో గోపీచంద్ కథానాయకుడిగా నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ 'భీమా'. ప్రియా భవానీ శంకర్, మాళవికా శర్మ హీరోయిన్లు. కె.కె రాధామోహన్ నిర్మాత. ఈ నెల 8న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం హన్మకొండలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. గోపీచంద్ మాట్లాడుతూ 'ఈ సినిమాను గ్రాండ్‌గా నిర్మించడానికి మా నిర్మాతే కారణం. వారికి ధన్యవాదాలు. రవిబస్రూర్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు' అని అన్నారు. ఏ హర్ష మాట్లాడుతూ 'భీమా' కథలో లో ఎనర్జీ, పవర్ ఉంది. ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని హంగులు ఈ సినిమాలో ఉన్నాయి. థియేటర్లలో హై ఇంపాక్ట్ ఇచ్చే సినిమా ఇది. మార్చి 8న బ్రహ్మ రాక్షసుడు కనిపిస్తాడు' అని చెప్పారు. ఇందులో నటనకు ఆస్కారమున్న పాత్ర పోషించాను అని మాళవిక శర్మ చెప్పారు. కేకే రాధామోహన్ మాట్లాడుతూ 'మహా శివరాత్రి సందర్భంగా సినిమాను విడుదల చేస్తున్నాం. అందరం సమష్టిగా పనిచేసి మంచి సినిమాను తెరకెక్కించాం' అని తెలిపారు.

ఫ్యామిలీ ఎంటర్టైనర్



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. పరశురామ్ పెట్ల దర్శకుడు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. ఏప్రిల్ 5న ఈ చిత్రం విడుదలవుతోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు చక్కటి ఆదరణ దక్కుతోంది. ఇప్పుడు యూనిట్ ప్రచార కార్యక్రమాల్లో స్పీడ్ పెంచింది. టీజర్ ఈరోజే విడుదల అవుతోంది. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ సరికొత్త లుక్‌లో ఉన్న స్టిల్‌ను యూనిట్ విడుదల చేసింది. ఫ్యామిలీ యాక్షన్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా తెరకెక్కుతోన్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: గోపీసుందర్. సినిమాటోగ్రఫీ: కేయూ మోహనన్.

ఆగస్టులో సరిపోదా...



నాని కథానాయకుడిగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'సరిపోదా శనివారం'. డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి పాన్ ఇండియా స్థాయిలో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో నాని యాక్షన్ ప్యాక్డ్ అవతార్‌లో కనిపించనున్నారు. ఇటీవలే విడుదలైన టీజర్‌కు చక్కటి స్పందన వచ్చింది. తాజాగా చిత్రబృందం రిలీజ్ డేట్‌ను ఖరారు చేసింది. 'సరిపోదా శనివారం' చిత్రాన్ని ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్లు యూనిట్ ప్రకటించింది. ఈ సందర్భంగా విడుదల చేసిన రిలీజ్ డేట్ పోస్టర్‌లో నాని ఒక చేత్తో పిడికిలి బిగించి, మరో చేత్తో రౌడీని పట్టుకున్న పవర్‌ఫుల్ లుక్‌లో కనిపించారు. ఈ చిత్రంలో ప్రియాంక అరుల్ మోహన్ కథానాయిక. ఎస్‌జే సూర్య కీలకపాత్ర పోషిస్తున్నారు. జేక్స్ బిజోయ్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: మురళీ జి. ఎడిటర్: కార్తిక్ శ్రీనివాస్

మధ్యతరగతి మనుషుల కథ



చైతన్య రావు, భూమి శెట్టి జంటగా నటించిన చిత్రం 'షరతులు వర్తిస్తాయి' కుమారస్వామి దర్శకత్వం వహించారు. నాగార్జున సామల, శ్రీష్ కుమార్ గుండా, డాక్టర్ కృష్ణ కాంత్ చిత్తజల్లు నిర్మించారు. ఈ నెల 15న థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోందీ సినిమా ట్రైలర్‌ను ఆదివారం రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా నటుడు సంతోష్ యాదవ్ మాట్లాడారు. ఈ సినిమాలో శంకరన్న క్యారెక్టర్‌లో నటించానని తెలిపారు. టీజర్ రిలీజైన తర్వాత నన్ను అందరూ శంకరన్న అని పిలవడం మొదలు పెట్టారని ఆనందం వ్యక్తం చేశారు. మంచి సినిమాతో మా సంస్థ లాంచ్ అవుతుండటం హ్యాపీగా ఉందని నిర్మాత కృష్ణకాంత్ అన్నారు. మంచి ప్రయత్నం చేసినప్పుడు ఎన్నో అడ్డంకులు ఎదురవుతాయని దర్శకుడు అన్నారు. కానీ వాటిని ధైర్యంగా ఎదుర్కొని ప్రొడ్యూసర్స్‌ను సేఫ్‌గా ఉంచుతూ ఈ చిత్రాన్ని కంప్లీట్ చేశానని దర్శకుడు వివరించారు. ఇదొక న్యూ ఏజ్ సినిమా అని హీరోయిన్ భూమి శెట్టి తెలిపారు. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వాళ్ల జీవితాల్లో ఉండే అన్ని ఎమోషన్స్ ఇందులో ఉంటాయని నటుడు చైతన్య రావు వివరించారు.

సచివాలయ భవనాల తాకట్టా!?

» ఇది రాష్ట్రానికి అవమానకరం: చంద్రబాబు

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థకు గుండెకాయలాంటి రాష్ట్ర సచివాలయాన్ని తాకట్టు పెట్టి అప్పు తేవడం రాష్ట్రానికి అవమానకరమని టీడీపీ అధినేత చంద్రబాబు ఆక్షేపించారు. ఆదివారం ఎక్స్ వేదికగా 'ఆంధ్రజ్యోతి'లో తాకట్టులో సచివాలయం కథనం క్లిప్పింగ్‌ను జోడించి, దానిపై స్పందించారు. రాష్ట్రానికి అవమానకరం, బాధాకరం, సిగ్గుచేటని పేర్కొన్నారు. రూ.370 కోట్లకు రాష్ట్ర ముఖ్యమంత్రి కూర్చునే భవనాన్ని, రాష్ట్ర పాలనా కేంద్రాన్ని తాకట్టు పెట్టడం అంటే ఏంటో ఈ సీఎంకి తెలుసా? అని ప్రశ్నించారు. 'నువ్వు తాకట్టు పెట్టింది కేవలం భవనాలను కాదు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని. నువ్వు నాశనం చేసింది సమున్నతమైన ఆంధ్రప్రదేశ్ బ్రాండ్‌ని. ప్రజలారా.. అసమర్థ, అహంకార, విధ్వంస పాలనలో మనం ఏం కోల్పోతున్నామో ఆలోచించండి' అని ఎక్స్‌లో వ్యాఖ్యానించారు.

బాలయోగి చంద్రబాబు నివాళులు

మాజీ లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగి వర్ధంతి సందర్భంగా చంద్రబాబు ఎక్స్ ద్వారా నివాళులర్పించారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి, దేశంలోనే అత్యున్నతమైన లోక్‌సభకు రెండుసార్లు స్పీకర్‌గా పనిచేసిన ఘనత సాధించిన తెలుగు తేజం బాలయోగి అంటూ కొనియాడారు.

నేడు పెనుకొండలో 'రా.. కదలిరా..'

అమరావతి, పుట్టపర్తి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సోమవారం శ్రీసత్యసాయి జిల్లాలో పర్యటించనున్నారు. హిందూపురం లోక్‌సభ స్థానం పరిధిలోని పెనుకొండ మండలం ఎర్రమంచి గ్రామ సమీపంలో కియ కార్ల పరిశ్రమ వద్ద నిర్వహించనున్న 'రా.. కదలిరా..' సభకు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు సభలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి.

'వ్యూహం' కలెక్షన్లలానే వైసీపీకి ఓట్లు: రఘురామ

న్యూఢిల్లీ, మార్చి 3(ఆంధ్రజ్యోతి): 'వ్యూహం' సినిమా కలెక్షన్లలాగే రాబోయే ఎన్నికల్లో వైసీపీకి ఓట్లు అంతే ఘోరంగా వస్తాయని ఎంపీ రఘురామకృష్ణరాజు వ్యాఖ్యానించారు. వ్యూహం సినిమా కంటే ఘోరమైన పరాభవాన్ని వైసీపీ చూడబోతుందన్నారు. ఆదివారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. రాయలసీమలో 20-25 స్థానాలు, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో 15 కలుపుకొని మొత్తంగా వైసీపీకి 40 స్థానాలు వస్తాయని ఇన్నాళ్లు భావించామని, కానీ ప్రస్తుత పరిస్థితి పరిశీలిస్తే ఆ పార్టీ సింగిల్ డిజిట్‌కు పరిమితమైనా ఆశ్చర్యపోవాల్సిందేమీ లేదని చెప్పారు. ఓటమిని తట్టుకోవడానికి వైసీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఓటమి తర్వాత చేపట్టబోయే ఓదార్పు యాత్రకు జగన్ మనోధైర్యం తెచ్చుకోవాలని హితబోధ చేశారు. రామ్‌గోపాల్‌వర్మ పన్నిన వ్యూహం నుంచే జగన్ బయటకు రాలేదని, ఇక పద్మవ్యూహం నుంచి బయటకేం వస్తారంటూ అపహాస్యం చేశారు. రాష్ట్ర సచివాలయాన్ని తాకట్టు పెట్టిన పాలకులు, రేపు ప్రజల ఆస్తులు కూడా తాకట్టు పెట్టే ప్రమాదం లేకపోలేదని రఘురామరాజు అన్నారు. ఇప్పటికే ప్రజల వ్యక్తిగత ఆస్తి పత్రాలను పాలకులు తమవద్దే ఉంచుకున్నారని, ఏదైనా బ్యాంకు వచ్చి అప్పు ఇస్తామంటే, వాటిని కూడా తాకట్టు పెడతారని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రిగా ఎవరిని ఉంచాలి, ఎవర్ని ఇంటికి పంపాలో ప్రజలు ఆలోచించాలని కోరారు.

లండన్‌కు పారిపోయే యోచనలో జగన్: దేవినేని ఉమ

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు ముగియగానే లండన్ పారిపోయేందుకు సీఎం జగన్ ప్రణాళిక సిద్ధం చేసుకున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆరోపించారు. రూ.500 కోట్లు ఖర్చుచేసి విశాఖలోని రుషికొండను బోడిగుండు చేసి ఆ స్థానంలో గొప్ప ప్యాలెస్ నిర్మించుకున్నారని ఉమా ఇక్కడ ధ్వజమెత్తారు. కొద్దిరోజుల్లో వైజాగ్‌లో క్యాంప్ ఆఫీస్ పేరిట ఆయన ఆ ప్యాలెస్‌లో ఫ్యామిలీ పెడతారన్నారు. విజయవాడ నుంచి సింగపూర్ వెళ్లే విమానాన్ని వైజాగ్ నుంచి వెళ్లేలా మార్చారన్నారు. ఎన్నికల తంతు పూర్తి చేసుకుని విశాఖ రుషికొండ ప్యాలెస్ నుంచి సింగపూర్ విమానంలో జగన్ కుటుంబం లండన్ పారిపోబోతుందన్నారు. ప్రభుత్వ భవనాల్ని, సచివాలయాన్ని తాకట్టుపెట్టే హక్కు జగన్‌కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. చెత్తమీద పన్ను వేసే చెత్త ప్రభుత్వం జగన్‌దని, హూ కిల్డ్ బాబాయ్‌కు సమాధానం చెప్పాలని ఉమా డిమాండ్ చేశారు.

జగన్‌ను ఎవరితో పోల్చాలో చెప్పండి.. ప్లీజ్: లోకేశ్

అమరావతి, మార్చి3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని 12.5లక్షల కోట్ల అప్పుల్లో ముంచిన జగన్‌రెడ్డి ఇప్పుడు ఏకంగా ప్రభుత్వంలోని అత్యంత కీలకమైన రాష్ట్ర సచివాలయాన్ని సైతం తాకట్టు పెట్టాడన్న వార్త చూసి షాక్‌కు గురైయ్యానని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ వ్యాఖ్యానించారు. గత ఐదేళ్లగా జగన్ తెస్తున్న అప్పులు చూసి, తలపండిన ఆర్థిక వేత్తలకు సైతం మైండ్ బ్లాంక్ అవుతోందని ఆదివారం 'ఎక్స్'లో పేర్కొన్నారు. 'ఏపీని అప్పుల కుప్పగా మార్చి, మరో శ్రీలంకలా మార్చేస్తున్నారని మేమంటే.. ఒంటికాలిపై లేచిన వైసీపీ మేధావులు ఇప్పుడు దీనికేం సమాధానం చెప్తారు? ఏపీ సచివాలయాన్ని రూ.380కోట్లకు తాకట్టు పెట్టిన జగన్ పనితనాన్ని చూశాక శ్రీలంకతో పోల్చడం ఏ మాత్రం సరికాదనిపిస్తోంది. ఈ సీఎంను ఏమనాలో, ఎవరితో పోల్చాలో మాటలు రావట్లేదు. మీరైనా చెప్పండి ప్లీజ్!! అని పోస్ట్ చేశారు.

రాష్ట్రం పరువు తీసిన జగన్: సీపీఐ

అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఏకంగా అమరావతిలోని రాష్ట్ర సచివాలయాన్ని తాకట్టు పెట్టి రాష్ట్రం పరువు తీశారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విమర్శించారు. వివిధ ప్రభుత్వ విభాగాల ఆస్తులను ఇప్పటికే తనఖా పెట్టి అందినకాడికి అప్పులు తెచ్చిన జగన్.. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఏకంగా రాష్ట్ర సచివాలయాన్నే తాకట్టు పెట్టడం దివాళాకోరుతనానికి నిదర్శనమంటూ దుయ్యబట్టారు. 'రాష్ట్రాన్ని దాదాపు రూ.11 లక్షల కోట్ల అప్పుల్లో ముంచిన జగన్ ప్రభుత్వం.. రూ. 2.86 లక్షల కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌ను ఆమోదించింది. అంత డబ్బు జగన్ ప్రభుత్వం దగ్గర ఉంటే ఏపీ సెక్రటేరియట్ భవనాలను హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుకు తాకట్టు పెట్టాల్సిన అవసరం ఏమొచ్చింది? రాష్ట్ర ప్రజలు ఆలోచించాలి' అని రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, రాష్ట్రంలో ఎన్నికల కమిషన్ సీరియస్‌గా లేదని రామకృష్ణ అనంతపురంలో ఆక్షేపించారు. రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ రమేష్ తన ఓటు సొంతూరులో నమోదు చేసుకునేందుకు మూడేళ్లు కష్టపడ్డారంటే.. పరిస్థితి ఎలా ఉందో చెప్పక్కరలేదన్నారు.

సమాజ ఉమ్మడి ఆస్తిగా బూతులు

» దీన్ని సభ్యసమాజం హర్షించడం లేదు: జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

విజయవాడ కల్చరల్, మార్చి 3: 'ప్రస్తుతం బూతులు సమాజ ఉమ్మడి ఆస్తిగా మారిపోయాయి. మనకు ఉన్నవి ఏమిటని చూస్తే బూతులు, విద్వేషమే కనిపిస్తున్నాయి. దీనిపై చర్చించకపోతే బూతు భాష సమాజానికి మనమిచ్చే వారసత్వం అవుతుంది' అని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ నూతనంగా నిర్మించిన నాలుగో అంతస్తును ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం 'ప్రసార మాధ్యమాల్లో రాజకీయ పరిభాష' అంశంపై నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడారు. భావోద్వేగాలు లేకుండా రాజకీయాలు నడపాలని అభిప్రాయపడ్డారు. తీవ్రమైన పదజాలం ఉపయోగించకూడదని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. రాజకీయ పార్టీల సిద్ధాంతాలు, రాద్ధాంతాలు ఎలా ఉన్నా బూతుల జోలికి నేతలు వెళ్లడంపై ప్రజలు అసహ్యం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. రాజకీయ నేతలు దారుణంగా మాట్లాడుతున్న బూతులను సభ్యసమాజం హర్షించడం లేదన్నారు. అన్‌పార్లమెంటరీ పదాలను రోజూ పార్లమెంటులోనే వాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ జనం దేన్ని ఎక్కువగా ఇష్టపడితే దానినే మీడియా చూపిస్తోందని, మీడియా దేన్ని ఎక్కువగా చూపిస్తుందో దాన్నే రాజకీయ నేతలు మాట్లాడుతున్నారని వివరించారు. ప్రజాసేవ చేయడానికి వచ్చిన వారికి ఎందుకంత కోపం వస్తుందని ప్రశ్నించారు. బూతులు మాట్లాడేవారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని విజయ్‌కుమార్, సీనియర్ సంపాదకుడు కె.రామచంద్రమూర్తి, ఎమెస్కో విజయ్‌కుమార్, జర్మనీ మాజీ మేయర్ గుజ్జుల రవీంద్ర, వీబీఎఫ్‌ఎస్ అధ్యక్షుడు మనోహరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన బీసీ డిక్లరేషన్ కమిటీ

అమరావతి, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఎన్నికల కోసం టీడీపీ-జనసేన ఉమ్మడిగా బీసీ డిక్లరేషన్ కమిటీ ఏర్పాటు చేసుకున్నాయి. పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు 19 మంది టీడీపీ, జనసేన నేతలతో ఈ కమిటీని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఆదివారం రాత్రి ప్రకటించారు. ఇందులో టీడీపీ నేతలు యనమల రామకృష్ణుడు, అయ్యన్నపాత్రుడు, పితాని సత్యనారాయణ, కొల్లు రవీంద్ర, కాల్వ శ్రీనివాసులు, బీద రవిచంద్ర, అనగాని సత్యప్రసాద్, పంచుమర్తి అనూరాధ, బండారు సత్యనారాయణ మూర్తి, రామారావు, గౌతు శిరీష, బీకే పార్థసారథి, కొనకళ్ల నారాయణ, గుంటుపల్లి నాగేశ్వరరావు, నిమ్మల కిష్టప్ప, రవికుమార్, జనసేన నేతలు బొనబోయిన శ్రీనివాసయాదవ్, పీ మహేశ్, చిల్లపల్లి శ్రీనివాస్ ఉన్నారు.



విజయవాడ విమానాశ్రయం

స్లాట్స్ 'గగన'ం!

» బెజవాడ నుంచి ఢిల్లీ, ముంబైకి స్లాట్స్ కటకట

» డిమాండ్ ఉన్నా అక్కడి రన్‌వేలు రద్దీ

» గుర్‌గావ్, నవీ ముంబైలో కొత్త ఎయిర్‌పోర్టులు అందుబాటులోకి వచ్చే వరకూ కష్టమే..

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

దేశ రాజధాని ఢిల్లీ, ఆర్థిక రాజధాని ముంబైకి విజయవాడ నుంచి విమానాలు నడపాలంటే స్లాట్స్ దొరకని పరిస్థితి ఏర్పడింది. ఢిల్లీ, ముంబై విమానాశ్రయాల్లో నెలకొన్న రద్దీనే ఇందుకు కారణం. కొవిడ్ ముందు వరకు దేశ రాజధానికి 3 విమాన సర్వీసులు నడిచేవి. ఆ తర్వాత రెండింటినే పునరుద్ధరించారు. మూడో దానికి మాత్రం స్లాట్ దొరకలేదు. ప్రస్తుత డిమాండ్ రీత్యా ఢిల్లీకి అదనంగా రోజుకు రెండు విమానాలు నడపాల్సి ఉంది. విమానయాన సంస్థల నుంచి ఆసక్తి ఉన్నా విమానాలను నడపలేని పరిస్థితి నెలకొంది. కారణం.. ఢిల్లీ విమానాశ్రయంపై విపరీతమైన రద్దీ ఉండటమే. ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఢిల్లీ ఎయిర్‌పోర్టులో దశలవారీగా నాలుగు రన్‌వేలను అభివృద్ధి చేసినా అదే డిమాండ్ ఉంటోంది. దీంతో విమానాలకు ఢిల్లీ విమానాశ్రయం నుంచి స్లాట్స్ దొరకటం లేదు. పోనీ.. కనెక్టింగ్ ఫ్లైట్స్ ప్రయత్నించినా ఫలితం ఉండట్లేదు. ఢిల్లీ విమానాశ్రయంపై ఒత్తిడి తగ్గించటానికి కేంద్రం గుర్‌గావ్‌లో సరికొత్త విమానాశ్రయాన్ని నిర్మిస్తోంది. ఇది అందుబాటులోకి రావాలంటే మరో రెండేళ్ల వరకు పట్టవచ్చని తెలుస్తోంది. అప్పటి వరకు ఢిల్లీకి అదనపు విమాన సర్వీసులు నడపటం కష్టమే! ఇక విజయవాడ నుంచి ముంబైకి గతంలో ఒక విమానం నడిచేది. అది కొవిడ్ ముందు రద్దయింది. ప్రస్తుతం విజయవాడ నుంచి ముంబైకి రోజూ విమాన సర్వీసు నడిపేంత డిమాండ్ ఉంది. కానీ, ఎయిర్‌పోర్టు అధికారులు ఎన్ని ప్రయత్నాలు చేసినా స్లాట్ దొరకటం లేదు. ముంబై విమానాశ్రయంలో ఒకటే రన్‌వే ఉంది. దీంతో కేంద్రం నవీ ముంబైలో ఇంకో ఎయిర్‌పోర్టును నిర్మిస్తోంది. అందుబాటులోకి రావటానికి మరో ఏడాదిన్నర పట్టవచ్చు.

డొమెస్టిక్ ప్రయాణికులు ఇతర రాష్ట్రాలకు..

విజయవాడ విమానాశ్రయం నుంచి ఢిల్లీకి డిమాండ్‌కు తగినట్టుగా విమానాలు లేకపోవటం, ముంబైకి అసలు విమానాలే లేకపోవడం వల్ల ఇక్కడి ప్రయాణికులు పొరుగు రాష్ట్రాలైన హైదరాబాద్, చెన్నైకు వెళ్తున్నారు. దీంతో డొమెస్టిక్ ఫ్లైట్స్ కోసం కూడా పొరుగు రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం ఏర్పడింది. ప్రస్తుతం విజయవాడ నుంచి షార్జాకు వారంలో రెండు రోజుల పాటు అంతర్జాతీయ సర్వీసులు నడుస్తున్నాయి. ట్రావెల్ ఏజెన్సీల గణాంకాల ప్రకారం హైదరాబాద్ విమానాశ్రయం నుంచి విదేశాలకు ఉన్న డిమాండ్‌లో సగం విజయవాడ, కోస్తా జిల్లాల నుంచి వెళ్లే వారున్నారని తెలుస్తోంది. కనీసం సింగపూర్, దుబాయ్ వంటి వరల్డ్ డెస్టినేషన్ ఎయిర్‌పోర్టులకు విమానాలను నడిపినా వారికి వెసులుబాటుగా ఉంటుంది. ఈ అవకాశం కూడా లేకపోవటం వల్ల ఇక్కడి నుంచి విదేశాలకు వెళ్లే వారిలో 70 శాతం మంది హైదరాబాద్, 30 శాతం మంది చెన్నై వెళ్లాల్సి వస్తోంది.

విజయవాడ-విశాఖకు నో కనెక్టివిటీ

విజయవాడ-విశాఖ మధ్య రోడ్డు, రైలు మార్గాలకు ఎంత డిమాండ్ ఉందో అందరికీ తెలిసిందే. నాన్ స్టాప్‌గా చిన్నపాటి విమానాలు నడపగలిగేంత డిమాండ్ ఉన్నా ఒకే ఒక్క సర్వీసు నడుస్తోంది. విజయవాడ నుంచి తిరుపతికి మరో సర్వీసు డిమాండ్ ఉంది. కడపకు కూడా విమాన సర్వీసు డిమాండ్ ఉన్నా నడపలేని పరిస్థితి ఏర్పడింది.

దేశ రాజకీయాల్లో తెలుగువారి

ప్రభావం తగ్గుతోంది

» పార్ట్ టైమ్ పొలిటీషియన్ల వల్లే ఈ పరిస్థితి

» మాజీ గవర్నర్ రామ్మోహన్‌రావు ఆత్మకథ పుస్తకావిష్కరణలో సీఎం రేవంత్ రెడ్డి

» ఉత్తరాది పెత్తనంపై పరోక్ష వ్యాఖ్యలు



హైదరాబాద్ సిటీ, మార్చి3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రాజకీయాల్లో తెలుగు వారి ప్రభావం క్రమంగా తగ్గుతోందని, ఇది మంచి పరిణామం కాదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. దేశ రాజకీయాల్లో పార్ట్‌టైమ్ పొలిటీషియన్లు ఎక్కువ ఉండటమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం కావచ్చని అభిప్రాయపడ్డారు. గతంలో నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు, ఎన్టీఆర్ లాంటి నేతలు జాతీయ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారని గుర్తుచేశారు. తర్వాత ఆ స్థాయిని నిలబెట్టేందుకు జైపాల్‌రెడ్డి, వెంకయ్యనాయుడు కొంతవరకు ప్రయత్నించారన్నారు. ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో అలాంటి నేతలు కనిపించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉన్న ఎంసీహెచ్‌ఆర్డీలో ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ, తమిళనాడు మాజీ గవర్నర్ పీఎస్ రామ్మోహన్‌రావు రాసిన తన ఆత్మకథ 'గవర్నర్‌పేట టు గవర్నర్స్ హౌజ్' పుస్తకాన్ని సీఎం రేవంత్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పుస్తకం పొలిటికల్ సస్పెన్స్ థ్రిల్లర్ అవుతుందన్నారు.

మనవాళ్లను వెతుక్కోవాల్సిన పరిస్థితి..

భాష, భావం అనేవి ఉంటాయని నేటి రాజకీయాల్లో చర్చించుకొనే పరిస్థితి రావడం బాధాకరమని రేవంత్ అన్నారు. 'దేశంలో హిందీ తర్వాత ఎక్కువగా మాట్లాడే భాష తెలుగు. మరి ఆ స్థాయిలోనే తెలుగు వారు జాతీయ రాజకీయాల్లో ప్రభావం చూపాలి. నిర్ణయాధికారంలో భాగస్వామ్యం కావాలి. ఎప్పుడైనా ఢిల్లీకి వెళ్తే ఎవరిని కలవాలో.. మనవారు ఎవరున్నారో వెతుక్కోవాల్సిన పరిస్థితి. గతంలో ప్రధాని పదవిలో ఉత్తర భారతీయుడుంటే, రాష్ట్రపతి పదవిలో దక్షిణాది వ్యక్తి ఉండేవారు. కేంద్ర క్యాబినెట్‌లోనూ కీలక ఐదు శాఖల్లో మూడింటిని దక్షిణాది నేతలకు కేటాయించేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. దీనికి కారణాలు, పరిష్కార మార్గాలపై అనుభవజ్ఞులు ఆలోచించాలి' అని దక్షిణాదిపై ఉత్తరాది నేతల పెత్తనం గురించి రేవంత్ పరోక్ష వ్యాఖ్యలు చేశారు.

రాష్ట్రాలుగా విడిపోయినా కలిసి నడుద్దాం..

భౌగోళికంగా రెండు రాష్ట్రాలుగా విడిపోయినా, జాతీయ రాజకీయాల్లో ప్రాభవాన్ని నిలబెట్టడం కోసం తెలుగువారిగా కలిసి ప్రయాణం మొదలుపెట్టాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. 'రాష్ట్రాలుగా విడిపోయినా, మనుషులుగా కలిసుందాం. తెలంగాణను అభివృద్ధి పథం వైపు నడిపించి, ఆ ఫలాలను ప్రజలకు అందించాల్సిన బాధ్యత మాపై ఉంది. ఆ దిశగా పరిపాలన సాగించేందుకు అనుభవజ్ఞులు, అధికారుల నుంచి మా ప్రభుత్వం సలహాలు, సూచనలు తీసుకుంటుంది. రాజకీయాల్లో మంచి సంప్రదాయాలు పాటించేందుకు మా ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని చెప్పారు. గతంలో పీవీకి ప్రధానిగా అవకాశం వచ్చిన సందర్భంలో నంద్యాలలో ఎన్టీఆర్ తమ పార్టీ అభ్యర్థిని పోటీకి పెట్టకుండా ఏకగ్రీవం చేసే ప్రయత్నం చేశారని గుర్తుచేశారు.

జగనా.. మజాకా?

(మొదటి పేజీ తరువాయి)

ఫణంగా పెట్టి ఆ కంపెనీకి తనదైన శైలిలో జగన్ మేలు చేశారు. కొత్తగా 479 ఎకరాలు కట్టబెట్టారు. పాత బకాయిలపై ఉన్న వడ్డీలు, ఇతర ఫీజులను మాఫీ చేశారు. పయనీర్‌గా అవతారం మార్చుకున్న అన్‌రాక్‌కు ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే చకచకా మేలు చేసిపెట్టారు. తన మిత్రులకు జగన్ ఎంతైనా మేలుచేసుకోవచ్చు. కానీ, ముఖ్యమంత్రిగా రాష్ట్ర ప్రయోజనాలకే తొలిప్రాధాన్యత ఇవ్వాలి. కానీ, జగన్ తన మిత్రులకే ప్రాధాన్యం ఇచ్చారు. చాల పద్ధతిగా, ఎక్కడా తేడా కనబడకుండా, అసలు జగన్ ప్రమేయం అన్నదే కాగితాలపై కనబడకుండా చాకచక్యంగా మేళ్ల కార్యక్రమం నిర్విఘ్నంగా పూర్తి చేశారు. విశాఖ మన్యంలోని మాకవారిపాలెం పరిసర గ్రామాల్లో దక్షిణాసియాలోనే అతి విలువైన బాక్సయిట్ నిక్షేపాలున్నాయి. వాటిపై నాటి పాలకుల కన్నుబడింది. బాక్సయిట్ మైనింగ్ పేరిట రాయలసీమకే చెందిన ఓ ప్రముఖ పారిశ్రామికవేత్త, నాటి ముఖ్యమంత్రి వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితుడి కంపెనీ అన్‌రాక్ అల్యూమినియం లిమిటెడ్ అనే కంపెనీ ముందుకొచ్చింది. దీంతో బాక్సయిట్ సరఫరా చేస్తామని ఖనిజాభివృద్ధి సంస్థ(ఎండీసీ)తో అన్‌రాక్ ఒప్పందం చేయించుకునేలా చక్రం తిప్పారు. అనంతరం, ఆ సంస్థకు మాకవారిపాలెం పరిధిలోని నాలుగైదు గ్రామాల్లో ఉన్న 1,925 ఎకరాల పట్టా, ప్రైవేటు భూములను ఏపీఐఐసీ ద్వారా కట్టబెట్టారు. ఎకరం రూ.2.83 లక్షల చొప్పున భూమి ధరను నిర్ణయించారు. అప్పట్లో సంస్థ నికరంగా 100 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ, 2013 దాకా చెల్లించింది రూ.72.91 కోట్లే. మరో రూ.27.41 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఇదిలా ఉండగానే, ఆదివాసీల పోరాట ఫలితంగా 2013, ఏప్రిల్‌లో అన్‌రాక్‌కు బాక్సయిట్ సరఫరా ఒప్పందం నుంచి ఎండీసీ తప్పుకొంది. అప్పుడు అన్‌రాక మరో రాష్ట్రం అంటే ఒడిశా నుంచి బాక్సయిట్ తవ్వి తీసుకొచ్చి అన్‌రాక్ పరిశ్రమలో ప్రాసెస్ చేసుకోవాలి. కానీ ఆ కంపెనీ ఆ పనిచేయలేదు. 10-11 ఏళ్ల తర్వాత అన్‌రాక్ కాస్తా పయనీర్ అల్యూమినియం ఇండస్ట్రీస్‌గా పేరు మార్చుకుంది.

కొత్తరూపంలో..

మాకవారిపాలెం సెజ్‌లో తను పొందిన భూములు, ఇతర వనరులను పయనీర్ అల్యూమినియం ఇండస్ట్రీస్ పేరిట మార్చాలని, ఇంకా తనకు 479 ఎకరాల భూమిని అదనంగా కేటాయించాలని అన్‌రాక్ సంస్థ ఇటీవల ఏపీఐఐసీని కోరింది. ఈ ప్రతిపాదన సరే, 2009-13 కాలంలో ప్రభుత్వం కేటాయించిన భూములకు సంబంధించిన పాత బకాయిలు రూ.27.41 కోట్లు, దానిపై వడ్డీ రూ.56.24 కోట్లు, జీఎస్టీ(18 శాతం) రూ.10.12 కోట్లు కలిపి మొత్తంగా రూ.93.77 కోట్లు సర్కారుకు చెల్లించాలని ఏపీఐఐసీ కోరింది. అయితే, 2013లో ఎండీసీ బాక్సయిట్ సరఫరా ఒప్పందం నుంచి తప్పుకున్నాక తమ పరిస్థితి దయనీయంగా మారిందని, పనిలేకుండా ఖాళీగా ఉన్నామని ఆ సంస్థ చెప్పుకొచ్చింది. కాబట్టి, పారిశ్రామిక అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని తమ బకాయిల చెల్లింపుపై విధించిన వడ్డీ, ప్రాసెసింగ్, సర్వీసింగ్ ఫీజులను పూర్తిగా మాఫీ చేయాలని కోరింది. అలాగే, తాము కోరుతున్న 479 ఎకరాల భూమిని 2009-2013 నాటి ధరలకే కేటాయించాలని విన్నవించింది.

అన్‌రాక్ కోరింది.. జగన్ చేసేశారు

2009-13 కాలంలో మాకవారిపాలెం సెజ్ పరిధిలో అన్‌రాక్‌కు ఎకరా భూమిని రూ.2.83 లక్షల చొప్పున కేటాయించారు. ఇప్పుడు తమకు కావాల్సిన 479 ఎకరాలను కూడా అదే ధరకు ఇవ్వాలని ఆ సంస్థ కోరింది. నిజానికి ఇప్పుడక్కడ భూమి ధర(రిజిస్ట్రేషన్ ధర) రూ.31.36 లక్షలని ఏపీఐఐసీనే తేల్చింది. కొత్త ధర ప్రకారం 479 ఎకరాలకుగాను అన్‌రాక్ రూ.150.23 కోట్లు ప్రభుత్వానికి చెల్లించాలి. పాత ధర అయితే రూ.13.57 కోట్లు చెల్లిస్తే సరిపోతుంది. అందుకే, తనపై భారం పడకుండా 2013 నాటి ధరకే భూములు కట్టబెట్టాలని ఆ కంపెనీ కోరింది. ఎలాగూ దాని గొంతెమ్మ కోరికలను తీర్చాలని జగన్ ముందుగానే నిర్ణయించారు కాబట్టి, ఆ ప్రతిపాదనలకు వ్యూహాత్మకంగా పరిశీలనలు చేయించారు. ఈ ఏడాది జనవరి 29న రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక కమిటీ(ఎస్ఐపీబీ)తో ఆమోదింపజేశారు. మరుసటి రోజే బోర్డులో చర్చకు పెట్టి చకచకా ఆమోదింపజేశారు. దీనివల్ల ప్రభుత్వ ఖజానాకు జరిగిన నష్టం రూ.136.66 కోట్లు. ఇదిగాక, ఆ సంస్థకు ఇచ్చిన మినహాయింపులు సైతం సర్కారు కోల్పోయింది. దీని విలువ రూ.66.36 కోట్లు. అంటే, అన్‌రాక్‌కు జగన్ చేసిన మేలు కారణంగా సర్కారు ఖజానాకు నికరంగా రూ.203.02 కోట్ల మేర చిల్లుపడింది. ఇది చట్టబద్ధంగా, హక్కుగా ప్రభుత్వానికి రావాల్సిన సొమ్ము. అన్‌రాక్ యజమాని అస్మదీయుడైనందునే సర్కారుకు నష్టం వచ్చినా, ఒకవైపు చిన్న చిన్న అవసరాలకే అప్పులు చేయాల్సి వచ్చినా ప్రభుత్వం పాత ధరలకే కట్టబెట్టడం పట్ల ఏపీఐఐసీ అధికారులే విస్మయం వ్యక్తం చేస్తుండడం గమనార్హం.

జగన్‌కు భారీ ఓటమే!

(మొదటి పేజీ తరువాయి)

పథకాలకు కాదని స్పష్టం చేశారు. 'యువత.. ముఖ్యంగా విద్యావంతులు ఉద్యోగాలు కోరుకుంటారు.. ఇతరత్రా ప్రయోజనాలు కాదు. ఉచితాలపైనే జగన్ పూర్తిగా ఆధారపడ్డారు. దీనివల్ల ఆయన గడ్డు పరిస్థితులను ఎదుర్కోబోతున్నారు. మామూలు ఓటమి కాదు.. భారీ పరాజయం తప్పదు' అని తేల్చిచెప్పారు. ప్రజలు సమర్థ నిర్వహణను చూస్తారని.. కేవలం వనరుల నిర్వహణను కాదని చెప్పారు. ప్రజాధనాన్ని ఖర్చు చేస్తూ వారి బాగోగులను చూస్తున్నామని భావిస్తే అది పొరపాటని. జగన్ ఇదే చేస్తున్నారని.. తెలంగాణలో కూడా కేసీఆర్ ఇదేచేసి దెబ్బతిన్నారని తెలిపారు. ఎన్నికల ఫలితాలను ధనబలం మాత్రమే నిర్ణయించగలదని అనుకుంటే.. ఏ ప్రభుత్వాన్నీ ఓడించలేరని స్పష్టం చేశారు. జగన్ భారీ పరాజయం చవిచూడనున్నారని.. ఎందుకంటే.. భవంతిలో కూర్చుని బటన్ నొక్కి నేరుగా డబ్బును జమ చేసినంత మాత్రాన ఓట్లు రాలవని తేల్చిచెప్పారు. ధనమే కీలకమైతే ఏ ప్రభుత్వమూ ఓడిపోదని పునరుద్ఘాటించారు. దక్షిణాదిన రాజకీయాల్లో డబ్బు సంస్కృతి అలవడిందని.. కానీ తీసుకున్న డబ్బు ఆధారంగా ప్రజలు ఓట్లు వేయరని తెలిపారు. 'ఎందుకంటే ఉత్తర భారతంలో కంటే దక్షిణాదినే జనం ఎక్కువ ప్రభుత్వాలను మార్చేశారు' అని చెప్పారు. ఏతావాతా వచ్చే ఎన్నికల్లో ఏపీలో టీడీపీ విజయం తథ్యమని ఆయన అంచనా వేశారు. గత ఎన్నికల్లో ప్రశాంత్ కిశోర్ వైసీపీకి వ్యూహకర్తగా ఉండి ఆ పార్టీని విజయతీరాలకు చేర్చిన సంగతి తెలిసిందే. రెండేళ్ల కిందట ఇక ఎవరికీ రాజకీయ వ్యూహకర్తగా పనిచేయనని ప్రకటించి.. బిహార్ రాజకీయాల్లో మార్పు కోసం 'జన్‌సురాజ్' పేరిట పాదయాత్ర చేపట్టారు. అయితే ఆయన ఐ-ప్యాక్ టీం ఇప్పటికీ జగన్‌కు పనిచేస్తోంది. ఆ మధ్య పీకే టీడీపీ అధినేత చంద్రబాబుతో కూడా సమావేశమయ్యారు. ఆ పార్టీ తరఫున పనిచేయబోతున్నారని వార్తలు వచ్చినా ఉభయవర్గాలూ వాటిని తోసిపుచ్చాయి.

మలికా గర్గ్ మాకొద్దు!

» మహిళా ఐపీఎస్ అధికారిపై వైసీపీ ఎమ్మెల్యేల ఫిర్యాదు

» తక్షణమే స్పందించిన సీఎం

» తిరుపతి ఎస్పీగా నియమించిన 20 రోజుల్లోనే సీఐడీకి బదిలీ

» ఎన్నికల్లో నేతల అక్రమాలు సాగబోవనే కారణంతో వేటు!

» గర్గ్ బదిలీపై ఐపీఎస్‌లలో విస్మయం

» తిరుపతి ఎస్పీగా కృష్ణకాంత్ పటేల్

అమరావతి/తిరుపతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సమర్థవంతంగా విధులు నిర్వహించే అధికారులు వైసీపీ ప్రభుత్వానికి నచ్చబోరని మరోసారి రుజువైంది. తిరుపతి ఎస్పీగా గత నెల 12న బాధ్యతలు స్వీకరించిన మలికా గర్గ్ 20 రోజులకే బదిలీ అయ్యారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో జిల్లాకు వచ్చిన ఆమె ఆ ఎన్నికల కారణంగానే బదిలీ వేటుకు గురైనట్టు సమాచారం. ఇద్దరు కీలక ఎమ్మెల్యేల ఫిర్యాదుతో ఆమెను తిరుపతి నుంచి పంపించేసిన జగన్ ప్రభుత్వం.. ఆమెను సీఐడీకి బదిలీ చేసింది. ఆమె స్థానంలో విజయవాడ డీసీపీ కృష్ణకాంత్ పటేల్‌ను నియమించింది. కాగా, ప్రభుత్వ తీరుపై పోలీసు ఉన్నతస్థాయి వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లా ఎస్పీగా పని చేయాలన్నా.. శాంతి భద్రతల విభాగంలో పోస్టింగ్ కావాలన్నా.. 'వైసీపీ చట్టం' అమలు చేయాల్సిందే. ప్రతిపక్షాలకు చెందిన వారిపై అక్రమ కేసులు పెట్టి అర్ధరాత్రి పట్టుకొచ్చి చితక బాదాల్సిందే. అదే అధికార పార్టీ వారైతే ఏం చేసినా చూసీ చూడనట్లు ఉండాల్సిందే. అయితే అందరూ తాము అనుకున్నట్లు ఉండరని అక్కడక్కడ వైసీపీ నేతలకు అర్థం అయ్యేలా పనిచేసిన అధికారులు లూప్‌లైన్‌కు వెళ్లక తప్పని పరిస్థితి ఏర్పడింది. ప్రకాశం జిల్లా ఎస్పీగా రెండున్నరేళ్లకు పైగా పనిచేసిన మల్లికా గార్గ్ సమర్థవంతమైన, నిజాయితీ అధికారిగా పేరు తెచ్చుకున్నారు. ఆ జిల్లాకు చెందిన వైసీపీ నేతల అక్రమాలకు ఆమె అడ్డుగా ఉండటంతో కొంత కాలంగా మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ప్రభుత్వ పెద్దల్ని కలిసి జిల్లా ఎస్పీని మార్చాలని పట్టుబట్టారు. ఎట్టకేలకు జనవరి చివర్లో జరిగిన బదిలీల్లో ఆమె తిరుపతికి బదిలీ అయ్యారు. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికలో జరిగినన్ని అక్రమాలు దేశంలో దాదాపు ఎక్కడా జరగలేదని సీఈసీ విచారణలో వెల్లడైంది. వైసీపీ అక్రమాలకు వంత పాడిన పోలీసు అధికారులపై ఆమె చర్య తీసుకున్నారు. ఇతర అధికారులను పిలిచి నిక్కచ్చిగా వ్యవహరిస్తూ.. నిష్పక్షపాతంగా పనిచేసే వారు మాత్రమే తన పరిధిలో ఉండాలని, అలా చేయలేని వారు వెళ్లిపోవచ్చని పరిచయ కార్యక్రమంలోనే హెచ్చరించారు. ఆ తర్వాత పలువురు పోలీసు అధికారులపై నిఘా పెట్టి అధికార పార్టీతో అంట కాగుతూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న వారిని కట్టడి చేశారు. అయితే, తిరుమల శ్రీవారి సేవలో ఉండే ఇద్దరు వైసీపీ కీలక ఎమ్మెల్యేలు ఎస్పీతో మాట్లాడే ప్రయత్నం చేశారు. 'మా డ్యూటీ మమ్మల్ని చెయ్యనివ్వండి.. ఇప్పటికే తిరుపతి భ్రష్టు పట్టింది. సరి చేయనివ్వండి' అని ఆమె బదులివ్వడంతో



మలికా గర్గ్

దిక్కుతోచక తాడేపల్లి ప్యాలెస్‌కు విన్నవించుకున్నారు. మలికా గర్గ్ ఎస్పీగా ఉంటే తిరుపతిలో గెలిచే పరిస్థితి లేదంటూ లబో దిబోమన్నారు. అంతేకాదు, గతంలో పలువురు జిల్లా అధికారుల మాదిరిగా ఆమె అధికార పార్టీ ముఖ్యుల ఇళ్లకు వెళ్లి సన్మానాలు చేయకపోవడాన్ని వారు జీర్ణించు కోలేకపోయారని సమాచారం. ఇక, తిరుపతి ఉప ఎన్నికల్లో జరిగిన తప్పిదాలు వచ్చే ఎన్నికల్లో పునరావృతం కారాదని ఆమె యంత్రాంగానికి పటిష్ఠమైన ఆదేశాలిచ్చారు. సీఎంకు సన్నిహితుడిగా పేరుపడ్డ ఓ పోలీసు అధికారికి బందోబస్తు డ్యూటీలు వేశారు. గతంలో ఎవరూ ఇలా చేయకపోవడం గమనార్హం. దీంతో గర్గ్ ఎస్పీగా కొనసాగితే తిరుపతి ఎంపీ ఉప ఎన్నికల నాటి ఎపిక్ కార్డుల కేసుల దర్యాప్తులో కూడా ఇబ్బందులు తప్పవని అధికార పార్టీ నేతలు, అందులో పాలుపంచుకున్న పోలీసు అధికారులు ఆందోళనకు గురైనట్టు ఆయా వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వీటన్నింటికీ మించి వచ్చే ఎన్నికల్లో తమకు సహకరించే పరిస్థితి కనిపించడం లేదని నిర్ధారణకు వచ్చారు. దీంతో వెంటనే ఆమెను బదిలీ చేయాలన్న నేతల అభ్యర్థనలతో సీఐడీకి బదిలీ చేస్తూ జగన్ ప్రభుత్వం ఆదివారం ఆదేశాలు జారీ చేసింది. అదేవిధంగా పలువురు ఐపీఎస్‌లను కూడా బదిలీ చేసింది.

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
మలికా గర్గ్	ఎస్పీ, తిరుపతి జిల్లా	ఎస్పీ, సీఐడీ
కృష్ణకాంత్ పటేల్	డీసీపీ, విజయవాడ సిటీ	ఎస్పీ, తిరుపతి జిల్లా
అధిరాజ్ సింగ్ రాణా	ఏపీఎస్పీ కమాండెంట్, విజయనగరం	డీసీపీ, విజయవాడ సిటీ
గౌతమి శాలి	ఏపీఎస్పీ కమాండెంట్, విశాఖపట్నం	ఏపీఎస్పీ, విజయనగరం(ఎఫ్‌పీసీ)

పవన్‌తో చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే భేటీ

» ఈ వారంలోనే జనసేనలోకి శ్రీనివాసులు.. సస్పెండ్ చేసిన వైసీపీ

అమరావతి/చిత్తూరు, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జనసేనలో చేరనున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఆయన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను హైదరాబాద్‌లో కలిశారు. వైసీపీలో సీఎం జగన్ తనకు అన్యాయం చేశారని.. 2019 ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన తనను అవమానించారని శ్రీనివాసులు చెప్పారు. తనకు అవకాశం కల్పిస్తే రాజంపేట లోక్‌సభ స్థానంలో పోటీకి సిద్ధమని తెలిపినట్లు తెలిసింది. ఆయన పార్టీలో చేరేందుకు అంగీకరించిన పవన్.. టికెట్ విషయమై ఆలోచిస్తామని, సర్వే రిపోర్టులు కూడా పరిశీలించాక తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పినట్లు సమాచారం. నాలుగు రోజుల్లో ఆయన పార్టీలో చేరనున్నట్లు జనసేన వర్గాలు తెలిపాయి. ఆయన్ను జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ పార్టీ అధినేత వద్దకు తీసుకెళ్లారు. ఆయన రాకతో రాయలసీమలో పార్టీ బలం పుంజుకుంటుందని కిరణ్ ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా.. పవన్‌తో భేటీ అయిన ఆరణి శ్రీనివాసులును వైసీపీ నాయకత్వం సస్పెండ్ చేసింది. ముఖ్యమంత్రి జగన్ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. శ్రీనివాసులును కాదని ఎర్రచందనం స్మగ్లింగ్ కేసులున్న ఆర్టీసీ మాజీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డిని గత నెలలోనే చిత్తూరు అసెంబ్లీ ఇన్‌చార్జిగా నియమించింది. ఆయన్ను రాజ్యసభకు పంపిస్తామని ప్రకటించి.. చివరిలో మొండిచేయి చూపించి మేడా రఘునాథరెడ్డికి అవకాశమిచ్చింది. కాగా, రాయలసీమ జిల్లాలతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఇప్పుడు ఎక్కడా వైసీపీ అసెంబ్లీ ఇన్‌చార్జుల్లో బలిజ సామాజిక వర్గానికి చెందినవారు లేరు. చిత్తూరులో ఆరణిని కాదని విజయానందరెడ్డికి ఇచ్చినట్లే.. ప్రకాశం జిల్లా దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్‌ను కాదని శివప్రసాద్‌రెడ్డికి టికెట్ ఇచ్చారు. ఈ ఆరు జిల్లాల్లో ఇద్దరు బలిజ ఎమ్మెల్యేలను కాదని వైసీపీ అధిష్ఠానం రెడ్డి సామాజిక వర్గానికి టికెట్లు ఇవ్వడంపై బలిజ సంఘం నాయకులు ఆగ్రహంతో ఉన్నారు.

టీడీపీ అభ్యర్థి గురజాలకు సీకే బాబు మద్దతు

చిత్తూరు, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు రాజకీయాలు వేడెక్కాయి. వైసీపీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జనసేనలో చేరనుండగా.. మాజీ ఎమ్మెల్యే సీకే బాబు టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్‌కు మద్దతు ప్రకటించారు. చిత్తూరులో ఓసారి స్వతంత్ర అభ్యర్థిగా, మూడుసార్లు కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన బాబు.. కొన్నాళ్లుగా రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు. ఆదివారం తన ఆత్మీయులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి.. టీడీపీ అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. అలాగే జగన్‌మోహన్‌కు సంఘీభావంగా బెంగళూరులో నిర్మాణ రంగంలో స్థిరపడిన ఆంధ్రులు ఆదివారం అక్కడి నుంచి సుమారు 400 కార్లలో చిత్తూరుకు ర్యాలీగా వచ్చారు. నగరంలోని ఓ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. దీంతో పాటు చిత్తూరులో కీలకమైన బలిజ సంఘం నాయకులు కూడా ఆదివారం సమావేశమై టీడీపీ అభ్యర్థికే మద్దతు ప్రకటించారు.

ముగ్గురు చొప్పున అభ్యర్థుల ఎంపిక

» పొత్తు నిర్ణయం అధిష్ఠానానిదే: పురందేశ్వరి



అమరావతి, మార్చి 3(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో 175 అసెంబ్లీ, 25పార్లమెంటు స్థానాల్లో పోటీకి అభ్యర్థుల్ని సిద్ధం చేశామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి వెల్లడించారు. ఏ నియోజక వర్గానికి ఏ అభ్యర్థి బాగుంటారనే దానిపై రెండు రోజుల పాటు కేంద్ర పార్టీ ముఖ్యుడు శివ ప్రకాశ్‌తో కలిసి స్ర్కీనింగ్ కమిటీ చర్చించింది. మొత్తం కసరత్తు పూర్తయ్యాక సమావేశ వివరాలను పురందేశ్వరి వివరించారు. కార్యకర్తలు, మేనిఫెస్టో కమిటీ అభిప్రాయాలు తీసుకుని మొత్తం దరఖాస్తుల్లో ఒక్కో నియోజక వర్గానికి మూడింటిని ఎంపిక చేశామని చెప్పారు. వాటిని కేంద్ర నాయకత్వానికి పంపుతామని, పార్లమెంటరీ కమిటీ తుది జాబితా ఖరారు చేస్తుందన్నారు. రాష్ట్రంలో పొత్తుల గురించి ఢిల్లీ అధిష్ఠానమే నిర్ణయం తీసుకొంటుందని, అభ్యర్థుల ఎంపిక తాము చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా యాభై వేల మంది ప్రజల్ని కలిసి మేనిఫెస్టో తుది రూపకల్పన చేస్తామని చెప్పారు.

మోదీ హయాంలోనే మహిళా సాధికారత

ఎస్సీ కమిషన్ తరహాలో ఓబీసీ కమిషన్‌కు చట్టబద్ధత కల్పించింది నరేంద్ర మోదీ ప్రభుత్వమేనని పురందేశ్వరి అన్నారు. రాష్ట్రంలో ఎన్టీఆర్ తర్వాత దేశంలో వెనుకబడిన వర్గాల గురించి ఆలోచన చేస్తున్న నేత మోదీ మాత్రమేనని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు, అన్నమయ్య జిల్లాకు చెందిన పలువురు పారిశ్రామికవేత్తలు, వందలాది మంది మహిళలు ఆదివారం ఆమె సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా పురందేశ్వరి మాట్లాడుతూ మహిళా సాధికారత కోసం పాటు పడుతున్న ప్రధాని మోదీ ప్రభుత్వం స్వయం శక్తితో నారీమణులు నిలబడేందుకు తోడ్పాటునందిస్తోందని చెప్పారు.

'ఇండియా' ఎన్నికల భేరి!

పట్నాలో భారీస్థాయిలో 'జనవిశ్వాస్ మహా ర్యాలీ'.. రాహుల్, ఖర్గే, అఖిలేశ్, లాలూ హాజరు

పట్నా, మార్చి 3: లోక్‌సభ ఎన్నికలకు విపక్ష 'ఇండియా' కూటమి ప్రచార భేరి మోగించింది. ఆదివారం బిహార్ రాజధాని పట్నాలో భారీ ర్యాలీ నిర్వహించింది. ఆ రాష్ట్రంలో 'ఇండియా' కూటమికి సారథ్యం వహిస్తున్న ఆర్జేడీ.. 'జనవిశ్వాస్ మహా ర్యాలీ' పేరిట పెద్దఎత్తున బహిరంగ సభ నిర్వహించింది. తేజస్వి యాదవ్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 'జన విశ్వాస యాత్ర' ముగింపు సందర్భంగా నిర్వహించిన ఈ ర్యాలీ సంపూర్ణంగా విజయవంతమైంది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే, సమాజ్‌వాదీ, ఆర్జేడీ, వామపక్షాల అగ్ర నేతలు, అఖిలేశ్ యాదవ్, లాలూప్రసాద్ యాదవ్, తేజస్వి, సీతారాం ఏచూరి, డి.రాజా, దీపాంకర్ భట్టాచార్య తదితరులు హాజరయ్యారు. మధ్యప్రదేశ్‌లో భారత్ జోడో న్యాయ యాత్రలో ఉన్న కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ కూడా పట్నా వచ్చి ర్యాలీలో పావుగంట సేపు మాట్లాడి.. మైకు ఖర్గేకు ఇచ్చి తిరిగి వెళ్లిపోయారు. బిహార్లోని మహాకూటమితో తెగతెంపులు చేసుకుని తిరిగి ఎన్డీయూ గూటికి చేరిన సీఎం నితీశ్‌కుమార్‌పై వారంతా విరుచుకుపడ్డారు. 17 నెలలపాటు ఉపముఖ్యమంత్రిగా ఉన్న తేజస్వి రాష్ట్రంలో పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించారని ఖర్గే కొనియాడారు. నితీశ్ మళ్లీ కూటమి మారే అవకాశం ఉందని.. ఇక ఆయన్ను ఆహ్వానించవద్దని సూచించారు. లాలూ యథాప్రకారం నితీశ్‌పై చెణుకులు విసిరారు. 2017లో కూడా ఇలాగే ఆయన ఫిరాయించారు. అప్పుడు ఆయన్ను నేను దూషించలేదు. పల్టూరామ్ అని మాత్రమే అన్నాను. ఆ బిరుదు ఆయన చర్యలకు అనుగుణంగానే ఉంది. సోషల్ మీడియాలో ఆయనపై వ్యంగ్య వీడియోలు వచ్చాయి. అవి చూశాకైనా ఆయన సిగ్గుపడలేదా' అని వ్యాఖ్యానించారు. ఈసారి మళ్లీ తన వద్దకు వస్తే ఆయన్ను బయటకు నెట్టేస్తానని స్పష్టం చేశారు. రాజకీయాల్లో కుటుంబ పాలనను విమర్శిస్తున్న ప్రధాని మోదీపై మండిపడ్డారు. 'మోదీకి సొంత కుటుంబం లేకపోతే నేనేం చేస్తాను? ఆయనెప్పుడూ రామాలయం గురించి మాట్లాడుతుంటారు. ఆయన అసలైన హిందువే కాదు. హిందూ సంప్రదాయంలో తల్లి చనిపోతే గుండు చేయించుకుంటారు. మోదీ చేయించుకోలేదు' అని వ్యాఖ్యానించారు. యూపీ, బిహార్లలో కలిపి మొత్తం 120 లోక్‌సభ స్థానాలు ఉన్నాయని.. ఈ రాష్ట్రాల్లో ఆ పార్టీని ఓడిస్తే కేంద్రంలో అది అధికారంలోకి రావడం అసాధ్యమని అఖిలేశ్ అన్నారు. 'కొన్ని సార్లు ఇక్కడకు వెళ్తారు.. కొన్ని సార్లు అక్కడకు వెళ్తారు.. జారిపడతారు' అని నితీశ్‌ను తేజస్వి ఎద్దేవాచేశారు. ఈ ర్యాలీకి రాష్ట్రవ్యాప్తంగా ఆర్జేడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ ర్యాలీలో పాల్గొనేందుకు కేరళ ఆర్జేడీ అధ్యక్షుడు ఎంవీ శ్రేయమ్స్‌కుమార్ ప్రత్యేకంగా అక్కడి నుంచి వచ్చారు.



జనవిశ్వాస్ ర్యాలీలో రాహుల్, తేజస్వీ, అఖిలేశ్

అట్టడుగు వర్గాలకు మోదీ సర్కారు అన్యాయం

పట్నా/న్యూఢిల్లీ, మార్చి 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో అట్టడుగు వర్గాలకు చెందిన 73% జనాభాను మోదీ సర్కారు నిర్లక్ష్యం చేస్తోందని రాహుల్‌గాంధీ మండిపడ్డారు. 'జనవిశ్వాస్ ర్యాలీ'లో పాల్గొన్న ఆయన.. బీజేపీపై పరోక్ష విమర్శలు చేశారు. 'ఒక పార్టీ' ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తోందని.. అయితే తాము విద్వేషపు మార్కెట్‌లో ప్రేమ దుకాణం తెరిచామని వ్యాఖ్యానించారు. 'అగ్నిపథ్' రిక్రూట్‌మెంట్ స్కీంకు వ్యతిరేకంగా బిహార్‌లో జరిగిన ఆందోళనలను గుర్తు చేసిన ఆయన.. యువతను ఈ మోదీ సర్కారు పట్టించుకోదంటూ విమర్శించారు. కాగా, పేద, మధ్య తరగతి ప్రజలకు రైల్వేను దూరం చేసే కుట్ర జరుగుతుందని రాహుల్ ఆరోపించారు. సంపన్నులను దృష్టిలో ఉంచుకునే రైల్వేలో కొత్త విధానాలను కేంద్రం ప్రవేశపెడుతోందన్నారు.

వచ్చే ఐదేళ్లలో ఏం చేద్దాం?

- మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రి మండలి రోజంతా మేధోమథనం
- ఎన్నికల్లో విజేతలై రావాలంటూ మంత్రులకు మోదీ వీడ్కోలు సందేశం



న్యూఢిల్లీ, మార్చి 3: వచ్చే ఎన్నికల తర్వాత మళ్లీ తమ ప్రభుత్వమే ఏర్పాటవుతుందన్న నమ్మకంతో ఉన్న ప్రధాన మోదీ.. కొత్త సర్కారు ఏర్పడిన వెంటనే చేపట్టాల్సిన కార్యాచరణపై మంత్రిమండలి సమావేశాన్ని నిర్వహించారు. మోదీ అధ్యక్షతన గురువారం సమావేశమైన కేంద్ర మంత్రి మండలి.. వచ్చే రెండు దశాబ్దాలకు సంబంధించిన వికసిత్ భారత్-2047 విజన్ డాక్యుమెంట్‌పై, వచ్చే ఐదేళ్లకు సంబంధించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికపై రోజంతా మేధోమథనం జరిపింది. ఈ మేరకు వీటి తక్షణ అమలు కోసం.. లోక్‌సభ ఎన్నికలు ముగిసిన తర్వాత మే నెలలో ప్రభుత్వం ఏర్పాటు కాగానే 100 రోజుల్లో చేపట్టాల్సిన కార్యాచరణపైనా చర్చించారు. కొత్త ప్రభుత్వం చేపట్టాల్సిన పనులపై స్పష్టమైన ప్రణాళికలతో రావాలని భేటీకి ముందు మంత్రులను ప్రధాని ఆదేశించారు. దీంతో పలువురు మంత్రులు, కార్యదర్శులు తమ ఆలోచనలను సమావేశంలో పంచుకున్నారు. వివిధ అంశాలపై ప్రజెంటేషన్లు కూడా ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ, కొత్త ప్రభుత్వం జూన్ నెలలో ప్రవేశపెట్టే పూర్తిస్థాయి బడ్జెట్ ద్వారా వికసిత్ భారత్ దిశగా అడుగులు వేయాలని, బడ్జెట్‌లో అది ప్రతిఫలించాలని పిలుపునిచ్చారు. ఆవిష్కరణల రంగంలో భారత్‌ను అగ్రగామిగా నిలిపేలా భవిష్యత్ టెక్నాలజీలను అభివృద్ధి చేయటానికి వీలుగా బడ్జెట్‌లో రూ.ఒక లక్ష కోట్ల భారీ నిధులను కేటాయించే అంశంపై మోదీ మాట్లాడారు.

ప్రజల మనసులను గెలవండి!

లోక్‌సభ ఎన్నికలకు రంగం సిద్ధమైన నేపథ్యంలో మంత్రులకు ప్రధాని మోదీ పలు సూచనలు కూడా చేసినట్లు సమాచారం. వివాదాలకు దూరంగా ఉండాలని, ముఖ్యంగా ఇటీవల తీవ్ర వివాదాస్పదమవుతున్న డీప్‌ఫేక్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని మంత్రులను ఆయన హెచ్చరించారు. మాట్లాడే ప్రతీ మాట పట్లా జాగ్రత్తగా ఉండాలని మోదీ చెప్పినట్లుగా సంబంధిత వర్గాలు తెలిపాయి. 'వెళ్లండి.. ఎన్నికల్లో విజేతలుగా నిలవండి.. మిమ్మల్ని నేను మళ్లీ కలుస్తా' అని మోదీ వారికి వీడ్కోలు సందేశం ఇచ్చారు. కాగా, మంత్రిమండలి మేధోమథనం నేపథ్యంలో.. వికసిత్ భారత్-2047 గురించి ప్రభుత్వ వర్గాలు వివరాలు వెల్లడించాయి. ఈ డాక్యుమెంట్ రూపకల్పన కోసం డిసెంబరు 2021 నుంచి ఈ ఏడాది జనవరి వరకూ కేంద్ర మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో 2,700కుపైగా సమావేశాలు, వర్క్‌షాపులు వివిధ స్థాయిల్లో జరిగాయని వెల్లడించాయి.



సీఎం చిత్రపటానికి మద్యంతో అభిషేకం

శ్రీకాళహస్తి, మార్చి 3: మద్యపాన నిషేధం అమలు చేయలేదని నిరసిస్తూ సీఎం జగన్ చిత్రపటానికి జనసేన నాయకులు మద్యంతో అభిషేకం చేశారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలోని రామసేతు వంతెన వద్ద ఉన్న మద్యం దుకాణం ఎదుట ఆదివారం శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జి వినుత ఆధ్వర్యంలో వీర మహిళలు సీఎం చిత్రపటాన్ని ఉంచి మద్యంతో అభిషేకించారు. అక్కడే మద్యం సీసాలను పగలగొట్టారు. ఈ సందర్భంగా వినుత మాట్లాడుతూ.. ఓట్ల కోసం మహిళలకు మాయ మాటలు చెప్పి.. అధికారంలోకి వచ్చాక వారి పుస్తెలను తెంచుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మద్యపాన నిషేధం అమలు చేయాలంటూ మద్యం దుకాణం నుంచి పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

పాక్ ప్రధానిగా షహబాజ్



ఇస్లామాబాద్, మార్చి 3: పాకిస్థాన్ నూతన ప్రధాన మంత్రిగా పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్) అధ్యక్షుడు షహబాజ్ షరీఫ్(72) వరుసగా రెండోసారి ఎన్నికయ్యారు. నేషనల్ అసెంబ్లీలో ఆదివారం నిర్వహించిన ఓటింగ్‌లో పీఎంఎల్-ఎన్, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) తరఫు అభ్యర్థి షహబాజ్‌కు 201 ఓట్లు వచ్చాయి. మొత్తం 336మంది సభ్యుల పార్లమెంట్‌లో సభా నాయకుడు కావడానికి అవసరమైన దానికంటే ఆయన 32ఓట్లు ఎక్కువ సాధించారు. దీంతో పాక్ 24వ ప్రధానిగా షహబాజ్‌ను నియమిస్తూ నేషనల్ అసెంబ్లీ స్పీకర్ సర్దార్ అయాజ్ సాదిక్ ప్రకటన చేశారు.

అపరిచిత మహిళను 'డార్లింగ్' అనడం తప్పే

కోల్‌కతా, మార్చి3: పరిచయం లేని మహిళను 'డార్లింగ్' అని పిలవడం తప్పేనని కలకత్తా హైకోర్టు పోర్టుబ్లెయిర్ బెంచ్ స్పష్టం చేసింది. ఇది లైంగిక వేధింపుల కిందకి వచ్చే వ్యాఖ్యని అభిప్రాయపడింది. లైంగిక దృష్టి తో చేసిన ఇలాంటి మాటలకు ఐపీసీలోని సెక్షన్ 354ఏ ప్రకారం శిక్షలు విధించాల్సి ఉంటుందని జస్టిస్ జయ్ సేన్‌గుప్తా ఏకసభ్య ధర్మాసనం తెలిపింది. ముద్దాయికి నెల రోజుల జైలు శిక్ష విధించింది. అపరిచితుల పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడాన్ని భారత సమాజం అంగీకరించదని పేర్కొంది. గతేడాది అండమాన్ దీవుల్లోని మాయాబందర్‌లో దుర్గా పూజ వద్ద గొడవ జరుగుతోందంటూ సమాచారం అందడంతో ఒక మహిళా కానిస్టేబుల్ సహా పోలీసు బృందం అక్కడికి వెళ్లింది. మద్యం మత్తులో ఉన్న జనక్ రాం అనే నిందితుడు ఆ మహిళా పోలీసును ఉద్దేశించి 'క్యా డార్లింగ్ చలాన్ కర్నే ఆయా హైక్యా?' (డార్లింగ్, చలానా రాయడానికి వచ్చారా?) అన్నాడు. దీన్ని అవమానకరంగా భావించిన ఆ కానిస్టేబుల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది.

బీజేపీకి మోదీ రూ. 2వేల విరాళం

లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ విరాళాలకు బీజేపీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీకి 'పార్టీ ఫండ్'గా రూ.2 వేలు విరాళంగా ఇచ్చారు. ఈ విషయాన్ని ఆయన ఆదివారం 'ఎక్స్' వేదికగా ప్రకటించారు. పౌరులందరూ నమో యాప్ ద్వారా తమకు తోచినంత చందా ఇవ్వాలని, 'దేశ నిర్మాణం కోసం విరాళం' (డొనేషన్ ఫర్ నేషన్ బిల్డింగ్)లో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. "వికసిత భారత్ కోసం మన ప్రయత్నాలను బలోపేతం చేయాలి. ఇందుకు ప్రతి పౌరుడు నమో యాప్ ద్వారా విరాళం ఇవ్వాలని కోరుతున్నా" అని మోదీ 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

పీక మీద కత్తి పెట్టి.. ఏడుగురు రేప్ చేశారు..

ఝార్ఖండ్‌లో తనపై జరిగిన దారుణాన్ని ఇన్‌స్టాలో వెల్లడించిన స్పెయిన్ యువతి

న్యూఢిల్లీ, మార్చి 3: దక్షిణాసియా పర్యటన కోసం ఎక్కడో స్పెయిన్ నుంచి బైక్‌లపై భారత్‌కు వచ్చిన పర్యాటకులు(ట్రావెల్ వ్లోగర్స్) ఆ దంపతులు. అయితే, భారత పర్యటన వారికి పీడకల మిగిల్చింది. ఆ జంటలోని 28 ఏళ్ల మహిళపై ఏడుగురు సామూహిక అత్యాచారానికి తెగబడ్డారు. ఆ దంపతుల పీక మీద కత్తి పెట్టి, వారిని కొట్టి, హింసించి ప్రాణం తీస్తామని బెదిరించి ఆ మహిళపై అత్యాచారానికి పాల్పడ్డారా కిరాతకులు. దేశానికే కళంకం తెచ్చిన ఈ ఘటన ఝార్ఖండ్‌లోని దుమ్‌కా జిల్లాలో శుక్రవారం రాత్రి జరగ్గా... తనకు ఎదురైన చేదు అనుభవాన్ని వివరిస్తూ బాధితురాలు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పోస్ట్ చేసింది. "మేము ఆస్పత్రిలో ఉన్నాం. మాకు జరిగింది మరెవరికీ జరగకూడదు. నన్ను, నా భర్తను కొట్టారు. పీక మీద కత్తి పెట్టి చంపేస్తామని బెదిరించారు. నన్ను ఏడుగురు రేప్ చేశారు. మా వస్తువులను ఎత్తుకెళ్లారు" అని ఆమె వీడియోలో పేర్కొంది. కాగా, శుక్రవారం అర్ధరాత్రి తర్వాత అటుగా వచ్చిన పోలీసు వాహనాన్ని ఆపి తమకు జరిగిన దారుణాన్ని ఆ మహిళ వెల్లడించడంతో విషయం తమకు తెలిసిందని స్థానిక పోలీసులు వెల్లడించారు. దుమ్‌కా వద్ద ఓ నిర్మానుష్య ప్రదేశంలో తాత్కాలిక గుడారాన్ని వేసుకుని రాత్రి తాము నిద్రిస్తుండగా స్థానిక యువకులు లోపలికి ప్రవేశించి దాడి చేసి అత్యాచారానికి పాల్పడ్డారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ కేసులో ఏడుగురు నిందితులను గుర్తించామని వారిలో నలుగురిని ఇప్పటికే అరెస్టు చేశామని పోలీసులు ప్రకటించారు.

ప్రేమ విఫలమై ఆత్మహత్య చేసుకుంటే యువతి బాధ్యత లేదు

ముంబై, మార్చి 3: ప్రేమ విఫలమై మానసిక క్షోభతో యువకుడు ఆత్మహత్య చేసుకుంటే అందుకు యువతే కారణమని చట్టప్రకారం చెప్పలేమని ముంబయి కోర్టు తెలిపింది. ఆత్మహత్యకు ప్రేరేపించినట్టుగా భావించి శిక్ష విధించలేమని పేర్కొంది. ప్రేమను తిరస్కరించడం కారణంగా మానసిక ఒత్తిడికి లోనయ్యే సంఘటనల విషయమై చట్టంలో ఎలాంటి నిబంధనలు లేవని స్పష్టం చేసింది. ఈ మేరకు ముంబైలోని అదనపు సెషన్స్ జడ్జి ఎస్.పి.మెహతా తీర్పు చెప్పారు. మనీషా చూడాసమ, నితిన్ కేనీలు తొలుత ప్రేమించుకొని విడిపోయారు. ఆ తరువాత మనీషా రాజేష్ పన్వర్ అనే యువకునితో స్నేహం చేసింది. అయినా నితిన్ ఆమె వెంటపడడం మానలేదు. చివరకు మానసిక ఒత్తిడిని తట్టుకోలేక నితిన్ 2016 జనవరి 15న ఇంట్లోనే ఆత్మహత్య చేసుకున్నాడు. అతని ఆత్మహత్యకు మనీషా, రాజేష్‌లే కారణమంటూ కేసు నమోదైంది. చట్టంలో తగిన నిబంధనలు లేనందున ఆత్మహత్యకు ప్రేరేపించారంటూ వారిపై ఎలాంటి చర్యలు తీసుకోలేమని జడ్జి పేర్కొన్నారు. "ఇష్టం వచ్చినట్టు ప్రియుడ్ని మార్చడం నైతికంగా తప్పే. కానీ, ఆత్మహత్యకు ప్రేమికురాలే కారణమని కేసు పెట్టే అవకాశం లేదు" అని జడ్జి తెలిపారు.

బీజేపీలో టికెట్ల చిచ్చు

న్యూఢిల్లీ, మార్చి3: బీజేపీలో టికెట్ల చిచ్చు రేగింది. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ప్రకటించిన తొలి జాబితాలో టికెట్ దక్కని పలువురు నాయకులు అలకబూనారు. ప్రధానంగా కేంద్ర ఆరోగ్యశాఖ మాజీ మంత్రి, ఢిల్లీకి చెందిన డాక్టర్ హర్షవర్ధన్ తీవ్రంగా నొచ్చుకున్నారు. ఈ క్రమంలో ఆయన ఏకంగా రాజకీయాలనే వదిలేస్తున్నట్టు ప్రకటించారు. 69 ఏళ్ల హర్షవర్ధన్.. ఢిల్లీలోని చాందినీ చౌక్ నియోజకవర్గం నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీజేపీ తొలి జాబితాలో ఈ సీటును వేరే వారికి కేటాయించడంతో ఆదివారం ఆయన స్పందిస్తూ రాజకీయాల నుంచి తాను విరమించుకుంటున్నట్టు తెలిపారు. బీజేపీ తొలి జాబితాలో ఢిల్లీకి చెందిన నలుగురు సిటింగ్ ఎంపీలను పక్కన పెట్టింది. వీరిలో హర్షవర్ధన్‌తోపాటు పర్వేశ్ వర్మ, రమేశ్‌బిధురి, మీనాక్షి లేఖి ఉన్నారు. ఇక, టికెట్ ఇచ్చినా పోటీ చేయబోనని పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీజేపీ నేత, నటుడు పవన్‌సింగ్ వెల్లడించారు. బీజేపీ ప్రకటించిన తొలి జాబితాలో బెంగాల్‌లోని అసన్‌సోల్ నియోజకవర్గం అభ్యర్థిగా పవన్ సింగ్‌ను ప్రకటించారు. అయితే, పవన్ తాను పోటీ చేయబోనని తేల్చి చెప్పారు. కొన్ని కారణాల రీత్యా నేను పోటీ చేయదలుచుకోలేద ని పవన్ సింగ్ 'ఎక్స్'లో వెల్లడించారు. కాగా, పవన్ నిర్ణయంపై అధికార పార్టీ టీఎంసీ నేతలు ఎద్దేవా చేశారు. "పోటీకి ముందే చేతులెత్తాశారు" అని వ్యాఖ్యలు చేశారు.

బీఎస్‌ఎఫ్‌లో తొలి మహిళా స్నైపర్‌గా సుమన్ కుమారి



న్యూఢిల్లీ, మార్చి 3: బీఎస్‌ఎఫ్ దళంలో తొలి మహిళా స్నైపర్‌గా సబ్ ఇన్‌స్పెక్టర్ సుమన్ కుమారి గుర్తింపు పొందారు. ఇండోర్‌లోని సెంట్రల్ స్కూల్ ఆఫ్ వెపన్స్ అండ్ టాక్టిక్స్ (సీఎస్‌డబ్ల్యూటీ)లో ఎనిమిది వారాల పాటు శిక్షణ పొంది ఈ ఘనతను సాధించారు. బీఎస్‌ఎఫ్ జవాన్లకు కమాండో శిక్షణ తరువాత అత్యంత కఠినమైన స్నైపర్ శిక్షణ ఇస్తారు. మొత్తం 56 మంది ఈ శిక్షణ పొందగా అందులో ఏకైక మహిళ సుమన్ కుమారే కావడం విశేషం. ఈ శిక్షణలో ప్రతిభ చూపించిన వారికి ఆల్ఫా, బ్రేవో గ్రేడ్లు ఇస్తారు. అయితే ఆమెకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించిన ఇన్‌స్ట్రక్టర్ గ్రేడ్ ఇచ్చినట్టు ఆ శిక్షణ కేంద్రం ఇన్‌స్పెక్టర్ జనరల్ భాస్కర్ సింగ్ రావత్ చెప్పారు. దీంతో ఆమె స్నైపర్లకు శిక్షణ ఇచ్చే స్థాయిని పొందారని వివరించారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ జిల్లా సుమన్ కుమారి స్వస్థలం.

మత విద్వేష ప్రచారకులకు బ్రిటన్‌లో ప్రవేశం నిషేధం!

లండన్, మార్చి 23: తీవ్రవాద ఇస్లామిక్ భావజాలంతో విద్వేషపూరిత ప్రసంగాలు చేసే ముస్లిం ప్రచారకులను దేశంలోకి రానీయకూడదని బ్రిటన్ నిర్ణయించింది. ముఖ్యంగా పాకిస్థాన్, అఫ్ఘానిస్థాన్, ఇండోనేషియా వంటి దేశాల వారికి ఇది వర్తించనుంది. ఈ మేరకు ప్రభుత్వం నిబంధనలు రూపొందించనుందని ఆదివారం మీడియా వర్గాలు వెల్లడించాయి. శుక్రవారం ప్రధాని రిషి సునాక్ తన అధికారిక నివాసంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ తీవ్రవాదుల కారణంగా దేశ ప్రజాస్వామ్యానికి, బహుళ మత విశ్వాసాలకు నష్టం కలుగుతోందని చెప్పారు. అలాంటి వారిని దేశంలోకి రానీయబోమని తెలిపారు.

అయ్యో ఆంధ్రప్రదేశ్

- పట్టణ ప్రాంత తలసరి వినియోగ వ్యయంలో 15వ స్థానంలో ఏపీ, ఫస్ట్ ప్లేస్‌లో తెలంగాణ

హైదరాబాద్, మార్చి 3(ఆంధ్రజ్యోతి): నెలవారీ తలసరి వినియోగ వ్యయం(ఎంపీసీఈ) విషయంలో.. గ్రామీణ, పట్టణ ప్రాంతాలు రెండింటిలోనూ ఆంధ్రప్రదేశ్ పరిస్థితి దారుణంగా ఉంది. పొరుగు రాష్ట్రం తెలంగాణతో పోల్చుకుంటే మరింత దుర్భరంగా ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఏపీలో ఈ వ్యయం పట్టణ ప్రాంతాల్లో రూ.6,782(జాతీయ స్థాయిలో 15వ స్థానం) ఉండగా, గ్రామీణ ప్రాంతాల్లో రూ.4,870(జాతీయ స్థాయిలో 11వ స్థానం)గా ఉంది. ఇక, తెలంగాణలో ఈ వ్యయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.4,802గా ఉండగా.. పట్టణ ప్రాంతాల్లో రూ.8,158గా ఉన్నట్టు జాతీయ గణాంక సర్వే కార్యాలయం నిర్వహించిన 'గృహ వినియోగ వ్యయ సర్వే(హెచ్‌సీఈఎస్): 2022-23'లో వెల్లడైంది. ఇక, జాతీయ స్థాయిలో ఈ సగటు.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వరుసగా రూ.3,773, రూ.6,459గా ఉండడం గమనార్హం. దేశవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో ఎంపీసీఈ అధికంగా ఉన్న రాష్ట్రాల జాబితాలో వరుసగా సిక్కిం(రూ.12,105), గోవా(రూ.8,734), అరుణాచల్ ప్రదేశ్(రూ.8,636), ఢిల్లీ(రూ.8,217) తొలి 4 స్థానాల్లో ఉండగా.. తెలంగాణ రూ.8,158 ఖర్చుతో ఐదో స్థానంలో నిలిచింది. ఆంధ్రప్రదేశ్(రూ.6,782) 15వ స్థానంలో ఉంది. గ్రామీణ ప్రాంతాల ఎంపీసీఈ అధికంగా ఉన్న రాష్ట్రాల జాబితాలో తెలంగాణ(రూ.4,802) టాప్ టెన్‌లో కూడా లేకపోవడం గమనార్హం. ఏపీ ఈ జాబితాలో రూ.4,870 వ్యయంతో 11వ స్థానంలో నిలిచింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆదాయాల నడుమ భారీగా పెరుగుతున్న అంతరానికి ఇది సూచిక అని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వాలు.. పట్టణ ప్రాంతాల అభివృద్ధిపై మాత్రమే దృష్టిపెట్టడం దీనికి కారణమని విశ్లేషిస్తున్నారు.

ఉత్తరాది పెద్ద రాష్ట్రాల కన్నా..

దక్షిణాదిన ఉన్న ఐదు రాష్ట్రాలను పరిగణనలోకి తీసుకుంటే పట్టణ ప్రాంతాల ఎంపీసీఈ సగటు విషయంలో తెలంగాణే అగ్రస్థానంలో ఉంది. ఇక.. ఉత్తరాదిన ఉన్న పలు రాష్ట్రాల గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఎంపీసీఈ దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే చాలా తక్కువగా ఉండడం గమనార్హం. ప్రధాని మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్.. పట్టణ ప్రాంత ఎంపీసీఈ రూ.6,621. ఇది తెలంగాణ, దక్షిణ భారతదేశంలోని ఐదు రాష్ట్రాల్లో ఈ కేటగిరీలో అట్టడుగున ఉన్న ఏపీ పట్టణ ప్రాంత ఎంపీఈసీ(రూ.6,782) కన్నా తక్కువ ఇది. ఉత్తరప్రదేశ్ అర్బన్ ఎంపీసీఈ కేవలం రూ.5,040 కాగా.. మధ్యప్రదేశ్ అర్బన్ ఎంపీసీఈ అంతకన్నా తక్కువ.. రూ.4,987. రాజస్థాన్ అర్బన్ ఎంపీసీఈ రూ.5,913. ఆయా రాష్ట్రాల గ్రామీణ ప్రాంత ఎంపీసీఈ కూడా దక్షిణాది రాష్ట్రాలన్నింటి కన్నా తక్కువే!! ఇక ఈ సర్వేలో తేలిన మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే.. ప్రజలు తమ ఆదాయంలో అత్యధికం ఆహారేతర(టీవీ, రిఫ్రిజిరేటర్, శీతలపానీయాలు, ప్రాసెస్డ్ ఫుడ్, వైద్యం, రవాణా, అద్దె వంటి) అవసరాలకే ఖర్చు పెడుతున్నారు. సాధారణంగా దేశంలో ప్రజలు తమకు వచ్చే ఆదాయంలో అత్యధిక భాగం ఆహార అవసరాలకు ఖర్చుపెడితే.. అలా పెట్టాల్సి వస్తే.. అది అభివృద్ధి సూచిక కాదని ఆర్థిక నిపుణులు పేర్కొంటారు. తమకు వచ్చే దాంట్లో కొంత మేర ఆహారానికి పెట్టి.. ఇతరత్రా అవసరాలకు ఎక్కువ వినియోగించగలిగే అవకాశం వారికి ఉండడం పురోగతికి సూచన అని చెబుతారు. అంటే.. సంపాదించుకునే దాంట్లో ఎక్కువ మొత్తం తిండికే ఖర్చుపెట్టాల్సిన అవసరం లేకుండా ఇతరత్రా అవసరాలకూ ఖర్చుపెట్టగలిగే స్వేచ్ఛ వచ్చిందనడానికి సూచన అది. ఈ నివేదిక చెబుతున్నది కూడా అదే. దీని ప్రకారం..

- గడిచిన పదేళ్లలో దేశవ్యాప్తంగా బియ్యం, పప్పు దినుసుల వినియోగం గణనీయంగా తగ్గింది. 2011-12లో గ్రామీణ ప్రాంతాల్లో ఒక కుటుంబం నెలవారీ ఖర్చు బియ్యం, పప్పు దినుసులపై 10.69% ఉండగా.. ఇప్పుడది 4.89 శాతానికి తగ్గింది. పట్టణ ప్రాంతాల్లో ఇది 6.61 నుంచి 3.62 శాతానికి తగ్గింది. అలాగే.. కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, మంచి నూనె, ఉప్పు, చక్కర వినియోగంలోనూ తగ్గుదల నమోదైంది.
- సిగరెట్, మద్యంపై ఖర్చులు గ్రామీణ ప్రాంతాల్లో 3.21% నుంచి 3.79 శాతానికి.. అర్బన్‌లో 1.61% నుంచి 2.43 శాతానికి పెరిగాయి.
- విద్యపై ఖర్చు గతంతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో 3.49% నుంచి 3.3 శాతానికి.. పట్టణాల్లో 6.9% నుంచి 5.78 శాతానికి తగ్గింది.

దక్షిణాది రాష్ట్రాల్లో ఇలా..

ఉత్తరాదిన ఉన్న పలు రాష్ట్రాలతో పోలిస్తే గ్రామీణ, పట్టణ ప్రాంత నెలవారీ, తలసరి వినియోగ వ్యయం దక్షిణాది ఐదు రాష్ట్రాల్లోనే ఎక్కువ. మన ఐదు రాష్ట్రాల పరిస్థితిని పరిశీలిస్తే..

గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీసీఈ	
కేరళ	5,924
తమిళనాడు	5,310
ఆంధ్రప్రదేశ్	4,870
తెలంగాణ	4,802
కర్ణాటక	4,397

పట్టణ ప్రాంతాల్లో ఎంపీసీఈ	
తెలంగాణ	8,158
కర్ణాటక	7,630
తమిళనాడు	7,630
కేరళ	7,078
ఆంధ్రప్రదేశ్	6,782

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.